PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 192 | విజయవాడ, శనివారం 17 ఫిబ్రవరి 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Saturday 17 February 2024 | Rs

నో కామెంట్

- ఎన్నికల బాండ్ల తీర్పుపై ఇసి నుంచి స్పందన నిల్
- గతంలో అభ్యంతరాలు
- పథకాన్ని పట్టుబట్టి తీసుకొచ్చిన మోడీ ప్రభుత్వం

7

ఎన్నికల బాండ్లను స్వీకరించలేదు

- ఖాతా కూడా ప్రారంభించలేదు : సిపిఎం

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలుగా కొంత మొత్తాలను సిపిఎం అందుకున్నట్లు ఒక సెక్షన్ మీడియాలో వార్తలు వస్తున్నాయని, అయితే ఆ వార్తలన్నీ నిరాధారమైనవని, తప్పుడు వార్తలని పార్టీ పొలిట్‌బ్యూరో స్పష్టం చేసింది. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్నికల బాండ్లను అంగీకరించరాదన్న సూత్రబద్ధవైఖరిని సిపిఎం మొదటినుంచి కలిగి ఉందని తెలిపింది. ఎన్నికల బాండ్లను స్వీకరించడానికి చట్టప్రకారం అవసరమైన ఎస్‌బిఐ ఖాతాను కూడా తెరవలేదని వివరించింది. మౌలికంగా వ్యతిరేకిస్తున్నందునే ఎన్నికల బాండ్ల విధానాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం సుప్రీంకోర్టుకు వెళ్లిందని పేర్కొంది.

కదంతొక్కిన కష్ట జీవులు

గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె సక్సెస్

దేశవ్యాప్తంగా రోడ్డెక్కిన రైతులు, కార్మికులు

మోడీ ప్రభుత్వ విధానాలను తిప్పికొడతామని ప్రతిన

జంతర్ మంతర్ వద్ద భారీ నిరసన



హర్యానాలోని పల్వాల్ జిల్లాలో నిర్వహించిన కార్మిక, కర్షక ర్యాలీలో పాల్గొన్న విజ్జు కృష్ణన్



కర్నూలులో ఎన్‌హెచ్44 రహదారిపై రాస్తోరోకో

రాష్ట్రమంతటా గొంతెత్తిన శ్రామికలోకం

- పలుచోట్ల భారీ ర్యాలీలు
- మూతపడిన పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు

2

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మోడీ ప్రభుత్వ ముదనష్టపు విధానాలపై దేశవ్యాపితంగా కార్మిక, కర్షక, శ్రామిక ప్రజానీకం పిడికిలెత్తింది. రైతులు పండించే పంటకు కనీస మద్దతు ధరను చట్టబద్ధమైన గ్యారంటీ కల్పించాలని, ప్రభుత్వ రంగ సంస్థలను అదానీకి అప్పగించడాన్ని ఆపాలని, కార్మికుల హక్కులను హరించే మూడు లేబర్ కోడ్‌లను వెనక్కి తీసుకోవాలని, వినాశకరమైన విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలన్న నినాదాలు హోరెత్తాయి. ఢిల్లీ సమీపంలోని ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా పారిశ్రామిక ప్రాంతంలోని వీధులను శ్రామిక మహిళలు ఆక్రమించారు.'భారత్ బంద్' దేశంలోని అన్ని రాష్ట్రాలను ప్రభావితం చేసింది. రైతులు, రైతు కూలీలకు చెందిన వందలాది సంఘాల వేదిక కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం దేశంలోని 600కు పైగా జిల్లాల్లో గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక సమ్మె అపూర్వమైన రీతిలో విజయవంతమైంది. సమస్త శ్రామిక వర్గం చేపట్టిన ఈ ఆందోళనకు బిఎస్ఎన్ఎల్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రొఫెషనల్స్, రచయితలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, జర్నలిస్టులు "నేషన్ ఫర్ ఫార్మర్స్" వేదిక వంటివి పూర్తి సంఘీభావాన్ని తెలిపాయి. లూథియానాలో హీరో సైకిల్ కార్మికులు కవాతు నిర్వహించారు.

గ్రామీణ భారతదేశం నిరసనలతో స్తంభించిపోయింది. కార్మికుల సమ్మెతో పరిశ్రమల సైరన్లు మూగబోయాయి. రాజస్థాన్‌లోని జైపూర్ వంటి పలు ప్రాంతాల్లో కార్మికులు, రైతులు రోడ్డెక్కారు. హిమాచల్‌లోని సిమ్లా, మండిలో కార్మికులు, కర్షకులు కదం తొక్కారు. హర్యానాలోని పల్వాల్‌లో కార్మికులు, రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో ఆలిండియా కిసాన్ సభ ప్రధాన కార్యదర్శి బిజు కష్ణన్ ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా కార్మికులు పెద్ద సంఖ్యలో రోడ్లను దిగ్బంధనం చేశారు. ప్రభుత్వ మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల పేరుతో ఈ ప్రాంతంలో రైతులనుంచి భూముల నుంచి పెద్దయెత్తున లాక్కొంది. న్యాయమైన పరిహారం కోసం వారు సుదీర్ఘ పోరాటం చేస్తున్నారు. ప్యారీ చౌక్ వద్ద రోడ్డు దిగ్బంధనంలో మహిళలు కూడా గణనీయమైన సంఖ్యలో పాల్గొన్నారు.

హర్యానాలోని పల్వాల్ లో ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్ మాట్లాడుతూ, మూడు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు, శ్రామిక ప్రజలు దాదాపు ఏడాది పాటు ఢిల్లీ చుట్టూ కూర్చోవడంతో వాటిని ప్రభుత్వం రద్దు చేసింది. కనీస మద్దతు ధర కల్పించేచట్టం చేస్తామనిహామీ ఇచ్చింది. అయితే ఆ హామీ ఇప్పటికీ అమలుకునోచుకోలేదు. అందుకే రైతులు, కార్మికులు మళ్లీ రోడ్డెక్కాల్సి వచ్చిందని అన్నారు. బోర్డు పరీక్షల నేపథ్యంలో పశ్చిమబెంగాల్, అస్సాంలో రైతులు, కార్మికులు ముందుగానే ఆందోళనలు నిర్వహించారు. మొదట జనవరి 26న దేశంలోని అన్ని జిల్లాల్లో రైతులు, కార్మికులు ట్రాక్టర్ల కవాతులో పాల్గొన్నారు. రాష్ట్రపతికి లేఖ పంపారు. కానీ ప్రభుత్వం చర్చించలేదు. మరోవైపు ఇదే డిమాండ్‌తో కొన్ని రైతు సంఘాలు 'ఢిల్లీ చలో' అంటూ రోడ్డెక్కాయి. హర్యానాలో బిజెపి ప్రభుత్వం వారిపై బాష్పవాయువులు, లాఠీలు విసురుతోంది. యునైటెడ్ కిసాన్ మోర్చా కూడా నిరసనగా ప్రధానికి లేఖ పంపింది.

తమిళనాడులోని వివిధ ప్రాంతాల్లో కార్మికులు-రైతులు ర్యాలీలు నిర్వహించారు. మహారాష్ట్రలోని పాల్ఘర్‌లో జరిగిన ఊరేగింపులో పలువురు మహిళలు పాల్గొన్నారు. శ్రీనగర్‌లోని ప్రెస్ కాలనీలో జమ్మూ కాశ్మీర్ యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్, సీఐటీయూ సంయుక్తంగా నిరసన తెలిపాయి. పంజాబ్‌లోని లూథియానాలో హీరో సైకిల్స్ కార్మికులు రోడ్డెక్కారు.

లఖింపూర్ ఖేరీ మారణకాండకు ప్రధాన కుట్రదారు కేంద్ర హోం సహాయ మంత్రి అజయ్ మిశ్రా టెనీ మంత్రి పదవి నుంచి తొలగించి, విచారణ చేయాలని . నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ (ఎన్ఎంపి)ని రద్దు చేయాలి. ఖనిజాలు, లోహాల తవ్వకాలపై ప్రస్తుత చట్టాన్ని సవరించాలని, స్థానిక సంఘాలు, ముఖ్యంగా ఆదివాసీలు, రైతుల అభ్యున్నతి కోసం బొగ్గు గనులతో సహా గనుల నుండి లాభంలో 50 శాతం వాటాను నిర్ధారించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని, జీవనోపాధికి సంబంధించిన అంశాలను జాతీయ ఎజెండాపైకి తీసుకురావాలని ప్రదర్శకులు నినదించారు..

మహారాష్ట్ర నాసిక్‌లోని పారిశ్రామిక ప్రాంతాల కార్మికులు దాదాపు అన్ని పారిశ్రామిక యూనిట్లలో భారీ సమ్మెలో చేరారు. ఉత్తర చెన్నై, కాంచీపురం, తమిళనాడులోని కంబాటోర్‌లోని ఎంఎన్సిలు, పవర్‌లూమ్స్, ఇంజనీరింగ్, ఎంఎస్ఎంఈలతో పాటు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, రాజస్థాన్, పంజాబ్ మరియు ఛత్తీస్‌గఢ్‌లోని కొన్ని ప్రాంతాల్లోని కొన్ని ప్రధాన కర్మాగారాల్లోని పారిశ్రామిక కార్మికులు కూడా హెూల్డింగ్‌తో పాటు సమ్మెలో ఉన్నారు. కేరళలో రాజ్‌భవన్‌తో సహా అన్ని జిల్లా కేంద్రాల్లో భారీ సమీకరణలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు బీహార్, హర్యానా, రాజస్థాన్, నాగాలాండ్, పంజాబ్ తదితర ఆరు రాష్ట్రాల్లో సమ్మెలో ఉండగా, ఇతర రాష్ట్రాల్లో ప్రదర్శనలు నిర్వహించారు. బీమా, బ్యాంక్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు సంఘీభావం తెలుపుతూ దేశవ్యాప్తంగా తమ శాఖలు, కార్యాలయాల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. ఇలా దేశమంతటా కార్మికులు, రైతులు, శ్రామిక మహిళలు పెద్దయెత్తున ఉద్యమించారు. మోడీ ప్రభుత్వానికి గట్టి హెచ్చరిక చేశారు.

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగిన ఆందోళనలో సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ సేన్, ఎఐకెఎస్ ఉపాధ్యక్షులు హన్నన్ మొల్లా, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్ జిత్ కౌర్, సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక మోడీ సర్కార్ విధానాలను తీవ్రంగా దుయ్యబట్టారు. ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరిస్తూ మోడీ కార్పొరేట్లకు ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. రైతులను, కార్మికులను దగా చేశారని విమర్శించారు..ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 పెంచాలని, పట్టణాలకు కూడా ఉపాధి హామీని విస్తరించాలని డిమాండ్ చేశారు. ఎఐఎడబ్ల్యుయు సహాయ కార్యదర్శి విక్రమ్ సింగ్, మహారాష్ట్రలోని ముంబాయిలో ఎఐకెఎస్ అధ్యక్షుడు అశోక్ దావలే, సీనియర్ జర్నలిస్టు పాలగుమ్మి సాయినాథ్ పాల్గొన్నారు.

అందుబాటులోకి 2వేల కోర్సులు

- 'ఎడెక్స్' ఒప్పందంతో విద్యార్థులకు కొత్త భవిష్యత్తు
- సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఎడెక్స్‌తో ఒప్పందం సందర్భంగా ప్రత్యేక వెబ్‌సైట్ ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచంలోని వివిధ ప్రతిష్టాత్మక యూనివర్శిటీల్లో అందించే కోర్సులను విద్యార్థులకు అందుబాటులోకి తేవడమే లక్ష్యంగా 'ఎడెక్స్' సంస్థతో ఒప్పందం చేసుకుంటున్నట్లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఆ సంస్థతో రాష్ట్ర ప్రభుత్వం శక్రవారం ఒప్పందం చేసుకుంది. క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సిఎం మాట్లాడుతూ ఎడెక్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ద్వారా ప్రపంచంలోనే వివిధ యూనివర్సిటీల్లో అందుబాటులో ఉన్న 2వేలకు పైగా వివిధ కోర్సులు రాష్ట్ర విద్యార్థులకు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్సెస్, రియల్ ఎస్టేట్ మేనేజ్‌మెంట్ వంటి అంశాలు పాశ్చాత్య దేశాల్లో డిగ్రీలోనే ఉంటాయని, మన వద్ద ఉండవన్నారు. వీటిని నేర్పించే సిబ్బంది, ఇటువంటి పరిజ్ఞానం మన వద్ద లేదని చెప్పారు. ఫలితంగా అందరికీ నాణ్యమైన విద్య అందుబాటులోకి రావడం కష్టమవుతుందని అన్నారు. ఈ సమస్యకు పరిష్కారంగా విద్యార్థులకు అన్ని యూనివర్సిటీలలోని కోర్సులను అందుబాటులోకి తీసుకువచ్చే లక్ష్యంతో ఈ ఒప్పందం చేసుకుంటున్నట్లు తెలిపారు. దీనివల్ల పెద్ద యూనివర్సిటీలలో సీట్లు రాకపోయినా ఆ కోర్సులు మన యూనివర్సిటీల్లోనే అందుబాటులోకి వస్తున్నాయని చెప్పారు. ఇది గొప్ప మార్పు కు దారితీస్తుందని చెప్పారు. టెక్నాలజీని పిల్లల వద్దకు తీసుకువస్తేనే నాణ్యమైన విద్యను అందించగలుగుతామని తెలిపారు. ప్రతి వైస్ ఛాన్సలర్ దీనిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇప్పుడు విద్యార్థులు ప్రపంచంతో పోటీపడాల్సివస్తోందని, దీనిని దృష్టిలో ఉంచుకుని విద్యారంగంలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని అన్నారు.. విద్యాహక్కు చట్టం అనేది పాత నినాదం అని, నాణ్యమైన విద్య హక్కు ఇప్పుడు కొత్త నినాదమని చెప్పారు. ఈ హక్కును పిల్లలకు ఇవ్వడంలో వెనుకబడితే ప్రపంచం మనల్ని దాటుకుని వెళ్లిపోతుందని చెప్పారు. 2035 నాటికి రాష్ట్రంలో విద్యార్థులు ఐబీలో పరీక్షలు రాసే స్థాయికి ఎదుగుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్ రెడ్డి, ఉన్నత విద్యాశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి రాజశేఖర్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె హేమచంద్రారెడ్డి,కళాశాల విద్య కమిషనర్ పోలా భాస్కర్, పాఠశాల విద్యాశాఖ మౌలిక వసతుల కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్, ఎడెక్స్ వ్యవస్థాపకులు అనంత అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియాకు మరొకరు బలి!

- మూడుకు చేరిన మృతుల సంఖ్య

ప్రజాశక్తి- గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులో డయేరియా తీవ్రత కొనసాగుతోంది. ప్రభుతాస్పత్రిలో రైలుపేట వాసి మహ్మద్ ఇక్బాల్ (38) శుక్రవారం వేకువజామున మృతి చెందారు. దీంతో, మృతుల సంఖ్య మూడుకు చేరుకుంది. మృతుని కుటుంబసభ్యుల కథనం ప్రకారం... వాంతులు, విరోచనాలు అవుతుండడంతో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి ఇక్బాల్‌ను కుటుంబసభ్యులు ఈ నెల 11న తరలించారు. 13వ తేదీ వరకూ చికిత్స పొందాక డిశ్చార్జు చేశారు. ఇదే సమస్య మళ్లీ ఉత్పన్నం కావడంతో గురువారం రాత్రి కుటుంబసభ్యులు తిరిగి గుంటూరు ప్రభుత్వాసత్రికి తీసుకొచ్చారు. అతిగా విరోచనాలు కావడం వల్ల తీవ్ర అస్వస్తతతో న్యుమోనియా సమస్య వచ్చింది. ప్రభుత్వాస్పత్రిలో పల్మనాలజిస్టులు లేరని, గుంటూరులోని చెస్టు ఆస్పత్రికి వెళ్లాలని వైద్యులు సూచించారు. ప్రభుత్వాస్పత్రిలోనే చికిత్స చేయాలని ఇక్బాల్ కుటుంబసభ్యులు కోరారు. చికిత్స అందించినా ఫలితం లేకపోయింది.

బర్డ్ ఫ్లూ కలకలం

- నెల్లూరు జిల్లాలో కోళ్లు మృతి
- చికెన్ అమ్మకాలపై ఆంక్షలు
- పలు జిల్లాల్లో అప్రమత్తం
- రాష్ట్ర వ్యాప్తంగా 721 రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్

ప్రజాశక్తి- యంత్రాంగం

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ కలకలం రేగింది. నెల్లూరు జిల్లాలో ఈ వ్యాధితో పెద్ద సంఖ్యలో కోళ్లు మృతి చెందాయి. ఆ జిల్లాలోనిపొదలకూరు మండలం చాటగుట్ల, కోవూరు మండలం గుమ్మళ్లదిబ్బ గ్రామాల్లో కోళ్ల కు బర్డ్ ఫ్లూ వ్యాధి సోకినట్టు నిర్ధారణైంది. దీంతో చికెన్ అమ్మకాలపై ఆంక్షలు విధించారు. వ్యాధి విస్తరించే ప్రమాదం ఉండటంతో అధికారయంత్రంగం అప్రమత్తమైంది. నెల్లూరు పరిసర జిల్లాలో అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. పలు జిల్లాల్లో అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం ఆదేశించింది. అవసరమైన చర్యలు తీసుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 721 రాపిడ్ టీమ్స్‌ను ఏర్పాటు చేసింది. వీటిలో నెల్లూరు జిల్లాలోనే 37 టీమ్‌లు ఉన్నాయి. ఈ జిల్లాలో 1962 టోల్‌ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేశారు. 24 గంటలు అందుబాటులో అధికారయంత్రాంగాన్ని ఉంచినట్లు ప్రకటించారు. నెల్లూరు జిల్లాలోని పొదలకూరు, కోవూరు మండలాల్లో ఇటీవల పెద్ద సంఖ్యలో కోళ్లు చనిపోయాయి. దీంతో పశుసంవర్ధక శాఖ అధికారులు భోపాల్‌లోని టెస్టింగ్ కేంద్రానికి శాంపిల్స్ పంపారు. ఇక్కడ జరిగిన పరీక్షల్లో ఎవిఎఎన్ ఇన్ఫ్లో ఎంజా (బర్డ్‌ఫ్లూ) నిర్ధారణ అయింది. దీంతో, ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ హరినారాయణన్ అప్రమత్తం చేశారు. ఈ నేపథ్యంలో కోళ్లు మృతి చెందిన ప్రాంతాలకు వెళ్లి అధికారులు పరిశీలించారు

ఆంక్షలు ఇలా....

ఈ ప్రాంతాలకు పది కిలోమీటర్ల పరిధిలో మూడు రోజులపాటు, ఒక కిలోమీటరు పరిధిలో మూడు నెలల పాటు చికెన్ షాపులు తెరవకూడదని ఆదేశించారు. వ్యాధి సోకిన ప్రాంతం నుంచి 15 రోజుల వరకు కోళ్లు బయటకు వెళ్లకూడదని, వేరే ప్రాంతం నుంచి కోళ్లను ఇక్కడికి తీసుకురాకూడదని సూచించారు. చనిపోయిన కోళ్లను భూమిలో పాతి పెట్టించారు. కోళ్ల ఫారాలు, కోళ్ల వద్ద పనిచేసే కార్మికులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నెల్లూరు నుంచి కోళ్లు, కోళ్ల దాణా కొనుగోలును నిషేధించారు. ఆయా గ్రామాల పరిధిలో

మిగతా 7లో

'అనంత' నుంచి కాంగ్రెస్ నగారా

26న ఖర్గేతో ఎన్నికల ప్రచారం ప్రారంభం

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్



రఘువీరా, గిడుగు, తులసిరెడ్డి, శైలజానాథ్ తో కలిసి మీడియాతో మాట్లాడుతున్న మాణిక్యం

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల ప్రచారాన్ని రాష్ట్రంలో ఈ నెల 26న అనంతపురం నుంచి ప్రారంభిస్తున్నట్టు కాంగ్రెస్ పార్టీ ఎపి వ్యవహారాల ఇన్‌ఛార్జి మాణిక్యం ఠాకూర్ తెలిపారు. దీనికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరు కానున్నారని చెప్పారు. శుక్రవారం ఆయన అనంతపురంలోని ఒక ప్రయివేటు ఫంక్షన్ హాలులో రాయలసీమ కాంగ్రెస్ పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. దీనికి ముందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాణిక్యం ఠాకూర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖలో జరగనున్న సభలో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రియాంక గాంధీ, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కూడా ఎన్నికల ప్రచారంలో పాల్గొననున్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రయోజనాలను ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి బిజెపికి తాకట్టు పెట్టారని విమర్శించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని వైసిపి, టిడిపి, జనసేన పార్టీ నాశనం చేశాయని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ చనిపోయిందన్న మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖూనీలు చేసేవారు కూడా మా గురించి మాట్లాడితే ఎలాగని ఘాటుగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ఖాతాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఫ్రీజ్ చేయడం చూస్తే, తమ పార్టీకి ఆ పార్టీ ఎంతగా భయపడుతుందో అర్థమవుతోందని పేర్కొన్నారు.

కాంగ్రెస్ అకౌంట్లు సీజ్

- ఆదాయ పన్నుశాఖ
- ప్రజాస్వామ్యంపై దాడి:ఖర్గే

లోపలి పేజీలో..

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

- భద్రతా దళాల కాల్పుల్లో ఇద్దరి మృతి, 12 మందికి గాయాలు
- చుర్‌చాంద్‌పూర్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల నివాసాలపై మూక దాడి

కష్టాల్లో కొబ్బరి రైతు

- మందగించిన ఎగుమతులు
- పడిపోయిన ధర

లోపలి పేజీలో..

అటకెక్కిన గోదావరి డెల్టా ఆధునీకరణ!

- రూ. వెయ్యి కోట్ల పనులు కాగితాలకే పరిమితం
- కాలువలు మెరకదేరి ఏటా వేలాది ఎకరాల్లో పంట నష్టం
- రబీలో సాగు ఎద్దడితో తీవ్ర అవస్థలు
- ప్రభుత్వ తీరుపై రైతుల ఆగ్రహం



పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం ఏలూరుపాడు వద్ద గుర్రపుడెక్కతో నిండిపోయిన వెంకయ్య, వయ్యేరు కాలువ

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి

గోదావరి డెల్టా ఆధునీకరణ పనులను ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించింది. ఈ ఏడాదీ ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. దీంతో, ఆయకట్టు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గోదావరి డెల్టా కింద 5.29 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. 11 ప్రధాన కాలువలు ఉన్నాయి. వైసిపి సర్కార్ అధికారంలోకొచ్చాక డెల్టా ఆధునీకరణను పూర్తిగా పక్కకు పెట్టేసింది. దీంతో, ఏటా ఖరీఫ్ సీజన్‌లో వర్షపు నీరు కిందకు పారక పొలాల్లో నీరు నిల్వ ఉండి వేలాది ఎకరాల్లో రైతులు పంట నష్టపోతున్నారు. డెల్టా ఆధునీకరణ పూర్తి చేయాలని ఏటా రైతులు, రైతు సంఘాల నాయకులు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. రబీకి సాగునీటి సరఫరాకు జిల్లా సాగునీటి సలహా మండలి సమావేశం ఏటా నవంబర్‌లో జరుగుతుంది. ఈ సమావేశానికి మంత్రులు, ఎంఎల్‌ఎలు, జిల్లా కలెక్టర్, జిల్లా అధికారులు వస్తుంటారు. డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టాలని, జనవరిలో పనులకు టెండర్లు ఖరారు చేయాలని, కాలువలకు నీటి విడుదల నిలిపివేసిన వెంటనే పనులు ప్రారంభించాలని కోరుతూ తీర్మానించి ప్రభుత్వానికి పంపుతున్నా ఆమోదముద్ర పడడం లేదు. గడిచిన నాలుగేళ్లగా ఇదే తంతు కొనసాగుతోంది. కాలువలపై పని చేసే లస్కర్లకు సైతం ఏడాదిగా జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో, ప్రధాన కాలువలతోపాటు పిల్ల కాలువలు పూర్తిగా మెరకదేరి దిగువ పొలాలకు సాగు నీరందడం లేదు. ఖరీఫ్‌లో నీరు కిందకు దిగక వరద నీటి కష్టాలు, రబీలో సాగునీటి ఎద్దడి సమస్యతో జిల్లా రైతులు సతమతమవుతున్నారు. గడిచిన

మిగతా 2లో

మరో 2 నియోజకవర్గాలకు వైసిపి సమన్వయకర్తలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి మరో రెండు నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించింది. బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గానికి ఎడం బాలాజీని, నెల్లూరు జిల్లా కందుకూరుకు కటారి అరవిందా యాదవ్‌ను నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేసింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు తెలిపింది.

26న సిఎం కుప్పం పర్యటన !

ప్రజాశక్తి - రామకుప్పం

రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ నెల 26న కుప్పం నియోజకవర్గ పర్యటనకు విచ్చేయనున్నట్లు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే రెండుసార్లు సిఎం కుప్పం పర్యటన వాయిదా పడింది. ఈ నెల తొమ్మిదిన ఒకసారి వాయిదా పడింది. దీంతో 16న పర్యటన ఉంటుదని పేర్కొనగా..తాజాగా 26కు మారింది. అందుకు అవసరమైన సభ ఏర్పాట్లు సైతం ప్రారంభ మయ్యాయి. అయితే ముఖ్యమంత్రి కుప్పం నియోజకవర్గ పర్యటనపై పూర్తిస్థాయిలో అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.

ఉద్యోగుల సమస్యలపై

ప్రభుత్వ నిర్ణయం స్పష్టం చేయాలి

- లేనిపక్షంలో 22న ఉద్యమ కార్యాచరణ వెల్లడి
- ఎపి జెఎసి అమరావతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉప సంఘం చర్చించిన అంశాలపై ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందో స్పష్టం చేయాలని ఎపి జెఎసి అమరావతి డిమాండ్ చేసింది. విజయవాడలోని గవర్నర్‌పేట రెవెన్యూ భవన్‌లో శుక్రవారం ఎపి జెఎసి అమరావతి స్టేట్ సెక్రటేరియట్ అత్యవసర సమావేశం జెఎసి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా బొప్పరాజుతోపాటు సెక్రటరీ జనరల్ వలిశెట్టి దామోదర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై స్పష్టతనివ్వని పక్షంలో ఈ నెల 22న విజయవాడలో ఎపి జెఎసి అమరావతి రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించి ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వెంటనే ఐఆర్ ప్రకటించాలని, ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఉద్యోగులకు బకాయిలు చెల్లించాలన్నారు. పెన్షనర్లకు అడిషనల్ క్వాంటమ్ ఆఫ్ పెన్షన్‌ను 7 నుంచి 10 శాతానికి, 12 నుంచి 15 శాతానికి పెంచాలని డిమాండ్ చేశారు. రెండు పాత డిఎలు వెంటనే ప్రకటించాలని, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులివ్వాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు వేతనాలు పెంచాలని, ఉద్యోగుల ఆర్థిక అంశాలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎపి జెఎసి అమరావతి నాయకులు డి జయధీర్, ఎస్ మల్లేశ్వరరావు, వి ఆర్లయ్య, బి కిశోర్‌కుమార్, జి జ్యోతి, డిజె ప్రసాద్, కె రమేష్‌కుమార్, టి జయప్రకాశ్, వి పాపారావు, మహిళా విభాగం ఛైర్మన్ పారేలక్ష్మి, ప్రధాన కార్యదర్శి పొన్నూరు విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

పంచాయతీకి ఒక కార్యదర్శి

- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

500 జనాభా దాటిన ప్రతి గ్రామ పంచాయతీకి ఒక పంచాయతీ కార్యదర్శిని నియమించడానికి, అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం పంచాయతీరాజ్ కమిషనరు ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డిడిఒ అధికారాలు కల్పిస్తూ ప్రభుత్వం ఈ నెల 15న జిఒ ఎంఎస్ నెంబరు 11ను విడుదల చేసిన సంగతి తెలిసిందే.

యువతను వంచించిన జగన్ సర్కారు

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం యువతను వంచించిందని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 23 వేల ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేస్తూ మెగా డిఎస్‌సి ప్రకటిస్తామని చెప్పి, కేవలం 6,100 పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేశారన్నారు. త్వరలో జనసేన, టిడిపి సంయుక్తంగా విడుదల చేసే మేనిఫెస్టో యువత ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని పేర్కొన్నారు.

రాష్ట్రమంతటా గొంతెత్తిన శ్రామికలోకం

మోడీ విధానాలపై పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ • రాష్ట్ర వ్యాప్తంగా బైక్, ఆటో ర్యాలీలు

మూతపడిన పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు • విశాఖలో ప్రదర్శన అడ్డగింత • పలువురి అరెస్టు, విడుదల



విజయవాడలో సమ్మెలో పాల్గొన్న వామపక్ష, వివిధ పార్టీల నాయకులు



విశాఖలో ర్యాలీ నిర్వహిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి - యంత్రాంగం

కార్మిక, కర్షక లోకం గొంతెత్తింది. కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తోన్న రైతు, కార్మిక, వ్యతిరేక విధానాలపై గర్జించింది. కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ బిల్లు రద్దు చేయాలని, స్వామినాథన్ సిఫార్సులు అమలు చేయాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేసింది. కార్మికులు చేపట్టిన ప్రదర్శనలు, బైక్, ఆటో ర్యాలీల్లో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలు మారుమోగాయి. సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యాన రాష్ట్ర వ్యాప్తంగా శుక్రవారం చేపట్టిన గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మె విజయవంతమైంది. పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు, దుకాణాలు మూతపడ్డాయి. రాజధానిలో ఆటో కార్మికులు ర్యాలీ నిర్వహించారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్, ఆయిల్ పరిశ్రమలు, షిప్‌యార్డు, బిఎస్‌ఎన్‌ఎల్, బిహెచ్‌ఇఎల్ వంటి ప్రభుత్వ రంగ సంస్థల్లో సమ్మె జరిగింది. లారీలు నిలిచిపోయాయి. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడుతూ.. కార్మికులను అణగదొక్కే బిజెపి చర్యలను ఎంత మాత్రమూ సహించేది లేదన్నారు. దాదాపు 30 సంస్థలను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. సిఐటియు జాతీయ ఉపాధ్యక్షులు ఆర్.లక్ష్మయ్య మాట్లాడుతూ.. దేశ ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా ఉన్న ట్రాన్స్‌పోర్టు రంగంపై వివిధ చట్టాలతో మోడీ సర్కారు దాడి చేయడాన్ని ఖండించారు. ఎఐటియుసి నాయకులు జెవి.సత్యనారాయణ మూర్తి, ఐఎఫ్‌టియు నాయకులు ఎం.లక్ష్మి పాల్గొన్నారు. సమ్మెలో భాగంగా మధురవాడలో కార్మికులు ప్రదర్శన నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేపట్టగా ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం విడిచి పెట్టారు. గాజువాకలో పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో ర్యాలీ, సభ నిర్వహించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి నెహ్రూ చౌక్ మీదుగా ఆర్‌డిఒ కార్యాలయం వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అల్లూరి జిల్లా రంపచోడవరంలో దుకాణాలు, బ్యాంకులు, విద్యాసంస్థలు మూతపడ్డాయి. బంద్ సందర్భంగా రంపచోడవరం, చింతూరు, విఆర్.పురం కేంద్రాల్లో రాస్తారోకోలు నిర్వహించారు.

విజయవాడలో పాత బస్టాండ్ నుంచి ప్రారంభమైన ఆటోల ప్రదర్శన ఏలూరు రోడ్డు మీదుగా లెనిన్ సెంటర్‌కు చేరుకుంది. అనంతరం నిర్వహించిన సభలో పాల్గొన్న నేతలు మాట్లాడుతూ... రైతు ఉద్యమం సందర్భంగా ఇచ్చిన హామీలను నేటికీ కేంద్రం నెరవేర్చలేదన్నారు. నూతన విద్యా విధానం పేరిట విద్యా వ్యవస్థను సైతం ధ్వంసం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.రవీంద్రనాథ్, ఐఎఫ్‌టియు రాష్ట్ర నాయకులు పోలారి, రైతు సంఘం రాష్ట్ర నాయకులు వై కేశవరావు తదితరులు పాల్గొన్నారు. కర్నూలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన ధర్నానుద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఎ.గఫూర్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. బిజెపిని, బిజెపికి మద్దతిచ్చే పార్టీలను గద్దె దించడం కోసం కార్మికులు, కర్షకులు, ప్రజలు ఐక్యంగా పోరాడాలని కోరారు.

పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలో రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, యడ్లపాడులో కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.రాధాకృష్ణ పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్మిక, కర్షక వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని, మూడు నల్ల చట్టాలను వెనక్కి తీసుకోవాలని, విద్యుత్ బిల్లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కొలనుకొండ జాతీయ రహదారి వద్ద నిర్వహించిన రాస్తారోకోలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వంకాయలపాటి శివనాగరాణి ప్రసంగించారు. రాజధాని ప్రాంతంలో ఆటో డ్రైవర్లు ర్యాలీ నిర్వహించారు. నెల్లూరులో బిఎస్‌ఎన్‌ఎల్ జిల్లా కార్యాలయం ఎదుట నిర్వహించిన బహిరంగ సభలో మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ.. కేంద్రం అనుసరిస్తోన్న ప్రజావ్యతిరేక విధానాల వల్ల గ్రామాల్లో రైతులు, వ్యవసాయ కార్మికులు, పరిశ్రమలు, రవాణా రంగం, నిర్మాణ రంగ కార్మికులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయనగరం కలెక్టరేట్ వద్ద రైతులు, కార్మికులు నిరసన తెలిపారు. ఎపి రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ పాల్గొన్నారు. అనంతపురం బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద జరిగిన నిరసన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి. ఓబులు పాల్గొన్నారు.

తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో కోరమాండల్, ప్యారీ సుగర్స్, శ్రీ సాయి, ఆదాని ఆయిల్ కంపెనీ, స్లంబ్రేజర్, జెమిని, సంతోషిమాత, లోహిత, ఎన్‌ఎస్‌ఎస్ కంపెనీల కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబిరాణి ప్రసంగించారు. తిరుపతిలో ఆర్‌టిసి బస్టాండ్ నుంచి పూర్ణకుంభం సర్కిల్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడులో రైతులు ట్రాక్టర్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి,కడప జిల్లాల్లో ర్యాలీలు, నిరసనలు చేపట్టారు. శ్రీకాకుళంలో ఏడు రోడ్ల కూడలి నుంచి జిటి రోడ్డు మీదుగా సూర్యమహల్ కూడలి వరకు ర్యాలీ చేపట్టారు.

అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

ఎంప్లాయీస్ యూనియన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆర్‌టిసిలో దాదాపు 20 ఏళ్లుగా పనిచేస్తున్న 7,300 మంది అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఎపిపిటిడి ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎపిఎస్ ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జివి నర్సయ్య శుక్రవారం వినతిపత్రం అందజేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెగ్యులరైజ్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేసే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులతో పోల్చినా తక్కువ వేతనాలు ఇస్తున్నారని అన్నారు. ఆర్‌టిసిలోని అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరినీ ఆప్కాస్‌లో విలీనం చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. అలాగే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కాంట్రాక్టర్ల నుంచి దోపిడీ లేకుండా నేరుగా వారి ఖాతాల్లో వేతనాలు జమచేయాలని కోరారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ పిఎఫ్, ఇఎస్ఐ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్‌ను

యధావిధిగా కొనసాగించాలి

ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలంలో వున్న అదానీ కష్ణపట్నం పోర్టులోని కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలను యధావిధిగా కొనసాగించాలని సిపిఎం రాష్ట్రకమిటి డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం సిపిఎం రాష్ట్ర కమిటి తరుపున ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లేఖ రాశారు. కృష్ణపట్నం లోని కంటైనర్ టెర్మినల్ కార్యకలాపాలను గత సంవత్సర కాలంగా అదానీ పోర్టు యాజమాన్యం వారి ప్రయోజనాల కోసం ఒక ప్రణాళిక ప్రకారం తమిళనాడులోని వారి స్వంత పోర్టులకు తరలిస్తున్నారని ఈ లేఖలో పేర్కొన్నారు. ఈ చర్యతో రాష్ట్ర ప్రభుత్వం ఆదాయాన్ని కోల్పోవడంతో పాటు, ఐదువేల మందికి పైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పోర్టు పరిసర ప్రాంతాల్లో దానిపై ఆధారపడిన ఎగుమతులు, దిగుమతులు కూడా దెబ్బతింటాయని తెలిపారు. జిల్లాలో ఇప్పటికే నిర్మిత మైన కంటైనర్ ఆధారిత పరిశ్రమలు, గోదాములు, కోల్డ్ స్టోరేజీల, ట్రాన్స్‌పోర్టు వ్యాపారాలపైనా తీవ్ర ప్రభావం పడుతుందని వివరించారు. ఈ నిర్ణయంతో పరిశ్రమలు కూడా తరలిపోయి రాష్ట్రాభివృద్ధికి నష్టం కలుగుతుందని వివరించారు. పోర్టు యాజమాన్యం నిబంధనలకు విరుద్ధం గా పోర్టు బెర్తులను వాడుకోవడంతో పరిసర ప్రాంతాల్లో కాలుష్యం తీవ్రత పెరిగి, ప్రజలు అనారోగ్యం బారిన పడుతు న్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటభూముల్లో పంట దిగుబడులపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని, కొన్ని ప్రాంతాల్లో పంటలు పూర్తిగా దెబ్బ తింటున్నాయని పేర్కొన్నారు. పోర్టు యాజమాన్యం అనుసరిస్తున్న విధానాలతో నీరు, గాలి కలుషితమై జిల్లా కాలుష్యపు కోరల్లో చిక్కుకునే ప్రమాదం వుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియతో కార్మికులు, ఉద్యోగులు, చిరువ్యాపారులు ఉపాధి కోల్పోయే పరిస్థితి వుందన్నారు. కెపిసియల్ కంపెనీకి 2004 సెప్టెంబర్ 17న ప్రభుత్వం ఇచ్చిన రాయితీ అగ్రిమెంట్ ప్రకారం పోర్టు యాజమాన్యం సంరక్షకుడి పాత్ర మాత్రమే పోషించాలని, 30 ఏళ్ల అగ్రిమెంట్ కాలపరిమితి తరువాత పోర్టును ప్రభుత్వానికి అప్పగించాలనే నిబంధన ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

అదానీ సంస్థ వ్యవహారం చూ స్తుంటే వారి పోర్టులను అభివృద్ధి చేసుకునేందుకు ఈ పోర్టును పావుగా వాడుకుంటున్నట్లుగా వుందని తెలిపారు. అగ్రిమెంట్ కాలపరిమితి పూర్తయ్యే నాటికి కష్ణపట్నం పోర్టు ను నిర్వీర్యం చేసేలా అదాని వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. నెల్లూరు జిల్లాలో కృష్ణపట్నం పోర్టు తరలింపుపై ప్రజల్లో ఆందోళన వుందని, కార్మికులు నిరసనలు చేపట్టారని తెలి పారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించి కృష్ణపట్నం పోర్టు పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. కంటైనర్ టెర్మినల్‌ని యధావిధిగా కృష్ణపట్నం పోర్టులోనే కొనసాగించేలా సత్వర చర్యలు చేపట్టాలని కోరారు.

జగన్ కుర్చీ మడతపెడతాం

- శంఖారావం సభల్లో టిడిపి నేత లోకేష్


శంఖారావం సభలో మాట్లాడుతున్న లోకేష్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి నాయకులు చొక్కా మడతపెడితే.... టిడిపి, జనసేన కార్యకర్తలు కుర్చీలు మడతపెడతారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ప్రతి స్కీమ్ వెనుకా ఒక స్కామ్ ఉందని విమర్శించారు. విజయనగరం జిల్లా నెల్లిమర్ల, విజయనగరం, గజపతినగరం నియోజకవర్గాల్లో శుక్రవారం జరిగిన శంఖారావం సభల్లో ఆయన ప్రసంగించారు. రాజధాని ఫైల్స్ సినిమా గురించి తెలిశాక జగన్‌కు భయం పట్టుకుందని, అందుకే ఆ సినిమాను ప్రదర్శించకుండా అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నారని అన్నారు. యాత్ర-2 సినిమా వైసిపికి అంతిమయాత్రలా మారిందని, రాజధాని ఫైల్స్ సినిమా ఆడుతున్న థియేటర్ల వద్దకు పోలీసులను పంపారని విమర్శించారు. రాజధాని విషయంలో జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నో యూ టర్న్‌లు తీసుకుని అటు రైతులను, ఇటు ప్రజలను మోసం చేశారన్నారు. అమరావతి రాజధానికి మద్దతిస్తామని నమ్మించి, మూడు రాజధానుల పేరుతో మూడు ముక్కలాట ఆడుతున్నారన్నారు. ఉత్తరాంధ్రపై ప్రేమ ఉంటే ఈ ఐదేళ్లలో ఒక్క పరిశ్రమను కూడా ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించారు. రాజధాని నిర్మించడం చేతకాక వైవి సుబ్బారెడ్డి రాజధానిగా హైదరాబాద్ మరో ఐదేళ్లు కావాలనడం సిగ్గుచేటన్నారు. ప్రజలే స్టార్ క్యాంపెయినర్స్ అని అంటున్న జగన్... సమయం, తేదీ చెబితే గృహిణులు, నిరుద్యోగ యువత, మద్యం ప్రియుల వద్ద చర్చకు తాము సిద్ధమేనన్నారు. నాసిరకం మద్యం, గంజాయితో యువతీ, యువకుల ప్రాణాలతో ముఖ్యమంత్రి చలగాటమాడుతున్నారని, తాము అధికారంలోకి వస్తే గంజాయి లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. సంపూర్ణ మద్యపాన నిషేధం తర్వాతనే ఓట్లు అడుగుతానన్న జగన్ మాట తప్పి మరో అవకాశం ఇవ్వమంటున్నాడని విమర్శించారు. జగన్ ప్రవేశపెట్టిన ప్రతి స్కీమ్ వెనుకా ఓ స్కాం దాగి ఉంటుందన్నారు.

సెంటు స్థలాల పేరుతో రూ.7 వేల కోట్లు, లెవలింగ్ పేరుతో రూ.2200 కోట్లు దోచేశారని ఆరోపించారు. ల్యాండ్, శాండ్, వైన్, మైన్ మాఫియాకు ఉత్తరాంధ్రను కేంద్రంగా మార్చారని విమర్శించారు. రెండు నెలలు ఆగితే వైసిపి దోచుకున్న సొమ్మును వడ్డీతో సహా కక్కిస్తామన్నారు. జగనన్న ఇళ్లు చేతితో తాకితేనే కూలిపోయే పరిస్థితి ఉందని, టిడిపి-జనసేన ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెరుగైన టెక్నాలజీతో ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ప్రతి జిల్లాలోనూ కేన్సర్ ఆస్పత్రులు ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజల కష్టాలు తీర్చేందుకే బాబు-పవన్ కలిసి సూపర్ -6 హామీలు ప్రకటించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ సభల్లో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు పి.అశోక్‌గజపతిరాజు, విజయనగరం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిమిడి నాగార్జున, ఆయా నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు.

12 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు ఎన్‌బిఎ గుర్తింపు

- సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో 12 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలకు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బిఎ) పొందాయని సాంకేతిక విద్యాశాఖ కమిషనరు సిహెచ్ నాగరాణి తెలిపారు. ఎన్‌బిఎ ప్రమాణాలకు అనుగుణంగా పాలిటెక్నిక్ కళాశాలలను తీర్చిదిద్దటంలో తన ప్రత్యేకతను సాంకేతిక విద్య కనబరుస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25, 2025-26, 2026-27 విద్యా సంవత్సరాలకు 24 ప్రోగ్రామ్‌లకు అక్రిడిటేషన్‌ను నిర్ధారించిందని పేర్కొన్నారు. అనంతపురం, శ్రీశైలం, తిరుపతి, పిల్లరిపట్టు, శ్రీకాకుళం, రాజమండ్రి, జమ్మలమడుగు, కదిరి ప్రభుత్వ పాలిటెక్నిక్‌లు, నందిగామ, పలమనేరు, కడప మహిళా కళాశాల, మదనపల్లె మోడల్ రెసిడెన్షియల్, పాలిటెక్నిక్ సైతం ఎన్‌బిఎ దక్కించు కుందని వివరించారు. ఇప్పటికే పలు కళాశాలలు ఎన్‌బిఎ పొందాయని తెలిపారు. 31 పాలిటెక్నిక్‌లలో 60 విభాగాల్లో అక్రిడిటేషన్‌ను సాధించాయని వివరించారు. అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థుల అంకితభావం, కృషి ఫలితంగానే ఈ ఘనత సాధ్యమైందని తెలిపారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి, నైపుణాభివృద్ధి శిక్షణ శాఖ ముఖ్యకార్యదర్శి సురేష్ కుమార్ కూడా అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఆర్‌టిసిలో 541 అద్దె బస్సులకు టెండర్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్‌ఆర్‌టిసిలో 541 అద్దె బస్సులకు ఆర్‌టిసి యజమాన్యం టెండర్లను ఆహ్వానించింది. రెండు ఎసి స్లీపర్, తొమ్మిది నాన్ ఎసి స్లీపర్, 22 సూపర్ లగ్జరీ, 33 అల్ట్రా డీలక్స్, 168 ఎక్స్‌ప్రెస్, 74 అల్ట్రా పల్లెవెలుగు, 225 పల్లెవెలుగు, మూడు మెట్రో ఎక్స్‌ప్రెస్, ఐదు సిటీ ఆర్డనరీ బస్సులకు ఆర్‌టిసి టెండర్లను పిలిచింది. ఇందులో శ్రీకాకుళం జిల్లాకు 32 బస్సులు, విజయనగరం 7, పార్వతీపురం మన్యం 15, విశాఖపట్నం 3, అనకాపల్లికి 14, కాకినాడకు 18, తూర్పుగోదావరికి 18, అంబేద్కర్ కోనసీమకు 10, పశ్చిమ గోదావరికి 10, ఏలూరుకు 16, ఎన్‌టిఆర్ జిల్లాకు 24, కృష్ణా జిల్లాకు 15, గుంటూరుకు 54, పల్నాడుకు 36, బాపట్లకు 13, ప్రకాశం జిల్లాకు 16, నెల్లూరుకు 13, తిరుపతికి 32, అన్నమయ్య జిల్లాకు 40, వైఎస్సార్ కడప జిల్లాకు 24, కర్నూలుకు 8, నంద్యాల జిల్లాకు 20, అనంతపురం జిల్లాకు 39, సత్యసాయి జిల్లాకు 32 బస్సులు కలిపి మొత్తం 541 అద్దె బస్సులకు ఆర్‌టిసి టెండర్లను పిలిచింది. ఎమ్ఎస్‌టిసి ఇ కామర్స్ పోర్టల్ ద్వారా టెండర్లలో పాల్గొనొచ్చని ఆర్‌టిసి తెలిపింది. ఈ నెల 21 నుంచి టెండర్ల ప్రక్రియ మొదలై మార్చి 6వ తేదీన ముగుస్తుందని పేర్కొంది. మార్చి 14న రివర్స్ టెండరింగ్‌లో పాల్గొనాల్సి వుంటుందని తెలిపింది.


దీక్షా శిబిరానుద్దేశించి మాట్లాడుతున్న సిహెచ్ నర్సింగరావు

1100 రోజులకు 'ఉక్కు' పరిరక్షణ దీక్షలు

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1100 రోజులకు చేరుకున్నాయి. దీక్షల్లో పెద్ద సంఖ్యలో ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి పోరాట కమిటీ ఛైర్మన్, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు మాట్లాడారు. మోడీ ప్రభుత్వం పదేళ్లుగా కార్పొరేట్లకు అనుకూలంగా పనిచేస్తోందని తెలిపారు. తాజా బడ్జెట్‌లోనూ పారిశ్రామికవేత్తలకు పెద్ద మొత్తంలో లబ్ధి చేకూర్చే నిర్ణయాలే తీసుకుందని విమర్శించారు. బిజెపిని రానున్న ఎన్నికల్లో ఓడిస్తేనే దేశానికి రక్ష అని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకునేందుకు జరుగుతున్న అకుంఠిత పోరాటాన్ని తెలియజేశారు. దీక్షల్లో పోరాట కమిటీ ఛైర్మన్లు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, కన్వీనర్ కెఎస్ఎన్.రావు, కో కన్వీనర్ జె.అయోధ్యరామ్, నాయకులు ఎన్.రామారావు, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం

- స్వతంత్ర అభ్యర్థి నామినేషన్ తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజ్యసభ ఎన్నికలకు సంబంధించి మూడు రాజ్యసభ సీట్లకు వైసిపి తరపున దాఖలు చేసిన ముగ్గురు అభ్యర్థుల నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్లు రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం విజయరాజు వెల్లడించారు. ఈ మేరకు శుక్రవారం అసెంబ్లీ భవనంలో రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా, ఆయా అభ్యర్థుల తరపున హాజరైన ప్రతినిధుల సమక్షంలో జరిగింది. వైసిపి తరపున రాజ్యసభ అభ్యర్థులుగా గొల్ల బాబూరావు, వైవి సుబ్బారెడ్డి, మేడా రఘునాథరెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. డాక్యుమెంట్లన్నీ పూర్తి స్థాయిలో సక్రమంగా సమర్పించడంతో నామినేషన్లను ఆమోదించినట్లు విజయరాజు వెల్లడించారు. స్వతంత్ర అభ్యర్థి పెమ్మసాని ప్రభాకర్ నాయుడు నామినేషన్ దాఖలు చేయగా, కనీసం 10మంది ఎమ్మెల్యేల ప్రతిపాదనలతో కూడిన పత్రాన్ని సమర్పించక పోవడంతో ఆయన నామినేషన్‌ను తిరస్కరించినట్లు తెలిపారు.

'రాజధాని ఫైల్స్' చిత్ర ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్

- తాత్కాలిక స్టే రద్దు


ప్రజాశక్తి-అమరావతి

'రాజధాని ఫైల్స్' చిత్ర ప్రదర్శనకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. సినిమాలో సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి నేతల ప్రతిష్టను దెబ్బతీసే సన్నివేశాలు ఉన్నాయంటూ దాఖలైన పిటిషన్‌లో హైకోర్టు విధించిన స్టే ఉత్తర్వులను శుక్రవారం రద్దు చేసింది. సినిమా ప్రదర్శనకు తాత్కాలికంగా నిలిపివేస్తూ గురువారం ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వుల అమలును నిలిపివేసింది. సినిమాకు సెన్సార్ బోర్డు ఎగ్జామినింగ్ కమిటీ, సెన్సార్ బోర్డు రివైజింగ్ కమిటీ సమర్పించిన రికార్డులతో సంతృప్తి వ్యక్తం చేసింది. దీంతో స్టేను ఎత్తివేస్తూ న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ఆదేశాలు జారీ చేశారు. 'రాజధాని ఫైల్స్' పేరుతో తీసిన సినిమాకు సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేయాలంటూ వైసిపి ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌ను శుక్రవారం మరోసారి విచారణ జరిపింది. సెన్సార్ బోర్డు సర్టిఫికెట్ జారీ తర్వాత కోర్టుల జోక్యానికి ఆస్కారం లేదని చెప్పింది. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని సిబిఎఫ్‌సి, చిత్ర నిర్మాతలను, దర్శకుడిని ఆదేశించింది. తదుపరి విచారణను మార్చి 11కు వాయిదా వేసింది.

'రాజధాని ఫైల్స్' చూడండి

- ప్రజలకు చంద్రబాబు పిలుపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



తెలుగు ప్రజలందరూ థియేటర్లకు వెళ్లి రాజధాని ఫైల్స్ సినిమాను చూసి వాస్తవాలను తెలుసుకోవాలని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ఒక ప్రాంతంపై కక్షగట్టి రాష్ట్ర రాజధానిపై పగబట్టి సర్వనాశనం చేసిన ప్రాంతం అమరావతి అని శుక్రవారం ఎక్స్ (ట్విట్టర్)లో పేర్కొన్నారు. ఇది చారిత్రాత్మక విషాదం అని, దీనికోసం కులాల కుంపట్లు రాజేశారని, విష ప్రచారాలు చేయించారని పేర్కొన్నారు. అధికార బలం మొత్తాన్ని ఉపయోగించి ఉద్యమకారులను చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. ఈ కుట్రలకు, దారుణాలకు అద్దం పట్టిన చిత్రం రాజధాని ఫైల్స్ అని వివరించారు. జగన్ క్రూరత్వానికి, వైసిపి విధ్వంసానికి నాశనమైన ఒక రాజధాని, దాని కోసం ఎన్నో త్యాగాలు చేసిన ప్రజలు ఎదుర్కొన్న కష్టాలను ఈ చిత్రం కళ్లకు కట్టిందని తెలిపారు. అందుకే చిత్రం విడుదలను ఆపడానికి జగన్ శతవిధాలా ప్రయత్నించారని పేర్కొన్నారు. జగన్ సినిమా అయిపోయిందని, అసలు సినిమా ఇప్పుడు మొదలవుతుంది కాస్కో అని సవాల్ విసిరారు.

యాగం చేపట్టిన చంద్రబాబు

చంద్రబాబు తన నివాసంలో శుక్రవారం రాజశ్యామల పేరుతో యాగం చేపట్టారు. సతీసమేతంగా ఆదివారం వరకు ఈ యాగంలో ఆయన పాల్గొనున్నారు.

అటకెక్కిన డెల్టా ఆధునీకరణ!

(మొదటి పేజీ తరువాయి)

నాలుగేళ్లలో లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిని అన్నదాతలు తీవ్రంగా నష్టపోయారు. అయినా ప్రభుత్వంలో ఏ మాత్రమూ చలనం లేదు.

ఈ ఏడాదీ అదే నిర్లక్ష్యం

2007లో పశ్చిమగోదావరి జిల్లాలోని డెల్టా ఆధునీకరణకు రూ.1400 కోట్లు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం పరిపాలనా ఆమోదం తెలిపింది. 2018 వరకూ దాదాపు రూ.800 కోట్లు పనులు జరిగాయి. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చింది. ఆ తర్వాత నుంచి పనులు ఆగిపోయాయి. ఇంకా రూ.600 కోట్లు పనులు మిగిలిపోయాయి. పెరిగిన ధరలతో ప్రస్తుతం పనుల విలువ రూ.వెయ్యి కోట్లకు చేరింది. ఈ పనులకు సంబంధించి ఇరిగేషన్ అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపుతున్నా డెల్టా ఆధునీకరణ పనుల్లో కదలిక లేదు. వెంటనే ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపితే, కాలువలకు నీటి విడుదల నిలిచిపోయే సమయానికి టెండర్లు పూర్తి చేసే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం నుంచి అటువంటి సూచనలు కానరాకపోవడంతో ఈ ఏడాదీ డెల్టా ఆధునీకరణ అటకెక్కినట్లేనంటూ ఆయకట్టు రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే ఆధునీకరణ పనులు చేపట్టాలని వారు డిమాండ్ చేస్తున్నారు. డెల్టా ఆధునీకరణ పనులపై ఇరిగేషన్ ఎస్ఇ శ్రీనివాసరావును 'ప్రజాశక్తి' వివరణ కోరగా రూ.వెయ్యి కోట్ల పనులకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించామని తెలిపారు. వాటికి ఆమోదం వచ్చిన వెంటనే అందుకు సంబంధించిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పనులు చేపట్టాలి

ఏలూరు జిల్లాలో గోదావరి, కృష్ణా డెల్టాల ఆయకట్టు భూములు శివార్లలో ఉన్నాయి. గోదావరి డెల్టా ఆధునీకరణ పనులు జరగకపోవడంతో ఖరీఫ్, రబీలోనూ సాగు నీరందక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలువల నిండా తూడు, గుర్రపు డెక్క, కర్ర నాచు పేరుకుపోయింది. షట్టర్లు ఎక్కడికక్కడే పాడైపోయాయి. నీటి ఎద్దడి, ముంపు సమస్య పరిపాటైంది. ప్రభుత్వం డెల్టా ఆధునీకరణ పనులు చేపట్టి రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి.

-కె.శ్రీనివాస్, ఎపి రైతు సంఘం ఏలూరు జిల్లా కార్యదర్శి

కష్టాల్లో కొబ్బరి రైతు

- మందగించిన ఎగుమతులు
- పడిపోయిన ధర

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

జాతీయ మార్కెట్‌లో కొబ్బరి ధర భారీగా పతనం కావడంతో రాష్ట్రంలోని కొబ్బరి రైతు రైతులు కష్టాల్లో కూరుకుపోతున్నారు. ప్రస్తుతం అంబాజీపేట మార్కెట్‌లో కొత్త కొబ్బరి వెయ్యి కాయలు రూ.7 వేల నుంచి రూ.8 వేల మధ్యలో రైతుల నుంచి కొనుగోలు జరుగుతోంది. గతేడాది ఈ సీజన్‌లో రూ.9 వేల నుంచి రూ.10 వేల వరకూ ధర పలికింది. ధర కనీసం రూ.13 వేలు ఉంటే తప్ప గిట్టుబాటు కాదని రైతులు చెబుతున్నారు. కురిడీ కొబ్బరి వెయ్యి కాయలు పాత గండేరా ధర ప్రస్తుతం రూ.12 వేలు ఉంది. గతేడాది ఈ సీజన్లో రూ.13 వేలు పలికింది. గండేరా గటగట రకం కొబ్బరి కాయలను గతేడాది రూ.11 వేలకు వ్యాపారులు కొనుగోలు చేశారు. ప్రస్తుతం రూ.9 వేలకు మించి కొనుగోలు జరగడం లేదు. కురిడీ చిట్టి కాయలను గతేడాది వెయ్యి కాయలను రూ.5,500 చొప్పున కొనుగోలు జరగగా, ఈ ఏడాది రూ.4 వేల మించి ధర లభించడం లేదు. రైతులకు నేరుగా మేలు చేసే నీటి కాయల ధర భారీగా పడిపోయింది. వెయ్యి కాయలకు రూ.8 వేలు చొప్పున మాత్రమే ధర లభిస్తోంది. గతేడాది పరిమాణాన్ని బట్టి వ్యాపారులు వెయ్యి కాయలను రూ.11 వేల నుంచి రూ.13 వేలకు చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారు. రైతుల నుంచి కొబ్బరి కాయలు కొనుగోలు చేసి వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులు చేస్తుంటారు. దేశీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవటంతో పెళ్లిళ్ల సీజన్‌లోనూ వ్యాపారులు కొబ్బరి కొనుగోలుకు వెనకడుగు వేశారు. ఈ క్రమంలో ధరలు పడిపోయని, ప్రస్తుతం తమిళనాడు రాష్ట్రంలో దిగుబడులు భారీగా రావడంతో దేశీయ మార్కెట్లో కోనసీమ కొబ్బరికి డిమాండ్ తగ్గిందని వ్యాపారులు చెబుతున్నారు. అక్కడ ఎకరాకు 700 కాయలు దిగుబడి రాగా, కోనసీమ జిల్లాలో 400 కాయలకు మించి దిగుబడి రావడంలేదని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో బహిరంగ మార్కెట్లో కాయ సైజును బట్టి రూ.25 నుంచి రూ.30 వరకూ విక్రయాలు జరుగుతున్నాయి. రైతుకు ఇందులో 50 శాతం ధర కూడా లభించడం లేదు. తూర్పుగోదావరి జిల్లా నుంచి తెలంగాణ, తమిళనాడు, ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాలకు కొబ్బరిని ఎక్కువగా ఎగుమతి చేస్తుంటారు. అంబాజీపేట మార్కెట్ నుంచి ఫిబ్రవరి, మార్చిలో రోజుకు 25 నుంచి 30 లారీలు ఎగుమతులు జరిగేవి. ఈ ఏడాది ప్రస్తుతం పది లారీలకు మించి ఎగుమతులు జరగడం లేదని వ్యాపారులు చెబుతున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 1.30 లక్షల ఎకరాల్లో కొబ్బరి సాగవుతోంది. మరో 20 వేల ఎకరాలకు సరిపడా చెట్లు ఇళ్ల వద్ద, పొలాల గట్ల వెంబడి, కాలువ గట్లపైన సాగులో ఉన్నాయి. ఏటా 105 కోట్ల కొబ్బరి కాయల దిగుబడి వస్తుందని అంచనా. కొన్నేళ్లుగా కొబ్బరి సాగులో అనేక ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న రైతులు నిలకడలేని ధరలతో నిరాశ చెందుతున్నారు. గత ఐదేళ్లుగా కొబ్బరి చెట్లకు ఎర్రనల్లి, తెల్లదోమ, ఆకుతేలు, ఎండాకు తెగులు సోకుతున్నాయి. దీంతో, ఆకులు ఎండిపోయి చెట్లు జీవం కోల్పోతున్నాయి. పూతకు వచ్చిన గెలల్లో కాయలు తొలిదశలోనే రాలిపోతున్నాయి. ఇది దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కేరళ కర్ణాటక రాష్ట్రాల్లో దిగుబడి అవుతున్న కాయలతో పోల్చితే ఇక్కడి కాయల సైజు తక్కువగా ఉండడంతో జాతీయ మార్కెట్లో డిమాండ్ తగ్గిపోతోంది. కొబ్బరి కాయల దిగుబడి తగ్గిపోవటానికి రొయ్యల చెరువులు, వినియోగిస్తున్న రసాయనాల ప్రభావం కూడా మరో కారణమని రైతులు వాపోతున్నారు.



తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కొబ్బరి కాయల విక్రయాలు

ప్రభుత్వం ఆదుకోవాలి

ఏటా ఖర్చులు పెరుగుతున్నాయి. వెయ్యి కాయలు రూ.7 వేలకు మాత్రమే అమ్ముడవుతున్నాయి. దింపుడు, ఇతర ఖర్చులకు రూ.3 వేలు అవుతోంది. రైతుకు మిగిలేది రూ.4 వేలు మాత్రమే. తమిళనాడు తరహాలో ప్రభుత్వమే ఆదుకోవాలి.

- ఎం.రమేష్ కొబ్బరి రైతు, అంబాజీపేట

పెట్టుబడి ఖర్చులూ రావడం లేదు

గండేరా కురిడీ కాయలకు ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో రూ.18 వేలు వస్తేనే గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం రూ.12 వేల నుంచి రూ.12,500 మించడం లేదు. పెళ్లిళ్ల సీజన్‌లోనూ ధరలు లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. పెట్టుబడి ఖర్చులు కూడా రాక కొబ్బరి రైతులు కుదేలవుతున్నారు.

- కె.సత్యనారాయణ, కొబ్బరి రైతు, వాకల గరువు, అంబాజీ పేట

జిఎస్‌ఎల్‌వి ఎఫ్-14 కౌంట్‌డౌన్ ప్రారంభం

- నేడు అంతరిక్షంలోకి ఇన్‌శాట్ 3-డిఎస్ ఉపగ్రహం

ప్రజాశక్తి - సూళ్లూరుపేట (తిరుపతి)



జిఎస్‌ఎల్‌వి ఎఫ్-14 కౌంట్‌డౌన్ శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు ప్రారంభమైంది. 27.30 గంటల కౌంట్‌డౌన్ అనంతరం జిఎస్-ఎల్‌వి ఎఫ్-14 రాకెట్‌ను ప్రయోగిస్తారు. మొత్తం 2272 కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్ 3-డిఎస్ శాటిలైట్‌ను భూ స్థిర కక్ష్యలో ప్రవేశపెట్టనున్నారు. భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రం శ్రీహరికోట నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు రాకెట్‌ను ప్రయోగిం చనున్నట్లు చైర్మన్ ఎస్.సోమనాథ్ తెలిపారు. జియోసింక్రనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ (జిఎస్‌ఎల్‌వి) సిరీస్‌లో ఇది 16వ ప్రయోగం. పూర్తి స్వదేశీ క్రయోజనిక్ ఇంజన్‌తో ఈ రాకెట్‌ను రూపొందించారు. మూడు దశలతో నిర్మించిన ఈ రాకెట్ 19 నిమిషాల్లోనే అంతరిక్ష కక్ష్యకు చేరేలా శాస్త్రవేత్తలు ప్రణాళికలు రూపొందించారు. 167 కిలోమీటర్లు 173 మీటర్ల పెరిజి, 33,540 కిలోమీటర్లు, 40,781 కిలోమీటర్ల అపోజీల మధ్య వృత్తాకార కక్ష్యలో ఈ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టనున్నారు. షార్‌కు ఇస్రో చైర్మన్ ఎస్.సోమనాథ్ చేరుకొని ప్రయోగ సన్నాహాలు చేపట్టారు.

వైభవంగా రథసప్తమి

- వేల సంఖ్యలో తరలివచ్చిన యాత్రికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్/ తిరుమల

సూర్య జయంతి సందర్భంగా తిరుమల, అరసవల్లిలో రథసప్తమి వేడుకలు శుక్రవారం వైభవోపేతంగా నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా అరసవల్లిలోని సూర్యనారాయణ స్వామి ఆలయంలో రథసప్తమి వేడుకలను విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి ప్రారంభించారు. ప్రభుత్వం తరుపున దేవాదాయ శాఖ ప్రాంతీయ సంచాలకులు ఎం.విజయరాజు, జిల్లా సహాయ కమిషనర్ ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఇఒ డి.ఎల్.వి రమేష్ స్వామివారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆదిత్యున్ని రెవెన్యూ, మత్స్యశాఖ మంత్రులు ధర్మాన ప్రసాదరావు, సీదిరి అప్పలరాజు, ఎంపీలు రామ్మోహన్‌నాయుడు, బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్సీలు వరుదు కల్యాణి, పి.విక్రాంత్, తెలంగాణ జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా తదితరులు దర్శించుకున్నారు. వేడుకలను వీక్షించేందుకు రాష్ట్రంలోని పలు ప్రాంతాలతో పాటు తెలంగాణ, ఒడిశా నుంచి వేల సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు.

తిరుమలలో స్వామి వారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో యాత్రికులు తరలివచ్చారు. నాలుగు మాడ వీధుల్లోని గ్యాలరీలన్నీ పూర్తిగా నిండిపోయాయి. ఉదయం 5.30 నుండి రాత్రి 9 గంటల వరకు సప్తవాహనాలపై శేషాచలాధీశుని వైభవాన్ని తిలకించారు. వాహన సేవలను ఎస్‌విబిసిలో ప్రత్యక్షప్రసారం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి 900 మంది కళాకారులు పాల్గొన్నారు. టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఎవి ధర్మారెడ్డి, జెఇఒ వీరబ్రహ్మం వాహనసేవల్లో పాల్గొని, యాత్రికులకు అందుతున్న సేవలను పర్యవేక్షించారు.



శ్రీశైల భ్రమరాంబకు స్వర్ణ రథం బహూకరణ

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి

శ్రీశైల భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామికి రాజ్యసభ సభ్యులు ప్రభాకర్‌రెడ్డి, టిటిడి ఢిల్లీ స్థానిక సలహా మండలి ఛైర్‌పర్సన్ ప్రశాంతిరెడ్డి దంపతులు బంగారు రథాన్ని కానుకగా అందజేశారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. స్వర్ణ రథం ప్రారంభోత్సవం అనంతరం భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామివారిని రథంపై ఊరేగించారు.

మిలాన్‌కు నేవీ సన్నాహాలు

- 19 నుంచి 27 వరకూ విన్యాసాలు
- తూర్పు నేవిదళం వేదికగా పాల్గొననున్న 50 దేశాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

50 దేశాలకు చెందిన నావికాదళాల భాగస్వామ్యంతో ఈ నెల 19 నుంచి 27 వరకూ 'మిలాన్-2024' నౌకాదళ 12వ ఎడిషన్ విన్యాసాలకు 'సిటీ ఆఫ్ డెస్టినీ' విశాఖలోని తూర్పు నౌకాదళం సిద్ధమవుతోంది. నావికాదళ దేశాలతో స్నేహపూర్వక బంధం, అంతర్జాతీయ సముద్ర జలాల్లో వ్యూహాత్మక భాగస్వామ్యమే లక్ష్యంగా ఈ విన్యాసాలను నిర్వహించేందుకు ఇండియన్ నేవీ సిద్ధమైంది. రాష్ట్ర ప్రభుత్వం వీటిని విశాఖలో నిర్వహించేందుకు అవసరమైన సహకారాన్ని అందించడానికి సిద్ధమవ్వడంతో ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. ఇప్పటికే అన్ని దేశాల నౌకాదళాలకు తూర్పునౌకాదళం ఆహ్వానాలను పంపింది. విశాఖ నగర వైభవాన్ని ప్రపంచానికి చాటడం, తూర్పు నౌకాదళ సామర్థ్యాన్ని పెంచుకునే దిశగా నేవీ పలు కార్యక్రమాలను ఈ సందర్భంగా రూపొందిస్తోంది. దీనిలో భాగంగా భారీ కవాతు ఉండనుంది. ఫిషింగ్ హార్బర్ నుంచి అప్పుఘర్ బీచ్ ప్రాంతం అంతటా నగర ప్రజలు, విదేశీయుల దృష్టిని ఆకర్షించేలా ఈ కవాతు జరుగనుంది. తాము కూడా ఈ కార్యక్రమాల రూపకల్పనలో నౌకాదళంతో భాగస్వామ్యం అవుతున్నట్లు జివిఎంసి కమిషనర్ జి.సాయికాంత్ వర్మ ప్రకటించారు. తూర్పు నౌకాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాములు, విమానాలు తమ తమ కార్యాచరణలో ఇప్పటికే ప్రపంచ ఖ్యాతి గడించాయని తూర్పు నౌకాదళం చీఫ్ ఆఫ్ నేవల్ స్టాఫ్ సమీర్ సక్సేనా ఇదివరకే ప్రకటించారు. తూర్పు నౌకాదళం యూనిట్లను ఆఫ్రికా పశ్చిమ తీరం, జపాన్, ఆస్ట్రేలియా, వివిధ సముద్ర తీరాలకు విస్తరించడం, సామర్థ్యాన్ని బలోపేతం చేసేదిశగా కార్యకలాపాలు ఉండనున్నట్లు తెలిపారు.



జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న గవర్నర్

పింగళి సేవలు చిరస్మరణీయం

- రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్
- జగ్గయ్యపేటలో 150 అడుగుల జాతీయ పతాకం ఆవిష్కరణ

ప్రజాశక్తి-జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

భారతదేశ జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య సేవలు చిరస్మరణీయమని, దేశ ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచి ఉంటారని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేటలోని తిరంగా పార్కులో ఏర్పాటు చేసిన 150 అడుగుల జాతీయ జెండాను గవర్నర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి పింగళి వెంకయ్య మనుమడు జివిఎన్ నరసింహం దంపతులు ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గవర్నర్ మాట్లాడుతూ.. చారిత్రక ఔన్నత్యం కలిగిన జగ్గయ్యపేటలో 150 అడుగుల జాతీయ జెండాను ఆవిష్కరించినందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని రూపొందించడం అందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. అనంతరం పింగళి వెంకయ్య మనుమడు జివిఎన్ నరసింహం దంపతులతోపాటు, జగ్గయ్యపేట అభివృద్ధిలో భాగస్వాములవుతున్న కెసిపి సిమెంట్స్, అల్ట్రాటెక్, రామ్‌కో, కోహాన్స్ లైఫ్ సైన్సెస్ తదితర సంస్థల ప్రతినిధులను సత్కరించారు. కార్యక్రమంలో గవర్నర్ సతీమణి సమీర నజీర్, ఎంపి కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్సీ ఎం.అరుణ్‌కుమార్, రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను, కలెక్టర్ ఎస్.డిల్లీరావు, తదితరులు పాల్గొన్నారు.

నైక్‌లో వేలాది ఉద్యోగుల తొలగింపు



న్యూయార్క్ : ప్రముఖ స్పోర్ట్‌వేర్ ఉత్పత్తుల తయారీదారు నైక్ ప్రపంచ వ్యాప్తంగా తమ కంపెనీలో పని చేస్తున్న వారిలో రెండు శాతం మందికి ఉద్వాసన పలికనుంది. దాదాపు 1600 కంటే ఎక్కువ సిబ్బందిని తొలగిస్తున్నట్లు ఆ సంస్థ చేసింది. వ్యయ నియంత్రణలో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. 2023 మే 31 నాటికి నైక్ కంపెనీలో దాదాపు 83,700 మంది ఉద్యోగులు ఉన్నారు. ఇందులో 12వేల మంది కంపెనీ ప్రధాన కార్యాలయంలో పని చేస్తున్నారు. కంపెనీ తొలగించనున్న ఉద్యోగులలో స్టోర్ ఉద్యోగులు, స్టోర్ మేనేజర్లు లేదా డిస్ట్రిబ్యూషన్ సెంటర్ సిబ్బంది ఉన్నారని తెలుస్తోంది. మొత్తం రెండు దశల్లో ఉద్యోగుల తొలగింపు ఉంటుందని నైక్ తెలిపింది. తొలి దశ ఫిబ్రవరి 16 నుంచే ప్రారంభమవుతుందని వెల్లడించింది. ఇక రెండో విడత తొలగింపులు నాలుగో త్రైమాసికం చివరి నుంచి ఉంటాయని పేర్కొంది. మూడవ త్రైమాసికంలో ఉద్యోగుల ఖర్చుల 400 మిలియన్ డాలర్ల నుంచి 450 మిలియన్ డాలర్ల వరకు పెరిగిందని తెలిపింది.

పేటియం ఫాస్టాగ్ జారీపై నిషేధం

ఐహెచ్‌సిఎల్ నిర్ణయం

న్యూఢిల్లీ : పేటియం పేమెంట్ బ్యాంక్ లిమిటెడ్ (పిపిబిఎల్) మరో ఎదురు దెబ్బ తగిలింది. తాజాగా ఫాస్టాగ్‌లు జారీ చేయకుండా నిషేధం విధించారు. ఎన్‌హెచ్‌ఎఐకి చెందిన ఇండియన్ హైవే మేనేజ్‌మెంట్ కంపెనీ లిమిటెడ్ (ఐహెచ్‌సిఎల్) ఆధీకృత బ్యాంకుల జాబితా నుంచి పేటియం బ్యాంక్‌ను తొలగించింది. పిపిబిఎల్‌పై ఆర్‌బిఐ ఆంక్షల నేపథ్యంలో ఐహెచ్‌సిఎల్ ఈ నిర్ణయం తీసుకుంది. తాము ప్రకటించిన 32 బ్యాంకుల నుంచే ఫాస్టాగ్‌లు తీసుకోవాలని సూచించింది. భారత్‌లో ఎనిమిది కోట్ల మందికి పైగా ఫాస్టాగ్ వినియోగదారులు ఉన్నారని ఎన్‌హెచ్‌ఎఐ ఉన్నతాధికారి తెలిపారు. ఫాస్టాగ్ జారీల్లో పేటియంకు 30 శాతం వాటా ఉందన్నారు. గతేడాది జనవరిలో కూడా ఓ సారి పేటియం ఫాస్టాగ్‌ల జారీపై ఆంక్షలు విధించింది. ఇటీవల ఆర్‌బిఐ దాదాపు అన్ని పేటియం సేవలపై ఆంక్షలు ప్రవేశపెట్టింది. ఫిబ్రవరి 29 తర్వాత కొత్త అకౌంట్స్, డిపాజిట్లు, క్రెడిట్ ట్రాన్సాక్షన్స్ జరుపొద్దని జనవరి 31న ఆదేశాలు ఇచ్చింది. దీంతో ఆ సంస్థ ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపగా.. మరోవైపు స్టాక్ మార్కెట్‌లో పేటియం షేరు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటుంది. ఆర్థిక అవకతవకలు, మనీలాండరింగ్ కేసులో పేటియం అధికారులను ఇడి విచారిస్తోన్న విషయం తెలిసిందే.



మరో 15 రోజులు గడువు పెంపు..

పిపిబిఎల్‌కు ఆర్‌బిఐ ఇచ్చిన గడువును మరో 15 రోజులు పొడగించింది. ఫిబ్రవరి 29 తర్వాత కస్టమర్ల ఖాతాలు, డిపాజిట్లు, టాప్‌అప్‌లు స్వీకరించొద్దని గత నెల చివరన ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. దీన్ని మార్చి 15 వరకు పొడగిస్తూ.. శుక్రవారం ప్రకటన చేసింది. ఖాతాదారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ నగదు ఉపసంహరించుకునేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకుందని సమాచారం.

నగల కోసమే హత్య

- వీడిన వృద్ధురాళ్ల హత్య కేసు మిస్టరీ

ప్రజాశక్తి - నెల్లూరు

నెల్లూరు జిల్లాలో ఇద్దరు వృద్ధురాళ్ల హత్య కేసు మిస్టరీ వీడింది. నగల కోసమే కూరగాయల దుకాణం నిర్వాహకుడు ఈ ఘాతుకానికి పాల్పడినట్లు విచారణలో తేలింది. ఈ మేరకు కేసు వివరాలను ఎస్‌పి డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తన కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాచలం మండలం కందలపాడుకు చెందిన కప్పిర గిరీష్ బుజుబుజనెల్లూరు వద్ద కూరగాయల దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12న చెముడుగుంట, పవన్‌కాలనీ ప్రాంతాలకు చెందిన మేకల జయలక్ష్మి (67), గంగవరపు రాజేశ్వరి (70) కూరగాయలు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. ఇద్దరు వృద్ధురాళ్లతో గిరీష్ నమ్మకంగా మాట్లాడుతూ దుకాణం వెనుక ఉన్న ఇంటిలో తాజా కూరగాయలు ఉన్నాయని, వెళ్లి తెచ్చుకోమని నమ్మించాడు. ఒకరి తరువాత ఒకరిని వెంట తీసుకెళ్లి హత్య చేశారు. ఓ వృద్ధురాలిని రోకలి బండతో తలపై బలంగా కొట్టి, మరో వృద్ధురాలిని కత్తితో దాడి చేసి హత్య చేశాడు. జయలక్ష్మి మెడలోని నాలుగున్నర సవర్ల బంగారు నానుతాడు, రెండు ఉంగరాలు, బంగారు గాజులు దొంగిలించాడు. రాజేశ్వరి మెడలోని ఆభరణాలను పరిశీలించగా గిల్టీ నగలని గుర్తించి వాటిని అక్కడే వదిలేశాడు. అనంతరం మృతదేహాలను ఆటోలో వేసుకొని అంబాపురం అడవి ప్రాంతంలోకి తీసుకెళ్లి పెట్రోల్ పోసి తగలబెట్టాడు. అడిషినల్ ఎస్‌పి సౌజన్య పర్యవేక్షణలో వెంకటాచలం సిఐ బి.అంకమ్మరావు ఆధ్వర్యంలో సాంకేతికత ఆధారంగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో చెడు వ్యసనాల కారణంగా అప్పులు ఎక్కువ కావడం, చేసిన అప్పులు తీర్చాలని ఒత్తిడి అధికం కావడంతో బంగారు నగలు ధరించి కూరగాయలు కొనుగోలు చేసేందుకు వచ్చిన ఇద్దరు వృద్ధురాళ్లను హత్య చేసినట్లు అంగీకరించాడు. ఈ కేసు దర్యాప్తులో ప్రతిభను కనబరిచిన పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించారు.

గో ఫస్ట్‌పై స్పైస్‌జెట్ దృష్టి

- కొనుగోలుకు బిడ్డింగ్

న్యూఢిల్లీ : దివాలా తీసిన గో ఫస్ట్ ఎయిర్‌లైన్స్‌ను స్వాధీనం చేసుకోవడానికి స్పైస్‌జెట్ ఛైర్మన్ అజయ్ సింగ్ ఆసక్తి చూపుతున్నారు. గో ఫస్ట్‌ను కొనుగోలు చేసేందుకు ఆయన బిడ్ దాఖలు చేశారు. ఇది సాధించుకోగలిగితే స్పైస్ జెట్ ఆపరేషన్స్‌కు సాయం అవుతుందని అజయ్ సింగ్ పేర్కొన్నారు. తన వ్యక్తిగత సామర్థ్యం ఆధారమే బిడ్ వేశామన్నారు. అపార సామర్థ్యం గల 'గో-ఫస్ట్' టేకోవర్ చేసుకోవడంతో రెండు సంస్థలకు లబ్ధి చేకూరునుందని ఆశాభావం వ్యక్తం చేశారు. గో-ఫస్ట్'కు విలువైన బ్రాండ్ ప్రయాణికులు ఉన్నారన్నారు. కార్పొరేట్ దివాలా చట్టం ప్రక్రియ పూర్తి చేయడానికి గో-ఫస్ట్‌కు నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ మరో 60 రోజుల సమయం ఇచ్చింది. తమ సంస్థను టేకోవర్ చేసేందుకు మూడు సంస్థలు బిడ్ దాఖలు చేశాయని ఎన్‌సిఎల్‌టికి గోఫస్ట్ వెల్లడించింది. గోఫస్ట్ బ్యాంకుల నుంచి రూ.6,251 కోట్ల అప్పులు తీసుకొని చెల్లించడంలో విఫలమయ్యింది. దీంతో దివాలా ప్రక్రియకు వెళ్లడంతో గతేడాది మేలో తన విమాన సేవలను రద్దు చేసుకుంది.

కీర్తిలాల్‌లో బంధన్ వివాహ కలెక్షన్ ప్రారంభం

హైదరాబాద్ : దేశంలోని ప్రముఖ ఆభరణాల సంస్థ కీర్తిలాల్స్ బంధన్ పేరుతో సరికొత్త వెడ్డింగ్ కలెక్షను ప్రారంభించినట్లు తెలిపింది. వివాహం సందర్భంగా ధరించే ప్రత్యేక వజ్రాభరణాల కలెక్షన్ తమ వద్ద రూపొందించబడిందని కీర్తిలాల్స్ బిజినెస్ స్ట్రాటజీ డైరెక్టర్ సూరజ్ శాంత కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 'బంధన్' నిశ్చితార్థం, మెహందీ, సంగీత్ నుండి పెళ్లి రిసెప్షన్ వరకు వధువు యొక్క ప్రత్యేక ప్రయాణంలోని ప్రతి క్షణాన్ని చక్కగా తీర్చిదిద్దడానికి తమ అభరణాలు దోహదం చేస్తాయన్నారు. నేటి అధునాతన వినియోగదారుల విభిన్న అభిరుచులు ప్రాధాన్యతలను మిళితం చేయడంలో కీర్తిబాల్స్ అంకిత భావాన్ని ప్రతిబింబిస్తుందన్నారు.



'యూసీ'లిస్తేనే...

రాష్ట్రానికి తేల్చిచెబుతున్న కేంద్రం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇచ్చిన నిధులపై కేంద్రం నుంచి వత్తిడి పెరిగిపోతోంది. ఇచ్చిన నిధులను ఖర్చు చేసినట్లుగా వినియోగ ధృవీకరణ పత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికేట్స్-యుసి) సమర్పిస్తేనే తదుపరి నిధులు ఇస్తామంటూ కేంద్ర ఆర్థికశాఖ నుండి రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదులు వచ్చినట్లు తెలిసింది. దీంతో రాష్ట్ర ఆర్థికశాఖ కూడా అన్ని శాఖలకు సర్క్యులర్లు పంపించి, తక్షణమే యూసీలు అందించాలని ఆదేశించింది. వచ్చే నెలాఖరుతో 2023-24 ఆర్థిక సంవత్సరం ముగిసిపోనుంది. ఈ ఏడాది రాష్ట్రానికి రావాల్సిన నిధులు కూడా భారీగానే పెండింగ్‌లో ఉన్నాయి. కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా నిధులు కాకుండా, పలు పథకాలకు కేంద్రం ఇవ్వాల్సిన వాటా నిధులపైనే ఇప్పుడు చర్చ జరుగుతోంది. తాము ఇచ్చిన నిధులకు రాష్ట్రం నుంచి వినియోగ ధృవీకరణ పత్రాలు రావడం లేదని, ఈ నిధులు ఏమయ్యాయో తెలీడం లేదని కేంద్ర నుండి పదేపదే లేఖలు వస్తున్నట్లు రాష్ట్ర అధికారులు చెబుతున్నారు. తాము కూడా శాఖలకు సర్క్యులర్లు పంపించినప్పటికీ యూసీలు మాత్రం సక్రమంగా రావడం లేదని ఆర్థికశాఖ చెబుతోంది.

ఈ నేపథ్యంలోనే తాజాగా మరోసారి కేంద్ర నిధులు వచ్చే ఇతర అన్ని శాఖలకు ఆర్థికశాఖ లేఖలు రాయడంతో పాటు వాట్సాప్ సందేశాలు కూడా పంపించడం చేసినట్లు తెలిసింది. కొద్ది రోజుల క్రితమే రాష్ట్ర ఆర్థికశాఖ ఉన్నతాధికారులు ఢిల్లీకి వెళ్లిన సమయంలోనే యూసీలపైనా కేంద్ర అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది.

గన్నవరంలో హెచ్‌సిఎల్ నియామక డ్రైవ్

ప్రజాశక్తి - హైదరాబాద్



ప్రముఖ టెక్నాలజీ కంపెనీ హెచ్‌సిఎల్ టెక్ 500 పైగా నియామకాల కోసం ప్రత్యేక డ్రైవ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది. ఫిబ్రవరి 17న గన్నవరంలోని తమ క్యాంపస్‌లలో నియామక ప్రక్రియ చేపడుతున్నట్లు పేర్కొంది. టెక్నాలజీలో మూడు లేదా ఎక్కువ సంవత్సరాల పని అనుభవంతో ఉన్న నిపుణులకు అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించింది. "మా విభిన్నమైన సిబ్బంది ఇక్కడ ఇప్పుడు అత్యంత ముఖ్యమైన సాంకేతిక పురోగతిలలో నిపుణుల నైపుణ్యాలతో 100కిపైగా అంతర్జాతీయ క్లయింట్లకు సేవలు అందిస్తున్నాము. ఈ మెగా నియామకం డ్రైవ్ ద్వారా టెకీలకు అవకాశాలు కల్పించడానికి ఉత్సాహంగా ఉన్నాము." అని హెచ్‌సిఎల్ టెక్ విజయవాడ సెంటర్ ప్రధాన అధికారి శివ ప్రసాద్ పేర్కొన్నారు. తమ విజయవాడ క్యాంపస్‌లో 43 శాతం మహిళ ఉద్యోగులున్నారని తెలిపారు.

సంపాదకీయం


శ్రామికుల హెచ్చరిక

సంయుక్త కిసాన్ మోర్చా, వివిధ కేంద్ర కార్మిక సంఘాల పిలుపు మేరకు శుక్రవారంనాడు కార్మిక కర్షక లోకం కేంద్ర ప్రభుత్వ దుర్విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలు, అనేక రాష్ట్రాల్లో గ్రామీణ బంద్, వివిధ రంగాల్లో పారిశ్రామిక సమ్మె విజయవంతం కావడం హర్షణీయం. నాలుగు కార్మిక కోడ్‌ల రద్దు, మద్దతు ధరకు చట్టం చేయడం వంటి ప్రధాన డిమాండ్లతో దేశ రాజధాని ఢిల్లీలో, పంజాబ్, హర్యానా, మహారాష్ట్ర, రాజస్థాన్, కేరళ, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో భారీ ర్యాలీలు, నిరసన ప్రదర్శనలూ చేపట్టారు. పంజాబ్ హర్యానాల్లో రైల్వే స్టేషన్లవద్ద ఆందోళనలతో పలు రైళ్లను దారి మళ్లించారు. సామాన్యుల నడ్డి విరగ్గొట్టి కార్పొరేట్లకు లబ్ధి చేకూర్చడం కోసం విద్వేష సృష్టితో పాలన సాగిస్తున్న మోడీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి శ్రామికులు పూరించిన శంఖారావంగా భావించవచ్చు. సంపద సృష్టికి కారణమైన కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, వివిధ సేవలందించే ఉద్యోగులూ ఒక్కటై సర్కారు విధానాలను ప్రతిఘటించడం అభినందనీయం.

గడచిన నాలుగు రోజులుగా అన్నదాతల 'ఢిల్లీ ఛలో'ను అడ్డుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అడుగడుగునా ఆంక్షలు విధించింది. పోలీసులు భాష్పవాయు గోళాలను, రబ్బర్ బులెట్లను ప్రయోగించడంతో పలువురు రైతులు గాయపడ్డారు. సిమెంట్ దిమ్మెలను రోడ్లకు అడ్డంగా వుంచడం, రోడ్లపై ఇనుప మేకులను అమర్చడంతోపాటు ఢిల్లీకి దారితీసే అన్ని దారులను మూసివేశారు. డ్రోన్లతో టియర్ గ్యాస్ షెల్స్ ప్రయోగిస్తుంటే రైతులు గాలిపటాలు ఎగురవేసి డ్రోన్లను అడ్డుకోవడం, టియర్ గ్యాస్ ప్రభావాన్ని తగ్గించుకునేందుకు తాగునీటి బాటిళ్లతో దుస్తులు తడిగా ఉంచుకోవడం వంటివి వారి ప్రతిఘటనా స్ఫూర్తికి నిదర్శనం. కేంద్ర ప్రభుత్వ దాష్టీకాన్ని ఢిల్లీ హైకోర్టు సైతం తప్పుబట్టింది. రైతులకు రోడ్లపై తిరుగాడే హక్కు ఉందని ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసి, రైతులు నిరసన తెలిపేందుకు స్థలాలను గుర్తించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపింది. శాంతియుతంగా నిరసన చేస్తున్న రైతులను నేరస్థులుగా పరిగణించలేమని, వారు దేశానికి అన్నం పెట్టే అన్నదాతలని ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ఎంఎస్ స్వామినాథన్ కుమార్తె డాక్టర్ మధుర స్వామినాథన్ వ్యాఖ్యలు అక్షర సత్యాలు. రైతులపై డ్రోన్లను వినియోగించి మరీ భాష్పవాయు గోళాలు ప్రయోగించి అణిచివేత చర్యలకు పాల్పడటం దుర్మార్గమన్న పలు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతలు అణిచివేత చర్యలకు తక్షణమే ముగింపు పలకాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎల్లెడలా ఆందోళనకారులకు సంఘీభావం, కేంద్రంపై ఆగ్రహం వ్యక్తమయ్యాయి.


ఢిల్లీలో ఒక సంవత్సరం పైగా 2020 నుండి 2021 వరకు ఎడతెగని ఉద్యమం సాగడంతో ఆనాడు మోడీ సర్కారు వెనక్కు తగ్గింది. మూడు వ్యవసాయ నల్ల చట్టాలను బిజెపి ప్రభుత్వం రద్దు చేయాల్సి వచ్చింది. పంటలకు కనీస ధర గ్యారెంటీ చేసే చట్టాన్ని తెస్తామని, 2021 విద్యుత్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకుంటామని రైతు ఉద్యమానికి ప్రభుత్వం హామీ ఇచ్చినా ఆ దిశగా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడమేగాక విద్యుత్ స్మార్ట్ మీటర్లు తప్పనిసరి చేయడం, దేశ సంపదను అదానీ ఆంబానీ వంటి కార్పొరేట్లకు ధారాదత్తం చేసే చర్యలను వేగవంతం చేయడంతో రైతులు, కార్మికులు మళ్లీ ఉద్యమించవలసి వచ్చింది. ఈ నేపథ్యంలో కనీస మద్దతు ధరపై హడావిడిగా చట్టాన్ని చేయడం సాధ్యం కాదని కేంద్ర వ్యవసాయ మంత్రి ప్రకటించడం మోడీ సర్కారు అహంకారానికి నిదర్శనం. ఒకవైపు ఎంఎస్ స్వామినాథన్‌కు భారతరత్న ప్రకటించి, ఆయన చెప్పిన సి2 ప్లస్ 50 మద్దతు ధరగా చెల్లించాలన్న సిఫార్సును బుట్టదాఖలు చేయడం మోసపూరితం. కార్మిక కర్షకుల దేశ వ్యాప్త ఆందోళను హెచ్చరికగా భావించి మోడీ సర్కారు వెనక్కు తగ్గాలి. లేకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేయడంతప్ప కార్మిక కర్షకులకు మరో మార్గం లేదు. ఆ ఉద్యమం మోడీ సర్కారును సాగనంపే వరకూ సాగించాలి.

మహనీయుల మాట




వ్యక్తిగత ఆస్తి అనేది సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలకు మూలం. వ్యక్తిగత ఆస్తుల వలననే సమాజానికి హాని కలుగుతుంది.

- జీన్ జాక్ రూసో,
ఫ్రెంచి విప్లవ కాలం నాటి ప్రసిద్ధ తత్వవేత్త.



ఎన్నికల బాండ్లతో ప్రజాస్వామ్యానికి ప్రమాదం

విశ్లేషణ



నల్లడబ్బు గుట్టలు గుట్టలుగా ఈ బాండ్ల రూపంలో పాలక పార్టీల ఖాతాల్లోకి వెళ్తుంది. ఈ డబ్బుతో ఓట్లను కొనడం అనేక రెట్లు పెరిగింది. ప్రజల చేత కాకుండా డబ్బు చేత ఎన్నుకోబడడంగా మారింది. చట్టసభల్లో బిల్లులు, విధాన నిర్ణయాల్లో ఎంఎల్ఏ, ఎంపీల పాత్ర కుదించుకు పోయింది. అధినేత మాటలే సిద్ధాంతాలుగా, ఏ పూటకు ఏది లాభం అనుకుంటే అదే విధానంగా మారిపోయింది. పెద్ద మొత్తంలో బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చిన కంపెనీలే ప్రభుత్వ విధానాలను రూపొందించే పరిస్థితి వచ్చింది. అనంతరం వారు బ్యాంకులు, బీమా సంస్థలతో మొదలై బిఎస్ఎన్ఎల్, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, రోడ్లు, గనులు, నీళ్ళు, ప్రభుత్వ సంస్థలు ...ఇలా ఒక్కటేమిటి సర్వ సంపదను సులభంగా కాజేస్తున్నారు. ఎన్నికల బాండ్ల వ్యవస్థ ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను నిస్సారంగా మారుస్తుంది. మరోవైపు దేశ సంపదను లూటీ చేస్తుంది.

ఎన్నికల బాండ్ల విధానం వెనుక బిజెపి, దాని మాతృసంస్థ ఆర్ఎస్ఎస్ రహస్య ఎజెండా ఉంది. అత్యంత సంపన్న కార్పొరేట్ కంపెనీల నుండి పెద్ద ఎత్తున విరాళాలు సేకరించి ఎన్నికల వ్యవస్థను తమకు అనుకూలంగా మలచుకోవడం, మతోన్మాద కార్యక్రమాలకు పెద్ద ఎత్తున ధనాన్ని పోగు చేయడమనే ఎజెండాలో భాగమే ఎన్నికల బాండ్ల వ్యవస్థ. గుండు సూది మీద కూడా లాభాలు దండుకుని, చట్టబద్ధ పన్నులు ఎగ్గొట్టి, బ్యాంకులను దివాళా తీయిస్తున్న ఈ కార్పొరేట్ కంపెనీలు ఏ పార్టీకీ విరాళాలు ఊరికే ఇవ్వవు. డబ్బు ఊరికే రాదన్నట్లు కార్పొరేట్ కంపెనీల నుండి రాజకీయ పార్టీలకు అందునా అధికార పార్టీకి భారీ స్థాయిలో విరాళాలు ఊరికే రావు. 'నేను కొంత ఇస్తాను, ఆ తర్వాత అంతకంత, మరింత' కావాలనే ఈ కంపెనీలకు దోచిపెడితే అందులో కొంత అధికార పార్టీలకు దానం చేస్తారు. అందుకే సుప్రీంకోర్టు ఎన్నికల బాండ్ల విధానం క్విడ్‌ప్రోకోకు దారితీస్తుందని వాఖ్యానించింది. నేటి వాస్తవ పరిస్థితిని ఈ తీర్పు ప్రతిబింబించింది. 2018 నుండి ఎన్నికల బాండ్ల ద్వారా జాతీయ, ప్రాంతీయ పార్టీలకు రూ.16,437 కోట్ల విరాళాలు అందగా, అందులో రూ.10,117 కోట్లు బిజెపి ఖాతాలోకి వెళ్ళాయంటే ఈ విధానం ఎవరి కోసం వచ్చిందో అర్థమవుతుంది.



వి. రాంభూపాల్

బిజెపి పాలనా కాలంలో కార్పొరేట్, మతతత్వ శక్తుల బంధం బలపడిందని, అది ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమని చాలా ముందుగానే సిపిఎం హెచ్చరించింది. సుప్రీంకోర్టులో కేసు వేసింది. నేటి తీర్పుకు కారణమైంది. రాజ్యాంగ విరుద్ధమైన ఎన్నికల బాండ్లను రద్దు చేస్తూ సుప్రీంకోర్టు చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన కీలక తీర్పుల్లో న్యాయమూర్తులు పరస్పర విరుద్ధంగా తమ నిర్ణయాలను ప్రకటిస్తూ వచ్చిన నేపథ్యంలో ఎన్నికల బాండ్ల మీద ఐదుగురు సభ్యుల ధర్మాసనం ఏకగ్రీవంగా 232 పేజీల తీర్పునివ్వడం సంచలనమే. ప్రజాస్వామ్య వ్యవస్థకు కార్పొరేట్ కంపెనీల చెదలు ఎంత ప్రమాదకరంగా మారుతున్నాయో ఈ తీర్పు తేటతెల్లం చేసింది. ఇప్పటి వరకు విక్రయించిన ఎన్నికల బాండ్ల వివరాలను మార్చి 6వ తేదీ నాటికి ఎన్నికల కమిషన్‌కు అందజేయాలని, ఎవరు, ఏ పార్టీకి ఎంత మొత్తంలో జమ చేశారనే వివరాలు మార్చి 13 నాటికి బహిరంగంగా ఉంచాలని ఎన్నికల సంఘాన్ని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశం అమలయితే పాలక బిజెపి లోగుట్టు మరింత రట్టు అవుతుంది. మతం చాటున, దేశభక్తి ముసుగున సాగింది ఏమిటో కొంతైనా బట్టబయలు అవుతుంది.

ఎన్నికల బాండ్లు ఎందుకు?

దేశంలోని రాజకీయ పార్టీలకు విరాళాలు అందించేందుకు 2017-18 బడ్జెట్‌లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. 2018 మార్చి 1 నుండి 10 వరకు మొదటి విడత బాండ్ల అమ్మకాలు ప్రారంభమయ్యాయి. జూన్ 29 నుండి ఇది పూర్తిస్థాయిలో అమలులోకి వచ్చింది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా వెయ్యి రూపాయల నుండి కోటి విలువ చేసే బాండ్లను విడుదల చేస్తుంది. ఎవరైనా ఈ బాండ్లను ఎంత మొత్తంలోనైనా కొని తమకు ఇష్టమైన పార్టీకి అందించవచ్చు. రిప్రజెంటేటివ్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్ ప్రకారం నమోదైన రాజకీయ పార్టీలు ఈ బాండ్ల నుండి విరాళాలు పొందవచ్చు. ఈ బాండ్లను ప్రతి సంవత్సరం జనవరి, ఏప్రిల్, జులై, అక్టోబర్ నెలల్లో విడుదల చేస్తారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో మరో 30 రోజులు అదనంగా అందుబాటులో ఉంచుతారు. ఈ ఏడు సంవత్సరాల్లో 30 సార్లు 28 వేల బాండ్లను విడుదల చేశారు. వాటి మొత్తం విలువ రూ.16,437 కోట్లు.

తమకు ఇష్టమైన పార్టీకి నేరుగా విరాళం ఇవ్వొచ్చు కదా. ఈ బాండ్లను కొనడం, ఇవ్వడం ఎందుకనే సందేహం వస్తుంది. ఎవరి నుండి ఎంత మొత్తం విరాళాలు అందాయో ఆ వ్యక్తులు, సంస్థల పేర్లు ఎన్నికల సంఘానికి రాజకీయ పార్టీలు తెలిపే విధానం గతంలో వుండేది. దీనివల్ల పారదర్శకత లోపించిందని, అందుకు ఎన్నికల బాండ్లు పరిష్కారమని బిజెపి వాదించింది. అయితే ఈ విధానం ప్రకారం కొన్నవారి పేర్లు, తీసుకున్న పార్టీల పేర్లు ఎక్కడ నమోదు కావు. నల్లడబ్బును వెలికితీయడానికి రూ.500 నోట్లు రద్దు చేసి రూ.2,000 నోట్లను ప్రవేశపెట్టడం, పారదర్శకత చాటున ఎలక్టోరల్ బాండ్లు తెచ్చి రూ. వేల కోట్లను తమ ఖాతాల్లో వేసుకోవడం బిజెపి బహు నాలుకల విధానం. ఎన్నికల బాండ్ల ప్రవాహానికి ఏ ఆటంకాలు లేకుండా ఉండేందుకు అనేక చట్టాలకు సవరణలు చేశారు. ఉదా: కంపెనీలు తమ రాజకీయ విరాళాల వివరాలను బ్యాలెన్స్ షీట్‌లో రాయాల్సిన అవసరం లేకుండా కంపెనీల చట్టానికి 2013లో సవరణలు తెచ్చింది. విదేశీ సంస్థలు కూడా విరాళాలు అందించేందుకు వీలుగా ఎఫ్‌సిఆర్ఎ చట్టానికి సవరణలు చేసింది. ఈ ఎన్నికల బాండ్ల పథకం అమలు కావాలంటే పార్లమెంట్ ఆమోదం కావాలి. రాజ్యసభలో బిజెపికి పూర్తి మెజారిటీ లేదు. అందుకోసం దొడ్డిదారిన ఈ పథకాన్ని బడ్జెట్‌లో మనీ బిల్‌గా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి రాజ్యసభ ఆమోదం అవసరం లేకుండా ఆమోదించుకున్నారు.

సేవా దృక్పథంతో నడిచే అనేక స్వచ్ఛంద సంస్థలు బిజెపి పాలనా కాలంలో మూతబడ్డాయి. ఈ సంస్థలపై తనిఖీలు, వేధింపులు, దుష్ప్రచారాలు పెరిగాయి. ఇప్పటి వరకు అమ్మిన ఎన్నికల బాండ్లలో కోటి రూపాయల విలువ చేసే బాండ్లు 54 శాతం, పది లక్షల బాండ్లు 41 శాతంగా ఉన్నాయి. ఇందులో అత్యధికం బిజెపి ఖాతాలోకి చేరాయి. అధికారంలో ఎవరుంటే వారి ఖాతాల్లోకి ఈ ఎన్నికల బాండ్లు వెళతాయి. మన రాష్ట్రంలో తెలుగుదేశం, వైసిపిలకు అందిన ఈ విరాళాలు అధికారాన్ని బట్టి అందాయి.

ప్రజాస్వామ్యానికే ప్రమాదం

ప్రజాస్వామ్యానికి పునాది ప్రజాభిప్రాయం. అందుకే ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజల వలన పాలించేది ప్రజాస్వామ్యం అన్నారు. ఈ ప్రక్రియ ఎన్నికల ద్వారా జరుగుతుంది. ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తాము చేసే పనుల ద్వారా, ఎన్నికల సమయంలో ప్రకటించే ప్రణాళికల ద్వారా ప్రజాభిప్రాయాన్ని తమవైపు ఆకర్షిస్తారు. అయితే పాలక పార్టీలు ఎప్పుడూ ప్రజలను, వారి అభిప్రాయాలను గౌరవించడం, ప్రజలకు తాము సేవకులమనే విషయాలను చాలాకాలం క్రితమే మరచిపోయారు. అందుకే ఎన్నికలంటే డబ్బులు పెట్టి ఓట్లు కొనడంగా మార్చివేశారు. ముఖ్యంగా సరళీకరణ విధానాలు అమలులోకి వచ్చిన తర్వాత ప్రజలు పోరాడి సాధించుకున్న ప్రజాస్వామ్య వ్యవస్థ తీవ్ర ప్రమాదంలో పడింది. డబ్బున్నవారిదే ఎన్నిక లాగా మారింది. ఎన్నికల ముందు నోట్ల కట్టలతో పార్టీల చుట్టూ తిరిగి ఏదో పార్టీలో సీటు సంపాదించుకోవడం, గెలిచిన తర్వాత అధికారంలో ఏ పార్టీ వుంటే ఆ పార్టీలో చేరడం ఇటీవల సర్వసాధారణమైంది. ఎన్నికల బాండ్ల విధానం ఈ పరిస్థితిని మరింతగా దిగజార్చింది. నల్లడబ్బు గుట్టలు గుట్టలుగా ఈ బాండ్ల రూపంలో పాలక పార్టీల ఖాతాల్లోకి వెళ్తుంది. ఈ డబ్బుతో ఓట్లను కొనడం అనేక రెట్లు పెరిగింది. ప్రజల చేత కాకుండా డబ్బు చేత ఎన్నుకోబడడంగా మారింది. చట్టసభల్లో బిల్లులు, విధాన నిర్ణయాల్లో ఎంఎల్ఏ, ఎంపీల పాత్ర కుదించుకు పోయింది. అధినేత మాటలే సిద్ధాంతాలుగా, ఏ పూటకు ఏది లాభం అనుకుంటే అదే విధానంగా మారిపోయింది. పెద్ద మొత్తంలో బాండ్ల రూపంలో విరాళాలు ఇచ్చిన కంపెనీలే ప్రభుత్వ విధానాలను రూపొందించే పరిస్థితి వచ్చింది. అనంతరం వారు బ్యాంకులు, బీమా సంస్థలతో మొదలై బిఎస్ఎన్ఎల్, రైల్వే, ఓడరేవులు, విమానాశ్రయాలు, రోడ్లు, గనులు, నీళ్ళు, ప్రభుత్వ సంస్థలు ఇలా ఒక్కటేమిటి సర్వ సంపదను సులభంగా కాజేస్తున్నారు. ఎన్నికల బాండ్ల వ్యవస్థ ఒకవైపు ప్రజాస్వామ్య వ్యవస్థను నిస్సారంగా మారుస్తుంది. మరోవైపు దేశ సంపదను లూటీ చేస్తుంది.

హెచ్చరికలు బేఖాతరు

కేంద్రంలో పది సంవత్సరాలుగా అధికారాన్ని చెలాయిస్తున్న బిజెపి రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విధానాన్ని ఎంత బలహీనం చేయాలో అంతగా చేసేసింది. పారిశ్రామిక విప్లవం బూర్జువా ప్రజాస్వామ్యాన్ని సృష్టించుకుంది. దాని అభివృద్ధికి ఆటంకమైతే ఆ ప్రజాస్వామ్యాన్ని కూడా భక్షిస్తుందనేది వర్తమాన సత్యం. అయితే బిజెపి సిద్ధాంతమే బూర్జువా ప్రజాస్వామ్యం కంటే మరింత వెనుకటిది. రాజరిక పాలనా వ్యవస్థ, మను ధర్మ వర్ణ వ్యవస్థ ఆర్ఎస్ఎస్ లక్ష్యం. ఆధునిక శాస్త్రీయత దానికి గిట్టదు. ప్రజాస్వామ్య వ్యవస్థను ధ్వంసం చేయడానికి అనేక విధాల ప్రయత్నిస్తున్నది. అందులో ఒక భాగం ఎన్నికల బాండ్ల విధానం. ఈ విధానం పారదర్శకతకు ముగింపు అని, విదేశీ కార్పొరేట్ శక్తులు దేశ రాజకీయాలను ప్రభావితం చేయడానికి వీలుంటుందని 2019లో సుప్రీంకోర్టుకు అఫిడవిట్‌లో ఎన్నికల కమిషన్ తెలిపింది. రాజకీయ పార్టీలకు విరాళాలు అందించడం కోసమే 'షెల్' (బూటకపు) కంపెనీలు పుట్టుకొస్తాయని పేర్కొంది. రిజర్వు బ్యాంకు కూడా పలు అనుమానాలు వ్యక్తం చేసింది. అనేకమంది నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా కేంద్ర బిజెపి బేఖాతరు చేయడానికి దాని పురాతన సిద్ధాంత అవగాహనే కారణం.

సిపిఎం విశిష్టత

ఎన్నికల బాండ్ల ద్వారా విరాళాలు పొందని ఏకైక రాజకీయ పార్టీ సిపిఎం. గత 20 సంవత్సరాల క్రితం టాటా కంపెనీ చెక్ రూపంలో జాతీయ పార్టీలకు విరాళాలు పంపింది. ఈ విరాళాన్ని బహిరంగంగా వెనక్కు పంపిన ఏకైక రాజకీయ పార్టీ సిపిఎం మాత్రమే. ఆ సమయంలో సిపిఎం నాయకత్వంలో మూడు రాష్ట్రాల్లో వామపక్ష ప్రభుత్వాలున్నాయి. కేంద్రంలో యుపిఎ ప్రభుత్వంలో కీలక భాగస్వామిగా ఉంది. ఎన్నికల బాండ్ల విధానాన్ని ప్రారంభం నుండి అభ్యంతరం చెబుతూ చట్టసభల్లో, బయట అనేక రూపాల్లో ఆందోళనలు చేసింది. రాజకీయ పార్టీలు ప్రజల నుండి పోషించబడాలే కాని కార్పొరేట్ కంపెనీల నుండి కాదన్నది దాని అవగాహన. కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు పంటల సమయంలో శ్రమదానం చేసి విరాళాలు సేకరించడం కమ్యూనిస్టు ఉద్యమ ప్రత్యేకత. ఈ సంప్రదాయాన్ని సిపిఎం కొనసాగిస్తున్నది. ఈ తీర్పుతో సంబంధం లేకుండానే ఈ నెల ఒకటో తేదీ నుండి రాష్ట్ర వ్యాప్తంగా సిపిఎం శ్రేణులు ఇంటింటికి తిరిగి ప్రజానిధి వసూలు చేస్తున్నారు. రాజకీయమంటే వ్యాపారం కాదు, ప్రజాసేవ అని ప్రజల నుండి ఒత్తిడి పెంచడమే ప్రజాస్వామ్యానికి రక్ష.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు /

టిటిడి అటవీ కార్మికుల ఘన విజయం

స్ఫూర్తి

పట్టుదలగా పోరాడితే విజయం తథ్యమని తిరుపతి నగరంలో ఓ చిన్న కార్మిక సంఘం చేసిన పోరాటం నిరూపించింది. స్ఫూర్తిని కలిగిస్తున్న ఈ పోరాట అనుభవం చూడండి.



తిరుమల తిరుపతి దేవస్థానానికి అనుబంధంగా ఉన్న టిటిడి అటవీ కార్మికులు 130 మంది చేపట్టిన పోరాటం చరిత్రను సృష్టించింది. జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన 56 నెలల కాలంలో 38 నెలల పాటు రిలే నిరాహార దీక్షలు చేసి రాష్ట్రంలో అత్యధిక రోజులు పోరాడిన చరిత్రను ఈ చిన్న యూనియన్ సొంతం చేసుకుంది.

2020 నవంబర్ 26వ తారీకున రాజధాని ఢిల్లీ నగరంలో రైతులు ఆందోళన చేపట్టారు. అదే రోజున జోరున కురుస్తున్న వర్షంలో టిటిడి అటవీ కార్మికులు తమని రెగ్యులర్ చేయాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. నాటి ఆ పోరాటాన్ని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.అజయ కుమార్ ప్రారంభించారు. సమ్మె 1163వ రోజున కార్మికులు ఘన విజయం సాధించారు.



సిహెచ్. నర్సింగరావు

362 మంది కార్మికులున్న టిటిడి అటవీ విభాగంలో 162 మంది జూనియర్లను అధికార పార్టీ నాయకుల ఒత్తిడితో టిటిడి యాజమాన్యం పర్మినెంట్ చేసి అటవీ కార్మికులకు అన్యాయం చేసింది. మిగిలిన రెండు వందల మందికి బోర్డు చేసిన తీర్మానం ప్రకారం టైం స్కేల్, అలవెన్సులతో కూడిన వేతనం ఇవ్వాలని సిఐటియు అడుగుతున్నా యాజమాన్యం పట్టించుకోలేదు. అధికార పార్టీ మద్దతుతో జూనియర్ కార్మికుల్ని పర్మినెంట్ చేసి...సిఐటియులో ఉన్న కార్మికులకు యాజమాన్యం అన్యాయం చేసింది. ఇదేమి న్యాయమని ప్రశ్నించినా వినడానికి కూడా టిటిడి యాజమాన్యం సిద్ధపడలేదు.

ఈ నేపథ్యంలో కార్మికులందరూ రెగ్యులర్ అయ్యేంతవరకు పట్టు వదలబోమని ప్రకటించి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. రెండున్నర సంవత్సరాలపాటు 200 మంది కార్మికులు తమ పోరాటాన్ని ఎంతో విశ్వాసంతో నడిపారు.

రెండున్నర సంవత్సరాల తర్వాత అధికార పార్టీ ఎమ్మెల్యే, ముఖ్యమంత్రికి అత్యంత విశ్వసనీయమైన ఓ ప్రజా ప్రతినిధి తమ యూనియన్ లోకి వస్తే పర్మినెంట్ చేయిస్తామని కార్మికులను రెచ్చగొట్టి 200 మందిలో 76 మందిని అధికార పార్టీకి అనుకూలంగా చీల్చి వేశారు. మిగిలిన 124 మంది కార్మికులు పట్టు విడవకుండా వంతులవారీగా కడుపులు మాడ్చుకుంటూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు.

'ఎన్నికల ముందు నేటి ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ, 2019లో టిటిడి బోర్డు చేసిన తీర్మానం, రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశం...ఇందులో ఏ ఒక్కటైనా అమలు జరపండి మహాప్రభో...' అని మూడేళ్లకు పైగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికుల గురించి టిటిడి యాజమాన్యం పట్టించుకోలేదు.

అటవీ కార్మికుల పోరాటానికి సంఘీభావంగా సిఐటియు రాష్ట్రమంతటా ధర్నాలు నిర్వహించింది. ఈ ధర్నాలకు విశేషమైన స్పందన లభించింది. అనంతరం సంఘీభావ విరాళాలను కూడా వసూలు చేయడం జరిగింది. టిటిడి అటవీ కార్మికులు విజయం సాధించడానికి రాష్ట్ర కార్మిక వర్గం భరోసా కలిగించింది. సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ హేమలత, ఐద్వా అఖిల భారత నాయకురాలు బృందాకరత్ తోపాటు జాతీయ, రాష్ట్ర స్థాయి నేతలు పలువురు ఈ పోరాట శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. టిటిడి యాజమాన్యంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నించారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీలు పలుమార్లు ఈ పోరాట కార్యక్రమాల్లో పాల్గొని, శాసనమండలిలో ప్రశ్నించి అటవీ కార్మికులకు అండగా నిలిచారు.

కార్మికులకు మద్దతుగా ఈ జనవరి 27వ తేదీన తిరుపతి జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మరో ఎనిమిది మంది అటవీ కార్మికులు నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. దాంతో తిరుపతి నగరంలో ఈ సమస్య ప్రధానమైన చర్చగా మారింది. పేద అటవీ కార్మికులకు మద్దతుగా తిరుపతి పౌర సమాజం కూడా నిలబడింది. మూడు రోజుల తర్వాత 29వ తేదీన పోలీసులు బలవంతంగా వీరిని అరెస్టు చేసి ఆసుపత్రికి తరలించారు. అరెస్టుల అనంతరం అక్కడికక్కడే మరో ఏడుగురు కార్మికులు నిరవధిక దీక్ష ప్రారంభించారు. అధికార పార్టీ నేతలకు, పోలీసులకు ఈ పోరాటాన్ని ఆపగలిగామన్న సంతోషం గంటసేపు కూడా లేదు.

వివిధ రాజకీయ పార్టీలు కార్మిక సంఘాలు, రిటైర్డ్ జడ్జి, రిటైర్డ్ ప్రిన్సిపాళ్లు, రిటైర్డ్ ఉన్నతాధికారులు, సీనియర్ జర్నలిస్టులు, జర్నలిస్టు సంఘాల వారు, లాయర్లు, పూర్వ విద్యార్థి సంఘాల నేతలు, విద్యార్థి, మహిళా, యువజన సంఘాల వారు టిటిడి పరిపాలనా భవనం ఎదురుగా నిరాహార దీక్షకు పూనుకోవడంతో విధి లేని పరిస్థితుల్లో టిటిడి యాజమాన్యం దిగి వచ్చింది.

సందర్భం

టిటిడి ఇ.ఓ ధర్మారెడ్డి ఆదేశం మేరకు టిటిడి జెఇఓ వీరబ్రహ్మం, సిఇఓ శేష శైలేంద్ర, డిఎఫ్ఓ శ్రీనివాసుల బృందం కార్మిక నేతలతో చర్చలు జరిపింది. అన్యాయానికి గురైన టిటిడి అటవీ కార్మికులందరినీ టిటిడి నిర్వహిస్తున్న కార్పొరేషన్ నుంచి మినహాయిస్తామని, టైమ్ స్కేలు అమలు పరుస్తామని చర్చల్లో హామీనిచ్చారు. అదే రోజు సాయంత్రం టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి శిబిరం వద్దకు వచ్చి దీక్షలో ఉన్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 పిఆర్‌సి ఆధారంగా బేసిక్‌ను అందిస్తామని, ఇఎస్ఐ, పి.ఎఫ్ తో పాటు రూ.3125 మొక్కలు స్కీం పేరుతో అదనంగా అందిస్తామని, ప్రతి రెండేళ్లకు ఒక్కసారి రూ.3125 పెరుగుదల ఉంటుందని ప్రకటించారు.


ఈ ఒప్పందంతో ఒక్కో కార్మికుడికి ఎనిమిది వేల రూపాయలు అదనంగా వేతనం పెరిగినట్లయింది. అటవీ కార్మికులు చేపట్టిన 38 నెలల పోరాట కాలంలో రెండు సార్లు కరోనా రావడం, భారీ వర్షాలు, వరదలు తిరుపతి నగరాన్ని ముంచెత్తడంతో పాటు పండుగలు, పర్వదినాలలో సైతం శిబిరాన్ని వీడకుండా కార్మికులు రిలే నిరాహార దీక్షలను కొనసాగించడం తిరుపతి నగరంలో పెద్ద చర్చగా మారింది. తిరుపతిలో దాదాపు ఈ పోరాటం తెలియని వారు లేరంటే అతిశయోక్తి కాదు.

వెనుకడుగు వేయకుండా స్థిరత్వంతో పోరాడిన ఫలితంగా... పట్టు వీడని విక్రమార్కుల్లాగా అనేక ఒడిదుడుకులను, ఆటంకాలను, విచ్ఛిన్నాలను ఎదుర్కొని సిఐటియు నాయకత్వంలో కార్మికులు ఘన విజయం సాధించారు. పోరాడితే పోయేదేమీ లేదు-బానిస సంకెళ్లు తప్ప...అన్న నానుడిని మరో మారు రుజువు చేసిన అటవీ కార్మికులకు సిఐటియు రాష్ట్ర కమిటీ అభినందనలు తెలియజేస్తున్నది.

/ వ్యాసకర్త సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి /

సందర్భం

బ్రూనో బలిదానం వృథా కారాదు!



సైన్స్ ఎప్పుడూ వాస్తవాలపై ఆధారపడి పని చేస్తుంది. మతం నమ్మకాల ఆధారంగా మనుగడ సాగిస్తుంది. మధ్య యుగం వరకు మతం ప్రపంచ వ్యాప్తంగా తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. మతాల పేరుతో వివిధ వర్గాల వారు తీవ్రంగా ఘర్షణ పడ్డారు. మతాధిపతులు రాజులను సైతం నియంత్రణ చేసేవారు.

15వ శతాబ్దంలో యూరప్‌లో అనేక మంది శాస్త్రవేత్తలు మత భావనలకు విభిన్నమైన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఇందుకు తగిన రుజువులను కూడా చూపించారు. ఇందులో గెలీలియో, బ్రూనో, కోపర్నికస్ అగ్రగణ్యులు. ఈ క్రమంలో వీరు మతవాదుల నుంచి ఎదురు దాడిని ఎదుర్కొన్నారు. గెలీలియో జైలు శిక్ష అనుభవించగా, బ్రూనో ఏకంగా దారుణంగా హత్యకు గురయ్యాడు.

మత గ్రంథాలలో చెప్పిన విషయాలకు విరుద్ధమైన సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్థించినందుకు క్రైస్తవ మత పెద్దలు బ్రూనోను సజీవ దహనం చేశారు. ఆయన కూడా క్రైస్తవ సన్యాసే కానీ క్రైస్తవ పెద్దలు ఆమోదించిన భూకేంద్ర సిద్ధాంతాన్ని నమ్మలేదు. ప్రతి నక్షత్రం చుట్టూ గ్రహాలు తిరుగుతాయని, ఈ భూమి లాంటి భూములు విశ్వంలో ఇంకెన్నో ఉంటాయని చెప్పాడు. విశ్వం అనంతం అన్నాడు.

1548లో ఇటలీలో జన్మించిన బ్రూనో కోపర్నికస్ సిద్ధాంతానికి ఆకర్షితుడైనాడు. 1572లో బ్రూనో మత గురువుగా వున్నప్పటికీ, సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ప్రచారం చేయడం మొదలు పెట్టాడు. దీనిపై మరింత పరిశీలనలను, పరిశోధనలను చేసి మరిన్ని అదనపు అంశాలను చేర్చి అనంత విశ్వ సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. బ్రూనో ప్రతిపాదనలు మత విశ్వాసాలకు విరుద్ధమైనవని మత బోధకులు భావించి, బ్రూనోపై 131 అభియోగాలను మోపి 1591లో కేసును నమోదు చేశారు. 1593లో బ్రూనోను గాలి, వెలుతురు చొరబడని ఒక కారాగృహంలో బంధించి ఎన్నో హింసలకు గురిచేశారు. ఈ కారాగారంలో బ్రూనో సుమారు ఏడు సంవత్సరాలకు పైగా వున్నాడు. ప్రతి రోజూ మత గురువుల నుంచి బ్రూనోకు వర్తమానం వచ్చేది. దాని సారాంశం బ్రూనో తన ప్రతిపాదనలు తప్పని ఒప్పుకోవడం, సూర్య కేంద్ర సిద్ధాంతాన్ని ఖండించడం, తాను ప్రచారం చేసిన అంశాలు తప్పని బహిరంగంగా ఒప్పుకోవడం. అయితే ప్రతి రోజూ బ్రూనో ఈ ప్రతిపాదనలు తిరస్కరించేవాడు. చివరకు బ్రూనోను మత ద్రోహిగా, సైతానుగా, రెచ్చగొట్టే ఉపన్యాసకుడుగా, మతానికి పరమ శత్రువుగా ప్రకటించి, ఒక్క రక్తం బొట్టు నష్టపోకుండా అగ్నికి ఆహుతి చెయ్యాలన్న మరణ శిక్షకు ఆదేశాలు జారీ చేశారు. 1600 ఫిబ్రవరి 17 మత పెద్దల ఆదేశాల మేరకు బ్రూనోను ఇనుప సంకెళ్ళతో బంధించి, పెడరెక్కలు విరిచికట్టి, నరకయాతన చూపించి, సజీవ దహనం చేశారు.

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన ఈ రోజులలో కూడా మతోన్మాదులు సైన్స్ వాదులపై దాడులు చేస్తున్నారు. ఎవరు ఏం తినాలి, ఏ దుస్తులు వేసుకోవాలి అనే విషయాలపై కూడా ఆంక్షలు పెడుతున్నారు. మరోవైపు మూఢ నమ్మకాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇటువంటి సంక్లిష్ట పరిస్థితుల్లో బ్రూనో వంటి త్యాగధనుల స్ఫూర్తితో నేటి సైన్స్‌వాదులు పని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- యం. రాంప్రదీప్,
జన విజ్ఞాన వేదిక ప్రతినిధి,
సెల్ : 9492712836.

మరుగున మెగా ఖ'నిజం'

- రాళ్ల సంగతి తేల్చని అధికారులు
- పట్టుకున్న లారీలను వదిలేసిన వైనం



పట్టుబడిన లారీ (ఫైల్)

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి/తొట్టంబేడు (తిరుపతి జిల్లా)

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం కాసరం చెరువులో 'మెగా' తవ్వకాల్లో బయటపడ్డ విలువైన రాళ్ల సంగతిని తేల్చడంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. మెగా తవ్వకాల్లో విలువైన ఖనిజపు రాయి బయటపడి నాలుగు రోజులు గడుస్తున్నా ఆ నిజాన్ని అధికారులు దాస్తుండడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాసరం చెరువులో బయటపడ్డ ఆ రాయి ఏ కోవకు చెందిందో తెలుసుకునేందుకు సంబంధిత అధికారులు కనీస ప్రయత్నం చేయకపోవడంపై తీవ్ర స్థాయిలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అది విలువైన రాయి కాబట్టే, దాన్ని మెగా యాజమాన్యం చౌర్యం చేసిందని, కొందరు అధికారి పార్టీ నేతల ఒత్తిళ్ల కారణంగా అధికారులు 'ఖనిజాన్ని' దాస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు.

నాయుడుపేట నుంచి మదనపల్లి వరకు ఆరు లైన్ల రోడ్డును ఏర్పాటు చేస్తున్న విషయం విదితమే. మొదటి దశలో భాగంగా ఈ పనులను ప్రముఖ సంస్థ మెగా కంపెనీ రూ.5 వేల కోట్ల వ్యయంతో చేపడుతోంది. ఇప్పటికే 50 శాతంపైగా పనులు పూర్తయ్యాయి. పనులను చేసే సమయంలో వీరికి అవసరమైన మట్టిని చెరువుల నుంచి ఇష్టారాజ్యంగా తరలించడంతో చెరువులు లోయలుగా మారిపోతున్నాయి. పరిమితికి మించి లోతుకు తవ్వుతుండడంతో మండలంలోని కాసరం చెరువులో గత రెండు నెలల నుంచి భారీ టిప్పర్లతో మట్టిని తరలించడంతో ఈ నెల 13న కొన్ని విలువైన రాళ్లు బయటపడ్డాయి. వాటిని గుట్టు చప్పుడు కాకుండా మెగా యాజమాన్యం ఊరు దాటించినట్లు సమాచారం. సుమారు మూడు టిప్పర్ల రాళ్లను అక్రమంగా తరలించినట్లు తెలుస్తోంది. వీటి విలువ అధికంగా ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై గ్రామస్తులు తొట్టంబేడు పోలీసులకు సమాచారం అందించారు. మట్టి తరలిస్తున్న ఒక టిప్పరును ఎస్ఐ రఘువేంద్ర స్వాధీనం చేసుకుని అందులో ఉన్న రాళ్లను పరిశీలించారు. అవి ఏ రకం రాళ్లో తెలియక పోలీసులు రెవెన్యూ అధికారులకు అప్పజెప్పారు. తవ్వకాల్లో బయటపడిన ఆ రాయి ఏ కోవకు చెందిందో అధికారులు ఇప్పటి వరకు తేల్చలేదు. ఆ రాయిని మైనింగ్ శాఖ అధికారులకు కూడా పంపనట్లు తెలుస్తోంది. విలువైన రాయిని మెగా యాజమాన్యం దొంగిలించిందని కాసరం గ్రామస్తుల నుంచి రాతపూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని, కేవలం ఫోన్ ద్వారా సమాచారం అందిస్తే విచారించి వదిలిపెట్టామని తొట్టంబేడు పోలీసులు తెలపడం గమనార్హం.

- గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, పేదలకు సంక్షేమ పథకాల అందించడంలో వైసిపి ముందు ఉందని పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. మండలంలోని నందిగాం-పూండి రోడ్డులో నరేంద్రపురం వంశధార ఎడమ ప్రధాన కాలువపై రూ.1.58 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించిన బ్రిడ్జిని ఆయన ప్రారంభించారు.

ఫోనిక్స్ ఆర్క్ ప్రైవేట్ లిమిటెడ్ (Phoenix ARC)

రిజిస్టర్డు ఆఫీసు: 3వ అంతస్తు, వల్లేస్ టవర్స్ (గతంలో శివ్ బిల్డింగ్‌గా పేరుగలది), 139/140/బి/1, సహర్ & వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ హైవే యొక్క క్రాసింగ్, విలె ప్యారెల్ (ఈస్ట్), ముంబయి-400 057.

సార్ఫసీ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు

దిగువ పేర్కొన్న రుణగ్రహీత, సహ-రుణగ్రహీత ఐన మీరు, మీ స్థిరాస్తులను (సెక్యూరిటీస్)ను తాకట్టుపెట్టుట ద్వారా ఇందు దిగువ మరింత స్పష్టంగా వివరించి బ్యాంకు/ఆర్థిక సంస్థల నుండి రుణ సదుపాయంలను పొందియున్నారు. స్థిరాస్తులకు సంబంధించి దిగువ చూపిన సెక్యూర్డ్ అసెట్‌నుతో సదరు రుణాలు పొందుటకు మీచే నిర్వహించిన పత్రాల ప్రకారం మీ నుండి అన్ని హక్కులు, టైటిల్, ఇంటెరెస్ట్, ప్రయోజనాలు, బకాయిలుతోపాటు ఫోనిక్స్ అర్క్ ప్రైవేట్ లిమిటెడ్ **(ఫోనిక్స్ ట్రస్ట్ ఎఫ్‌వై23-10 యొక్క ట్రస్టీగా వ్యవహరిస్తు)** పేరున వాటిని అసైన్‌చేయబడినవి. అదే విధంగా వాటిని తిరిగి చెల్లించుటలో, మీరు డిఫాల్టిచెందారు, దిగువ పేర్కొన్న అసైన్‌మెంట్స్ యొక్క విడివిడి డీడ్స్ ఆధారంగా తరువాత మీ రుణ ఖాతాలు నాన్-పెర్ఫామింగ్ అసెట్స్‌గా వర్గీకరించబడినవి, ఫోనిక్స్ బకాయి మొత్తాలను రికవరీచేయుట కొరకు సదరు అసైన్‌మెంట్ అనుసరించి, ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ యాక్ట్, 2002 (ది యాక్ట్) యొక్క సెక్షన్ 13(12) క్రింద డిమాండ్ నోటీసు జారీచేసి, ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3(1)తో చదువబడే, చట్టం యొక్క సెక్షన్ 13(2) ప్రకారం, అందులోని ఏవైతే విషయాలును ప్రచురిస్తూ, మీకు బట్వాడా రూపేనా ప్రచురిస్తున్నాము.

అసైన్‌మెంట్ తేదీ, ట్రస్ట్‌లు, రుణగ్రహీత, సహ-రుణగ్రహీతలు, తాకట్టు ఆస్తులు, బకాయి మొత్తాలు, సెక్షన్ 13(2) క్రింద పంపిన డిమాండ్ నోటీసు మరియు క్లెయించేయాల్సిన మొత్తాలు వివరాలు ఇచ్చట దిగువ ఇవ్వబడినవి:

క్ర.సం	రుణగ్రహీత, సహ-రుణగ్రహీత/హామీదారు పేరు & చిరునామా, రుణ ఖాతా నం., రుణ మొత్తాలు	సెక్యూరిటీస్ వివరాలు	1. లెండర్ పేరు, 2. అసైన్‌మెంట్ తేదీ, 3. డిమాండ్ నోటీసు తేదీ, 4. బకాయి మొత్తాలు
6.	**షేక్ సుభాని (రుణగ్రహీత పేరు)** తండ్రి/భర్త సత్తార్, డోర్ నం.17-12-18, ఇస్లాంపేట, తెనాలి, గుంటూరు-522201. **షేక్ ఇబ్రహీం సహ-వారసులు,** తండ్రి/భర్త సత్తార్, డోర్ నం.17-12-18, ఇస్లాంపేట, తెనాలి, గుంటూరు-522201. **షేక్ అమీనాబి సహ-వారసులు,** తండ్రి/భర్త సత్తార్, డోర్ నం.17-12-18, ఇస్లాంపేట, తెనాలి, గుంటూరు-522201. **రుణ ఖాతా నంబరు: హెచ్ఎం/0219/హెచ్/17/100259. మంజూరైన రుణ మొత్తాలు: రూ.10,13,219.37పై.లు** (రూపాయలు పది లక్షల పదమూడు వేల రెండు వందల పందొమ్మిది మరియు ముప్పై ఏడు పైసలు మాత్రమే)	గుంటూరు జిల్లా, తెనాలి సబ్-డిస్ట్రిక్ట్, తెనాలి మున్సిపల్ టౌన్, ఇస్లాంపేట్ పరిధిల్లో, 4వ వార్డు, 5వ బ్లాక్, టి.ఎస్.నం.328, డోర్ నం.17-12-18తో ఆర్‌సిసి బిల్డింగ్‌తో ఏదైతే 57.13చ.గ.ల విస్తీర్ణంనకుగాను ఎక.0.38సెంట్లు గల తాకట్టుపెట్టిన అస్తి యొక్క మొత్తం భాగం. **సరిహద్దులు: తూర్పు:** మున్సిపల్ రోడ్, **దక్షిణం:** శంకరుని సత్రం యొక్క అస్తి, **పడమర:** నిజాంపట్నం, తూర్పు కాలువ, **ఉత్తరం:** మెహబూబ్ సుభాని ఇంటి గోడ.	**1. పూనావాలా హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్, 2. 20.09.2022, 3. 01.02.2024, 4. 18.01.2024** నుండి పూర్తిగా చెల్లించు వరకు వర్తించు వడ్డీతో **17.01.2024** నాటికి చెల్లించాల్సిన మరియు బకాయిగా **17,11,966.07 పై.లు** (రూపాయలు పదిహేడు లక్షల పదకొండు వేల తొమ్మిది వందల అరవై ఆరు మరియు ఏడు పైసలు మాత్రమే).

ఈ నోటీసు తేది నుండి 60 (అరవై) రోజుల్లోగా ఇందు పై పేర్కొన్నట్లుగా తదుపరి వడ్డీతో పై పేర్కొన్న, డిమాండ్‌చేసిన మొత్తాలను చెల్లించవలసిందిగా మీరైన రుణగ్రహీత& సహ-రుణగ్రహీత/హామీదారులను కోరబడుచున్నది, విఫలంచెందిన ఏదైతే, పై పేర్కొన్న సెక్యూరిటీస్‌ను స్వాధీనంకు చట్టం క్రింద క్రింది సంతకందారు చర్యలు తీసుకొందురు. పై సదరు నియమాలలో నిర్ణీత కాలవ్యవధిలో సెక్యూర్డ్ అసెట్‌ను విడిపించుటకు మీరు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై మీరు శ్రద్ధవహించవలసిందిగా కోరబడుచున్నది. దయచేసి సదరు చట్టం యొక్క సెక్షన్ 13(13) ప్రకారం గమనించవలసింది ఏమనగా, మా అనుమతి లేకుండా మీరు అమ్మకం, లీజు లేదా ఇతర విధానాల రూపేనా పై పేర్కొన్న సెక్యూరిటీస్‌ను బదిలీచేయుట నుండి నిషేధింపబడినారు.

ప్రదేశం: గుంటూరు
తేది: 17.02.2024

అధీకృత అధికారి,
ఫోనిక్స్ అర్క్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున, ఫోనిక్స్ ట్రస్ట్ ఎఫ్‌వై23-10 యొక్క ట్రస్టీ.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.461 నుండి 463/టిఒ/2023-24, తేది : 16.02.2024

కృష్ణాజిల్లాలో పిఎమ్ఎజివై ఫేజ్-1 మరియు 2 గ్రాంట్ క్రింద రూ.60.00 లక్షల అంచనా విలువతో సిసి రోడ్ల 3 పనుల కొరకు ఇ ప్రొక్యూర్మెంట్ ప్లాట్‌ఫారం క్రింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. బిడ్ డౌన్లోడ్ ప్రారంభ తేది : 20.02.2024 నుండి. తదుపరి వివరాలకు www.tender.apeprocurement.gov.in సందర్శించగలరు.

ఫోన్ : 9866062101.

సం/- కార్యనిర్వాహక ఇంజనీరు,
పిఆర్ఐ డివిజన్, మచిలీపట్నం

DIPRNo.13036/CL/ADVT/1/1/2021-22

యురేనియం పరిశ్రమ పైప్‌లైన్ లీకేజీ

ప్రజాశక్తి- పులివెందుల టౌన్ (వైఎస్ఆర్ జిల్లా)

పులివెందుల నియోజకవర్గంలోని వేముల మండలం తుమ్మలపల్లి ఉన్న యురేనియం కర్మాగారం వ్యర్థ పదార్థాల పైపులైన్ లీకేజీ కావడంతో వ్యర్థ పదార్థాలు పొలాలు, బహిరంగ ప్రదేశాలలోకి రావడంతో రైతులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యర్థపదార్థాల విషయంలో యుసిఐఎల్ నిర్లక్ష్యం వహిస్తూనే ఉందని మరోసారి నిరూపితమైంది. వ్యర్థపదార్థాలు బహిరంగ ప్రదేశాలలోకి రావడంతో నీరు భూమిలోకి ఇంకి నీరు కలుషితం కావడం వల్ల అనారోగ్యాలు కలుగుతున్నాయని, పంటలకు వైరస్ సోకే ప్రమాదముందని రైతులు యురేనియం అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అయినా, వ్యర్థ పదార్థాల విషయంలో పరిష్కారం చూపలేకపోతున్నారు. పదేపదే పైప్‌లైన్ లీకేజీలు కావడం పరిపాటిగా మారుతోంది. శుక్రవారం యుసిఐఎల్ నుంచి టైలింగ్ ఫాండ్‌కు వ్యర్థాలను తరలించే పైప్ లైన్ లీకేజీ అవడంతో వ్యర్థాలు పొలాల్లోకి ప్రవహించాయి. గమనించిన కొందరు రైతులు యుసిఐఎల్ అధికారులుకు తెలిపారు. అధికారులు పైప్‌లను మరమ్మతులు చేసి లీకేజీ అయిన యురేనియం వ్యర్థాలు బయటకు కనిపించకుండా కన్జర్వేటర్ సాయంతో ఆ ప్రదేశాన్ని క్లీన్ చేయించారు. టైలింగ్ పాండ్ పరిహారాన్ని యుసిఐఎల్ గాలికి వదిలేసిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పంటలు, పశుసంపద పూర్తిగా నాశనం అవుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వ్యర్థ పదార్థాలు లీకేజీ కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

ఉర్దూ ఉపాధ్యాయుల ఖాళీలన్నీ భర్తీ చేయాలి

ప్రజాశక్తి- కడప అర్బన్

రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ ఖాళీగా ఉన్న ఉర్దూ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూట) వ్యవస్థాపకులు సయ్యద్ హిదాయతుల్లా, రాష్ట్ర సమన్వయకర్త మహమ్మద్ అయ్యూబ్ కోరారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి ఎస్బి అంజాద్ బాషకు, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్ర రెడ్డికి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కడపలోని క్యాంప్ కార్యాలయాలలో వారిని కలిసి మాట్లాడుతూ ఉర్దూ ఉపాధ్యాయులు లేక రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు మూతపడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఉప ముఖ్యమంత్రి కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ సురేష్ కుమార్‌కు ఫోన్ ద్వారా సమస్య వివరించగా, ఆయన మాట్లాడుతూ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవి రామచంద్రారెడ్డి ఉర్దూ ఉపాధ్యాయుల, పాఠశాలల, కళాశాలల, విశ్వవిద్యాలయాల సమస్యలన్నింటినీ విని, ఎప్పటికప్పుడు సమస్యలు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

కడప కీర్తిని చాటిన 'లిల్లీ'

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప నగరానికి చెందిన బాబు రెడ్డి, సతీష్ కుమార్ నిర్మాతలుగా శివం దర్శకత్వంలో లిల్లీ చిత్రం నిర్మించారు. నిర్మాత బాబు రెడ్డి కుమార్తె బేబీ నేహా, సుబ్బారెడ్డి ప్రధాన పాత్రలో నటించారు. 2023 సంవత్సరానికిగానూ ఉత్తమ బాలల చలన చిత్రంగా లిల్లీ ఎంపికైంది. చిత్ర బృందాన్ని వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం బృందం కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జున్ రెడ్డి మాట్లాడుతూ తెలుగు చలనచిత్ర పరిశ్రమలో జిల్లాది విడదీయరాని అనుబంధమని, లిల్లీ సినిమా మరో ఆణిముత్యంగా నిలిచిందని తెలిపారు. బేబీ నేహా, బేబీ ప్రణీతరెడ్డి ప్రధాన పాత్రదారులుగా విడుదలైన ఈ చిత్రం వర్తమాన తెలుగు చలనచిత్ర రంగంలో కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టిందని అధికార భాష సంఘం సభ్యులు డాక్టర్ తవ్వా వెంకటయ్య కొనియాడారు. అతిచిన్న వయసులోనే సినీ రంగప్రవేశం చేసిన నేహా భవిష్యత్తులో కడప కీర్తిని ఇనుమడింపజేయగలదని కవి వెల్లాల వెంకటేశ్వరాచారి ఆకాంక్షించారు. అతిచిన్న వయసులోనే విశేషమైన నటనను కనబరిచిన నేహా ఎంతోమంది విద్యార్థులకు ఆదర్శప్రాయంగా నిలిచిందని యోగి వేమన విశ్వవిద్యాలయం అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ రెడ్డి శేఖర్ రెడ్డి, డాక్టర్ వెంకటరమణ కొనియాడారు.

Expression of Interest for Supply of ABS Raw Material

Central Institute of Petrochemicals Engineering & Technology (CIPET), Center for Skilling and Technical Support (CSTS), Vijayawada - a premier National Institution invites expression of interest for Supply of Plastics Raw Material as details below.

SL NO	Description of Item	Qty
1	ABS(Grade H1121H)	1 to 1.5 Ton

Interested parties/persons may submit their application and submit competitive quote with all the details along with time of delivery in the sealed cover on or before 23.02.2024 by 04:00 PM.
Joint Director & Head reserves right to accept or reject any/ all EOI without assigning any reasons thereof.

Sd/- Joint Director & Head

అనుబంధం IV-A
స్థిరాస్తి విక్రయం కొరకు అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 8(6)కి ప్రతిబంధంతో కలిపి చదవవలసిన ఆర్థిక ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 అమలు కింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఈ-వేలం అమ్మకపు ప్రకటన.

ఇందుమూలంగా ప్రజానీకానికి సాధారణంగామరియు రుణగ్రహీత(ల)కు మరియు గ్యారంటార్(ల)కు ప్రత్యేకంగా తెలియజేయునది ఏమనగా సెక్యూర్డ్ క్రెడిటార్‌కి తనఖాపెట్టిన/చార్జ్‌చేసిన, **ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ (CIN: L65922DL2005PLC136029)** (''సెక్యూర్డ్ క్రెడిటార్''), సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క అధీకృత అధికారి **భౌతిక స్వాధీనం** చేసుకున్న ఈ కింద వివరించిన స్థిరాస్తిని, **మిత్ర మోటార్స్ ప్రైవేట్ లిమిటెడ్, మాగంటి చంద్రమౌళి, మాగంటి సుబ్రహ్మణ్యం, మాగంటి మధుసూదన శర్మ మరియు మిత్ర గ్యారేజ్ ప్రైవేట్ లిమిటెడ్ (కార్పొరేట్ గ్యారంటార్)** నుంచి సెక్యూర్డ్ క్రెడిటార్‌కి బకాయివున్న ఉన్న లీగల్ ఖర్చులు మరియు ఇతర చార్జీలతో పాటు **08.02.2024** నుంచి రుణ ఒప్పంద నిబంధనలతో ప్రకారం వర్తించే భవిష్యత్తు వడ్డీతో కలిపి అసలు, బకాయిలను (ప్రాప్తించిన ఆలస్య చార్జీలతో సహా) మరియు **07.02.2024** వరకు అయిన వడ్డీని రుణ ఖాతా నం. **HLAPVJW00289129** కింద బాకీవున్న రూ. **4,42,02,127/-** (నాలుగు కోట్ల నలభై రెండు లక్షల రెండు వేల నూట ఇరవై ఏడు రూపాయలు మాత్రమే) మొత్తాన్ని రికవరి చేసేందుకు **''ఎక్కడ ఉన్నది అక్కడ'', ''ఏది ఉంటే అది''** మరియు **''అక్కడ ఉన్నదేదైనా''** ప్రాతిపదికన **22.03.2024**న మధ్యాహ్నం **02** నుంచి సాయంత్రం **04** గంటల మధ్య విక్రయించబడును.

సదరు స్థిరాస్తి వేలానికిరిజర్వు ధర రూ. **4,61,00,000/-** (నాలుగు కోట్ల అరవై ఒక్క లక్షల రూపాయలు మాత్రమే) మరియు ధరావతు సొమ్ము (ఇఎండి) రూ. **46,10,000/-** (నలభై ఆరు లక్షల పది వేల రూపాయలు మాత్రమే) అంటే రిజర్వు ధరలో 10%కి సమానం.

స్థిరాస్తి/స్థిరాస్తుల వివరాలు

డెయిరీ కాలనీ, కనకదుర్గా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ, గుణదల మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ, గుణదల సబ్-రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా, విజయవాడ-520004, ఆంధ్రప్రదేశ్ చిరునామాలో ఉన్న డోర్ నం. 54-20/7-2, ఆర్.ఎస్. నం. 450, ప్లాట్ నం. 6, మున్సిపల్ వార్డు నం. 31, పాత ఎసెస్‌మెంట్ నం. 40808/1, కొత్త ఎసెస్‌మెంట్ నం. 276931లో ఉన్న 1824 చదరపు అడుగుల బిల్ట్-అప్ ఏరియా ఉన్న ఆర్‌సిసి భవనంతో కలుపుకొని 437.60 చదరపు గజాలు లేదా 376.256 చదరపు మీటర్ల విస్తీర్ణం గల సైట్ మరియు దీనికి హద్దులు ఇలా ఉన్నాయి:

తూర్పు :	మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు	ఉత్తరం :	రోడ్డు
పశ్చిమం :	ప్లాట్ నం. 28	దక్షిణం :	గంగాధర శాస్త్రి యొక్క ప్లాట్ నం. 7

విక్రయం యొక్క సవివరమైన నియమ నిబంధనల కొరకు, దయచేసి సెక్యూర్డ్ క్రెడిటార్ యొక్క వెబ్‌సైట్ www.indiabullshomeloans.comలో ఇవ్వబడిన లింకును చూడండి. బిడ్డింగ్ కొరకు www.auctionfocus.inకి లాగ్ ఆన్ అవ్వండి.

తేదీ : 12.02.2024
స్థలం : విజయవాడ

ఇండియాబుల్స్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ తరపున,
అధీకృత అధికారి

ఐఎస్‌టిఎస్‌లో 'సిద్ధార్థ్‌రాయ్' చిత్ర బృందం సందడి



ప్రజాశక్తి - రాజానగరం (తూర్పుగోదావరి జిల్లా)

తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలంలోని తూర్పు గోనగుడెం సమీపంలో ఐఎస్‌టిఎస్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సిద్ధార్థ్ రాయ్ చిత్రం యూనిట్ సభ్యులు సందడి చేశారు. శ్రీ రాధా దామోదర్ స్టూడియోస్ ఆధ్వర్యంలో ఈ చిత్రాన్ని నిర్మించారు. చిత్రం ప్రమోషన్ కోసం యూనిట్ సభ్యులు శుక్రవారం కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా హీరో దీపక్ సరోజ్, హీరోయిన్‌లు తన్వి, కీర్తనలు డ్యాన్స్ వేసి సందడి చేశారు. విద్యార్థులతో సెల్ఫీలు దిగారు. హీరో దీపక్ మాట్లాడుతూ చిత్రం మెత్తం వినోదాత్మకంగా ఉంటుందన్నారు. హాస్యంతో నిండిన ప్రేమ కథా చిత్రం అన్నారు. హీరోయిన్ తన్వి మాట్లాడుతూ ఈ ప్రాంతంలోనే చిత్రం షూటింగ్ ఎక్కువగా జరిగిందన్నారు. మరో హీరోయిన్ కీర్తన మాట్లాడుతూ చిత్రం ఈనెల 23న విడుదల అవుతుందని విద్యార్థులందరూ చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కె.ఉపేందర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశ్రీరావు, ఎఒ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.



వెయిట్ లిఫ్టింగ్‌లో చందనకు కాంస్య పతకం

ప్రజాశక్తి- చింతూరు (అల్లూరి జిల్లా)

బీహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 13 నుంచి 16వ తేదీ వరకు జరిగిన అండర్-17 జాతీయ స్కూల్ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో చింతూరు కెజివిబి కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న గుత్తుల మధు చందన ప్రతిభ కనబర్చింది. 81 కేటగిరిలో కాంస్య పతకం సాధించింది.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India, A Government of India Undertaking)

అసెట్ రికవరీ శాఖ
249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్ రోడ్డు, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038

అమ్మకం గురించి తెలియజేస్తూ రుణగ్రహీతకు నోటీసు (30 రోజుల నోటీసు)
(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 6(2)/రూల్ 8(6)

రుణగ్రహీత: 1. మెసెర్స్.వి ఆర్ కన్‌స్ట్రక్షన్స్, ప్రొప్రైటర్ : శ్రీ.కె.వెంకట రమణ, తండ్రి. పూర్ణ చంద్రరావు, ఫ్లాట్ నం.102, ప్లాట్ నం.249 మరియు 250, సర్దార్ పటేల్ నగర్, చైతన్య టెక్నో స్కూల్ వద్ద, కూకట్‌పల్లి, హైదరాబాద్-500072.
హామీదారు/తనఖాదారు : శ్రీ.పడమట రంగారావు యొక్క చట్టపరమైన వారసులు : 2. శ్రీమతి. పి.వీర రాఘవమ్మ, భర్త. లేట్ శ్రీ.పి.రంగారావు, హౌ.నం.8-262, ఆర్.ఎస్.నం.586/3 మరియు 4, బ్లాక్ నం.8, కాటూరు రోడ్డు, ఉయ్యూరు గ్రామం మరియు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521165. **3. శ్రీ.శివ శంకరరావు,** తండ్రి. లేట్ శ్రీ.పి.రంగారావు, హౌ.నం.8-262, ఆర్.ఎస్.నం.586/3 మరియు 4, బ్లాక్ నం.8, కాటూరు రోడ్డు, ఉయ్యూరు గ్రామం మరియు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521165. **4. శ్రీమతి. కె.రంగమ్మ,** తండ్రి. లేట్ శ్రీ.పి.రంగారావు, భర్త. శ్రీ.కె.వెంకట రమణ, హౌ.నం.8-262, ఆర్.ఎస్.నం.586/3 మరియు 4, బ్లాక్ నం.8, కాటూరు రోడ్డు, ఉయ్యూరు గ్రామం మరియు మండలం, కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్-521165.
హామీదారులు : 5. శ్రీ.ఎమ్.రామదుర్గా ప్రసాద్, తండ్రి. ఎమ్.జగన్నాథరావు, ప్లాట్ నం.180/ఎ, సుభాష్ నగర్, గణేష్ గ్రౌండ్ వద్ద, ఐడిఎ, జీడిమెట్ల, హైదరాబాద్, తెలంగాణ-500555.

సర్/మేడం,

విషయం : సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) క్రింద, బ్యాంక్ కు ఉన్న మొత్తం బకాయి రియలైజేషన్ కొరకు **లేట్. శ్రీ.పడమట రంగారావు, తండ్రి. లేట్.శ్రీ.పి.నాగేశ్వరరావు** (ఆస్తి యజమాని)కి చెందిన ఆస్తి అమ్మకం.

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, 249/3ఆర్‌టి, 1వ అంతస్తు, మెయిన్ రోడ్డు, ఎస్.ఆర్.నగర్, హైదరాబాద్-500038, తెలంగాణ సెక్యూర్డ్ క్రెడిటార్, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ (యాక్ట్ 54 ఆఫ్ 2002) సెక్షన్ 13(2) క్రింద 12.10.2021న డిమాండ్ నోటీసు జారీ చేసి అందులో నిర్దేశించిన గడువులోగా బకాయిలు చెల్లించాలని మిమ్మల్ని కోరడమైనది.

నిర్ణీత వ్యవధిలోగా మీరు చెప్పిన నోటీసును పాటించడంలో విఫలమైనందున, సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 యొక్క రూల్ 8తో చదువుతూ చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద స్థిర సెక్యూర్డ్ అసెట్స్‌ను అధీకృత అధికారి 24.02.2022న స్వాధీనం చేసుకోవడం జరిగింది.

సెక్యూర్డ్ అసెట్‌ని స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా, మీరు బ్యాంకుకు చెల్లించాల్సిన మొత్తాన్ని చెల్లించలేదు. అందుకని, ఈ నోటీసు అందిన తేదీ నుండి 30 రోజుల తర్వాత ఆన్‌లైన్ మోడ్ ద్వారా పబ్లిక్ ఇ-వేలం నిర్వహించడం ద్వారా దిగువ పేర్కొన్న ఆస్తిని విక్రయించడం జరుగుతుంది. ఇ- వేలం జరిగిన తేదీ మరియు సమయంతో పాటు సర్వీస్ ప్రొవైడర్ యొక్క వివరాలు మరియు ఆస్తి రిజర్వు ధర దీనిలో నిర్వహించబడే ఇ-వేలం మీకు విడిగా తెలియజేయబడతాయి. అందువలన, మీరు బ్యాంక్‌కి చెల్లించాల్సిన మొత్తాన్ని తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు సేల్ నోటీసును ప్రచురించే తేదీకి ముందు బ్యాంక్ చేసిన ఖర్చులతో కలిపి చెల్లిస్తే, ఆస్తి అమ్మకం కొరకు తదుపరి చర్య తీసుకోబడదు మరియు నిర్దేశించిన మీ ఆస్తులను చట్టం యొక్క సెక్షన్ 13 (8) ప్రకారం మీరు రీడీమ్ చేసుకోవచ్చు.

ఆస్తి షెడ్యూల్: ఆస్తి నం.1 : ఆంధ్రప్రదేశ్, కృష్ణాజిల్లా, ఉయ్యూరు, కాటూరు రోడ్డు, 8వ బ్లాక్ వద్ద **శ్రీ.పడమటి రంగారావు,** తండ్రి. పి.నాగేశ్వరరావు పేరు మీద ఉన్న మొత్తం ఆ స్థలం మరియు **రెసిడెన్షియల్ ఇంటి వద్ద డో.నం.8-262,** ఆర్.ఎస్.నం.586/3/4 తో 441 చ.గ.లు. ప్లింత్ ఏరియా మరియు ప్లాట్ మొత్తం ఏరియా కొలిచే 241.80 చ.గ.లు. క్రింది విధమైన హద్దులు : విస్తీర్ణం 96.80 చ.గ.లు. కు డాక్.నం.984/1997 సరిహద్దులు : ఉత్తరం : చోడవరపు జగన్మోహన్‌రావుకు చెందిన ఆస్తి, దక్షిణం : పంచాయతీ బజార్, తూర్పు : రెసిడెన్షియల్ ఖాళీ సైట్, పడమర : మలవతు మంగయ్యకు చెందిన ఆస్తి. విస్తీర్ణం 145.00 చ.గ.లు.కు డాక్.నం.260/1999గా సరిహద్దులు : ఉత్తరం : చోడవరపు జగన్మోహన్‌రావుకు చెందిన ఆస్తి, దక్షిణం : 18' అ.లు. ఫ్రీ ఉమ్మడి మార్గం, తూర్పు : పి.రంగారావు ఆస్తి, పడమర : పి.రంగారావుకు చెందిన ఆస్తి.

తేది : 16.01.2024
ప్రదేశం : హైదరాబాద్

సం/- అధీకృత అధికారి
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అసెట్ రికవరీ శాఖ

బ్యాంక్ ఆఫ్ బరోడా (बैंक ऑफ़ बड़ौदा / Bank of Baroda)

గవర్నర్ పేట బ్రాంచి, డి.నెం.29-37-158, శ్రీ కృష్ణ నిలయం, ఏలూరు రోడ్డు, గవర్నర్ పేట, విజయవాడ, ఆంధ్రప్రదేశ్-520002.

స్వాధీనతా ప్రకటన (స్థిరాస్తి కొరకు)

(APPENDIX IV సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 యొక్క రూల్ 8(1) ప్రకారం)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారము **బ్యాంక్ ఆఫ్ బరోడా, గవర్నర్‌పేట బ్రాంచ్** యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు, 2002 నందలి సెక్షన్ 13(12)కు అనుబంధమైన రూలు 3 ప్రకారము సంక్రమించిన అధికారములతో **ఋణగ్రహీతలు: శ్రీమతి మారీదు సత్యవతి,** భర్త : లేటు సుందరరావు మరియు **శ్రీ మారీదు సాయిబాబు,** తండ్రి : లేటు సుందరరావు, **ఇరువురి నివాసం :** డి.నెం.59ఎ-15-31/1, భద్రయ్య నగర్, పటమట, విజయవాడ - 520010 మరియు **హామీదారు : శ్రీమతి జంపన వీరజ,** భర్త : డా॥ జయ ప్రసాద్, రాఘవ చిల్డ్రన్స్ హాస్పిటల్, రిజిస్ట్రార్స్ ఆఫీస్ ఎదురుగా, చల్లపల్లి, కృష్ణాజిల్లా వారు చెల్లించవలసిన బకాయి మొత్తం **రూ.7,71,842.69 పై.** (అక్షరాల ఏడు లక్షల డెబ్బై ఒక్క వేల ఎనిమిది వందల నలభై రెండు రూపాయల అరవై తొమ్మిది పైసలు మాత్రమే) + **తేది.08.08.2023** నుండి ఇంకా విధించని వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి నోటీసు తేది నుండి 60 రోజులలోగా చెల్లించవలసినదిగా **తేది.07-08-2023**న డిమాండ్ నోటీసు జారీ చేయబడినది. డిమాండ్ నోటీసు జారీ చేసిన తరువాత ఋణగ్రహీత **తేది.06.10.2023న రూ.30,000/-**లు చెల్లించినారు. సదరు మొత్తము సరి చేసిన తరువాత బ్యాంకునకు చెల్లించవలసిన బకాయి **తేది.12.02.2024** నాటికి **రూ.7,75,438.69 పై** (అక్షరాల ఏడు లక్షల డెబ్బై ఐదు వేల నాలుగు వందల ముప్పై ఎనిమిది రూపాయల అరవై తొమ్మిది పైసలు మాత్రమే) + ఇంకా విధించని వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి.

ఋణగ్రహీత/హామీదారు బకాయి సొమ్మును తిరిగి చెల్లించుటలో విఫలమైనందున ఈ దిగువ సంతకందారు సదరు చట్టములోని సెక్షన్ 13(4)కు అనుబంధమైన సదరు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్సు 2002 నందలి రూలు 8 ప్రకారము **తేది.12-02-2024**న దిగువ పేర్కొన్న ఆస్తి **స్వాధీనత** తీసుకోవడమైనదని ప్రత్యేకంగా ఋణగ్రహీత మరియు సాధారణ ప్రజానీకమునకు తెలియజేయడమైనది.

ఈ ఆస్తి విషయమై ఎవరు ఎటువంటి లావాదేవిలు జరుపరాదని, ఎటువంటి లావాదేవీలైనా బకాయి మొత్తం **రూ.7,75,438.69 పై** (అక్షరాల ఏడు లక్షల డెబ్బై ఐదు వేల నాలుగు వందల ముప్పై ఎనిమిది రూపాయల అరవై తొమ్మిది పైసలు మాత్రమే) + ఇంకా విధించని వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి. **బ్యాంక్ ఆఫ్ బరోడా, గవర్నర్‌పేట బ్రాంచ్** వారి యొక్క ఛార్జీకి లోబడి వుండునని ప్రత్యేకించి ఋణగ్రహీత/ హామీదారు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (8) నిబంధనల ప్రకారం ఋణగ్రహీతలు/ హామీదారులు తమ తనఖా ఆస్తులను విడిపించుకోవడానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించడమునకై శ్రద్ధ వహించవలెను.

స్థిరాస్తి వివరములు:

విజయవాడ, పటమట, పటమట ఎస్ఆర్ఓ, భద్రయ్య నగర్, కొత్త అసెస్మెంట్ నెం.264910, పాత అసెస్మెంట్ నెం.1972 & 35163ఎ, డి.నెం.59ఎ-15-31/1, ఆర్.ఎస్.నెం.117/2ఎ లోని 301.429 చ॥మీ॥లకు సమానమైన 360 చ॥గ॥ల విస్తీర్ణంలో ఆర్‌సిసి రూఫ్డ్ క్రింది మరియు మొదటి అంతస్తులు కలిగిన భవనంతో గల నివాస స్థలం యావత్తు ఆస్తి. **హద్దులు : తూర్పు :** పటమట పంపింగ్ స్కీమ్ మెయిన్ కెనాల్, **దక్షిణం:** వి. జయలక్ష్మి గారికి చెందిన ఆస్తి, **పడమర :** 30 అ॥ల వెడల్పు మున్సిపల్ రోడ్డు, **ఉత్తరం :** జివివి లక్ష్మీ నారాయణ గారి ఇల్లు.

తేది : 12-02-2024
ప్రదేశం : విజయవాడ

సం/- అధీకృత అధికారి
బ్యాంక్ ఆఫ్ బరోడా

తగ్గుతున్న వ్యవసాయ ఎగుమతులు

వరుసగా మూడో ఏడూ అదే పరిస్థితి



న్యూఢిల్లీ : దేశం నుంచి వ్యవసాయ ఎగుమతులు తగ్గిపోతున్నాయి. వరుసగా మూడు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కన్పిస్తోంది. ఈ పరిణామం రైతుల ఆదాయంపై ప్రభావం చూపుతుందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో దేశం నుంచి తాజా పండ్ల ఎగుమతి పలు దేశాలకు విస్తరించింది. గతంలో 102 దేశాలకు పండ్లు ఎగుమతి అయ్యేవి. ఇప్పుడు 111 దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

తాజా గణాంకాల ప్రకారం 2020-21లో భారత వ్యవసాయ ఎగుమతుల వృద్ధి రేటు 17% ఉండగా 2022-23లో 6%కి పడిపోయింది. వ్యవసాయోత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (అపెడా) ఎగుమతులు సైతం 24% నుండి 11%కి తగ్గిపోయాయి. అయితే 2022-23లో అపెడా ఉత్పత్తుల ఎగుమతులు 26.7 బిలియన్ డాలర్లకు చేరాయని, అవి 200 దేశాలకు వెళుతున్నాయని డైరెక్టర్ జనరల్ ఆఫ్ కమర్షియల్ ఇంటెలిజెన్స్ అండ్ స్టాటిస్టిక్స్ తెలిపింది. అపెడా ఉత్పత్తుల్లో ఆహార ధాన్యాలు (50%), జంతు ఉత్పత్తులు (15%), ప్రాసెస్ చేసిన పండ్లు, కూరగాయలు (8%), తాజా పండ్లు, కూరగాయలు (6%) ఉన్నాయి. అయితే అపెడా ఎగమతుల విలువ 2022 ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో 19.68 బిలియన్ డాలర్లు ఉండగా 2023 ఏప్రిల్-డిసెంబర్ మధ్యకాలంలో 17.88 బిలియన్ డాలర్లకు తగ్గింది. అదే సమయంలో మొత్తం వ్యవసాయ ఎగుమతుల విలువ కూడా 38.63 బిలియన్ డాలర్ల నుండి 34.99 బిలియన్ డాలర్లకు తగ్గింది.

HDFC BANK (We understand your world)

డిపార్ట్‌మెంట్ ఫర్ స్పెషల్ ఆపరేషన్స్
నెం.50-96-5, ప్లాటు నెం.175, సీతమ్మధార,
పాత ఎస్‌బిహెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

డిమాండ్ నోటీసు

Letter No.HDFC/DFSO/13(2)/13-02/2 తేది.13.02.2024

టు,

1) **మెస్సర్స్ తన్మయి అగ్రో ట్రేడర్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీ ప్రకాష్ స్వయం పురి,** డోర్ నెం.1-646, 3వ అంతస్తు, తరుణ్ గౌతమ్ బుద్ధ రోడ్డు, కెఎస్ఆర్ కార్ వాష్, మంగళగిరి, గుంటూరు-522503.
2) **శ్రీమతి సాయి దీపిక బావినేని, తండ్రి. శ్రీ రామ మోహన రావు బావినేని,** డోర్ నెం.2-187, వంతెన డౌన్, పెనమలూరు, విజయవాడ, కృష్ణా జిల్లా-521139.
3) **శ్రీమతి జయశ్రీ కొంగర, భర్త. ప్రభాకరరావు,** డోర్ నెం.10-43, రామాలయం వీధి, ఎనికెపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా-521139.
4) **శ్రీ ప్రకాష్ స్వాయం పురి, తండ్రి. చిన్న బాలరాజ్ పురి,** డోర్ నెం.1-103, వెల్దండ గ్రామం, కల్వకుర్తి, మహబూబ్‌నగర్, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ-509360.
5) **శ్రీ ప్రవీణ్ కర్రి, తండ్రి. నీలాంబరం కర్రి,** డోర్ నెం.1-823ఎ, అజయ్ నగర్, టి బి సానిటోరియం, మంగళగిరి, గుంటూరు జిల్లా-522503.
6) **శ్రీ కొంగర రవి కుమార్, తండ్రి. ప్రభాకర రావు కొంగర,** డోర్ నెం.10-43, రామాలయం పంచాయితీ ఆఫీస్ ఏరియా, ఎనికెపాడు, విజయవాడ, కృష్ణా జిల్లా-521108.

శ్రీ/శ్రీమతి,

విషయం : సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ యొక్క సెక్షన్ 13(2) మరియు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ - 2002 (సర్ఫేసి యాక్ట్ - 2002) ప్రకారం జారీ చేయబడిన నోటీసు

మీ కోరిక ప్రకారం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్ వారు క్యాష్ క్రెడిట్ ఋణ సౌకర్యం కల్పించినారని మీకు తెలియును. దిగువ తెలిపిన సదరు ఋణం కొరకు వివిధ పత్రములను సెక్యూరిటీ క్రింద బకాయి చెల్లించుట కొరకు మీరు అమలు చేసినారు. నెం.1 గా ఉన్న మీ పేరున బ్యాంకు వారు మంజూరు చేసిన సదరు ఋణ వివరములు దిగువ తెలుపబడినవి.

వ.నెం.	సౌకర్యం యొక్క స్వభావం	పరిధి	తేది.01.02.2024 నాటికి బకాయి మొత్తం
1)	Cash Credit A/c. No. 50200067224902	300.00 లక్షలు	రూ.3,06,71,088.12 పై
	మొత్తం	300.00 లక్షలు	రూ.3,06,71,088.12 పై

ఈ పై ఋణసౌకర్యము పొందుటకు, మీరు అనేక భద్రత పత్రములను, హామీతో కూడిన దస్తావేజులను, ఇతర భద్రతా పత్రములను మరియు నిల్వల తాకట్టు, పుస్తక జమలు మరియు భద్రతా ఆసక్తితో కూడిన ఈ క్రింది షెడ్యూలులో వివరముగా చెప్పిన సమాన నిష్పత్తితో ఆస్తులను తనఖా ఉంచినారు.

మీచే పొందబడిన ఋణసౌకర్యము ఖాతా సక్రమముగా నిర్వహించబడక మీలో నెం.1 వారు ఋణమొత్తము మరియు వడ్డీ సకాలములో చెల్లింపక, విఫలమైనారు. కనుక మీ ఋణఖాతా **తేది.23.01.2024 న** ఆర్‌బిఐ వారి నిబంధనల ప్రకారం నిరర్థక ఆస్తిగా వర్గీకరించటమైనది.

కనుక బ్యాంక్ వారు బకాయి మొత్తములను తిరిగి పొందుటకై మీలో నెం.1 ప్రధాన ఋణగ్రహీత, నెం.2 నుండి 6 హామీదారులు మరియు 4 నుండి 6 పార్ట్‌నర్స్ అందరూ కలిసిగాని, లేక విడివిడిగా కాని **తేది.01.02.2024** నాటికి (చెల్లించవలసిన) బకాయి మొత్తములను పూర్తిగా **రూ.3,06,71,088.12 పై (అక్షరాల మూడు కోట్ల ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల ఎనభై ఎనిమిది రూపాయల పన్నెండు పైసలు మాత్రమే)** చెల్లించవలసిందిగా కోరటమైనది.

సర్ఫేసి చట్టం 2002 నందలి నిబంధనల ద్వారా ది సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంటు) రూల్స్ 2002 ద్వారా ఈ దిగువ సంతకందారుడు బ్యాంకు వారిచే అధీకృత అధికారిగా నియమించబడినారు.

సదరు చట్టం సెక్షన్ 13(2) ద్వారా సంక్రమించిన అధికారములతో మీరు అందరు కలిసిగాని లేక విడివిడిగా కాని బ్యాంక్ వారికి చెల్లించవలసిన ఋణ మొత్తములను **తేది.23.01.2024 నాటికి రూ.3,06,71,088.12 పై (అక్షరాల మూడు కోట్ల ఆరు లక్షల డెబ్బై ఒక్క వేల ఎనభై ఎనిమిది రూపాయల పన్నెండు పైసలు మాత్రమే)** చెల్లించవలసిన మరియు భవిష్యవడ్డీ, కాస్ట్స్ మరియు అన్ని ఇతర ఖర్చులు, ఈ ప్రకటన అందిన 60 రోజులలోగా చెల్లించవలెను. అట్లు చెల్లించని ఎడల, సదరు చట్టం సెక్షన్ 13(4) ప్రకారం ఈ దిగువ తెల్పిన ఆస్తుల పై తదుపరి చర్యలు తీసికొనగలరు.

సదరు చట్టంలో గల సెక్షన్ 13(13) ప్రకారం మీరు అమ్మకం / లీజు లేదా ఇతర విధములుగానూ నోటీసులోని తనఖాలో ఉన్న సెక్యూర్డు ఆస్తులను గాని అందలి భాగములు గాని ఏవిధముగానూ బ్యాంకు వారి వ్రాత పూర్వక అనుమతి లేనిదే బదిలీ చేయరాదు.

సదరు చట్టంలో గల సెక్షన్ 13(6) ప్రకారం బ్యాంకు వారికి సంక్రమించిన అధికారములతో ఈ సెక్యూర్డ్ ఎసెట్స్‌పై పూర్తి హక్కులు, బదిలీ హక్కులతో సహా కలిగి ఉన్నది. బ్యాంకు వారిచే జరుపబడే అన్ని బదిలీలు, చర్యలు ఆస్తి యజమానిచే చేయబడినవిగా భావించవలెను. ఇందుమూలముగా మీరు ఈ ప్రకటన తేదీ నుండి 60 రోజులలోగా అన్ని ఋణ మొత్తములను మరియు అట్టి వసూలు కొరకు అగు అన్ని ఖర్చులు, కాస్ట్స్ మరియు ఛార్జీలు పూర్తిగా చెల్లించని యెడల బ్యాంకు వారు సదరు పై చట్టము ప్రకారము తదుపరి చర్యలు తీసుకొనగలరు. అయిననూ బ్యాంకు వారి పూర్తి బకాయి మొత్తములు వసూలు కాని యెడల చట్ట ప్రకారం మీపై మరియు హామీదారుల పై తగు చర్యలు తీసుకొనగలరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

ఇతర చట్టబద్ధ / చర్యల ప్రకారం ఇతర చట్ట బద్ధంగా ప్రస్తుతం అమలులో ఉన్న నియమముల ప్రకారంగా అనుకూలమైన చర్యలు బ్యాంకు వారు తీసుకొనుటకు ఎటువంటి పక్షపాతం లేకుండా ఈ నోటీసు జారీచేయబడినది. సదరు చట్టం ప్రకారం మీరు సదరు ఆదేశములకు విరుద్ధము / ఏదేని నిరోధము విరుద్ధంగా ప్రవర్తించుట నేరముగా ఈ నోటీసు ద్వారా తెలియజేయడమైనది.

ఆస్తుల వివరములు

షెడ్యూల్-ఎ : విజయవాడ-520007, పడమట, అయ్యప్ప నగర్, శివాజీ రోడ్డు, వి.ఎల్.టి. అసెస్‌మెంట్ నెం.1073217301, రిజిస్టర్డ్ సర్వే నెం.224/3 వద్ద గల ఆర్.ఎస్.నెం.224/3 లోని విస్తీర్ణం 194 చ॥గ॥లుతో డోర్ నెం.74-13-26 తో ఉన్న నివాసయోగ్యమైన ఆస్తి. **(శ్రీ కొంగర రవి కుమార్ గారి పేరున గల ఆస్తి దస్తావేజు నెం.2095/2005, తేది.23.04.2005 ఎస్.ఆర్.ఓ పడమట ప్రకారం)** **దస్తావేజు ప్రకారం హద్దులు : ఉత్తరం :** 53.5 అ॥లు గారపాటి సరస్వతి, **దక్షిణం :** 54 అ॥లు సాని అంకాలమ్మ గారికి అమ్మినారు, **తూర్పు :** 32.25 అ॥లు కె. జయశ్రీ కొనుగోలుదారుని ఆస్తి, **పడమర :** 33 అ॥ల రోడ్డు.

కృష్ణా జిల్లా, విజయవాడ, ఎస్ఆర్ఓ పటమట, పటమట, డోర నెం.74-13-26 దగ్గర, విఎల్‌టి అసెస్‌మెంట్ నెం.1073217301, ఆర్ ఎస్ నెం.224/3 లోని 968 చ॥గ॥లులోని 572 చ॥గ॥లు విస్తీర్ణంతో దస్తావేజు నెం.6/1993 తో గల నివాసయోగ్యమైన ఆస్తి. **(శ్రీమతి కొంగర జయశ్రీ గారి పేరున గల ఆస్తి దస్తావేజు నెం.6/1993, తేది.06.01.1993 ఎస్.ఆర్.ఓ పడమట ప్రకారం)** **హద్దులు : ఉత్తరం :** గారపాటి సరస్వతి, **దక్షిణం :** గారపాటి గౌరమ్మ, **తూర్పు :** మేడసాని మల్లయ్య గారి ఆస్తి, **పడమర :** కొడలి రామకృష్ణయ్య.

షెడ్యూల్-బి : అందరి పార్ట్‌నర్స్ యొక్క వ్యక్తిగత హామీదారులు మరియు ఆస్తి యజమానులు, పుస్తక ఋణములు & రావలసినవి మరియు నిల్వలు.

స్థలం : విశాఖపట్నం

సం/- అధీకృత అధికారి, హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లి.,

ఎన్నికల సిబ్బంది జాబితా తయారీ పూర్తి చేయండి

- కలెక్టర్లను ఆదేశించిన సిఇఒ ముఖేష్‌కుమార్ మీనా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రానున్న శాసనసభ, లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో పాల్గొనున్న సిబ్బంది జాబితా తయారీ పూర్తి చేయాలని కలెక్టర్లు, ఎస్‌పిలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా ఆదేశించారు. ప్రతి జిల్లాలో ఎన్నికల సిబ్బంది సంఖ్య ప్రాథమిక అంచనా కంటే 20 శాతం అదనంగా ఉండాలన్నారు. సచివాలయం నుంచి శుక్రవారం ఎన్నికల సన్నద్ధతపై జిల్లాల కలెక్టర్లు, ఎస్‌పిలతో సిఇఒ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సిబ్బంది నిర్వహణ, ఓటర్ లిస్టుల నిర్వహణ, ఓటరు కార్డుల పంపిణీ, పోలింగ్ స్టేషన్లలో కనీస వసతుల ఏర్పాటు, లా అండ్ ఆర్డర్ నిర్వహణ అంశాలపై సమీక్ష నిర్వహించారు. పోలీసుశాఖలో సిబ్బంది కొరత ఉన్న జిల్లాలు అదనపు సిబ్బందిని సమకూర్చుకునే అవకాశాలపై వెంటనే రిపోర్టు సమర్పించాలన్నారు. పోలింగేతర విధులకు సంబంధించి శిక్షణ కార్యక్రమాలు నెలాఖరు కల్లా పూర్తి చేయాలని, ఎన్నికల విధుల్లో ఉండనున్న ప్రతి ఒక్క ఉద్యోగికీ పోస్టల్ బ్యాలెట్ అవకాశం కల్పించేందుకు ఏర్పాటు చేయాలన్నారు. ఈ నెలాఖరులోగా సమస్యాత్మక ప్రాంతాల నివేదిక అందించాలని ఎస్‌పిలను ఆదేశించారు. జిల్లాల సరిహద్దుల వద్ద చెక్‌పోస్టుల విషయంలో ఆయా జిల్లాల ఎస్‌పిలు సమన్వయం చేసుకుని సాధ్యమైనంత ఎక్కువ రూట్లలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. మేజర్ రూట్లతో పాటు మెయిన్ రూట్లలోనూ నిరంతర పర్యవేక్షణ ఉండేలా మొబైల్ స్క్వాడ్స్, స్టాటిక్ స్క్వాడ్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో లా అండ్ ఆర్డర్ అడిషనల్ డిజి శంఖబ్రత బాగ్చి, అదనపు ప్రధాన ఎన్నికల అధికారి ఎంఎన్ హరేంధిర ప్రసాద్, ఉప ప్రధాన ఎన్నికల అధికారి కె విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

మా పిటిషన్‌ను అత్యవసరంగా విచారించండి

సుప్రీంకోర్టును కోరిన శరద్‌పవార్

న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం నిర్ణయానికి వ్యతిరేకంగా తాము దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) వ్యవస్థాపకులు శరద్‌పవార్ శుక్రవారం సుప్రీంకోర్టును అభ్యర్థించారు. ఎన్‌సిపి పేరు, గుర్తును అజిత్‌పవార్ గ్రూపునకు కేటాయిస్తూ ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఈ నెల 12న సుప్రీంకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని, వీలైతే సోమవారం నుంచి విచారణ ప్రారంభించాలని శుక్రవారం మరో సారి అభ్యర్థించారు. శరద్‌పవార్ అభ్యర్థనను పరిశీలిస్తామని సిజెఐ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం హామీ ఇచ్చింది.

ఐటిడిఎ ముట్టడిని విజయవంతం చేయాలి

- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ
- కొనసాగిన సిహెచ్‌డబ్ల్యు రిలే దీక్షలు

ప్రజాశక్తి-యంత్రాంగం

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు (సిహెచ్‌డబ్ల్యు) చేపట్టిన సామూహిక రిలే దీక్షలు శుక్రవారమూ కొనసాగాయి. పార్వతీపురం ఐటిడిఎ ఎదుట చేపట్టిన దీక్షలనుద్దేశించి సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ.. సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా గుర్తించాలని, రూ.10 వేలు చెల్లించి యూనిఫాం, గుర్తింపు కార్డులు ఇవ్వాలని, బకాయి జీతాలు చెల్లించాలని డిమాండ్ డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 19న తలపెట్టిన ఐటిడిఎ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. సీతంపేటలో కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు చేపట్టిన దీక్షలను శుక్రవారంతో ముగిశాయి.



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

దీక్షలను సిఐటియు అల్లూరి జిల్లా అధ్యక్షులు చిన్నయ్యపడాల్ విరమింపజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా దీక్షలు చేస్తున్నా ఐటిడిఎ, వైద్య శాఖ అధికారులు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వెంటనే సిహెచ్‌డబ్ల్యుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నోటీసులు

'ఓట్ ఫర్ ఒపిఎస్' ధర్నాను అడ్డుకోవడానికి ప్రభుత్వం నిర్బంధం

ప్రజాశక్తి- యంత్రాంగం

విజయవాడలో ఈ నెల 18న జరగబోయే ఓట్ ఫర్ ఒపిఎస్ ధర్నాను అడ్డుకోవడానికి ప్రభుత్వం నిర్బంధానికి దిగింది. ఈ ధర్నాకు వెళ్లవద్దంటూ రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పోలీసులు శుక్రవారం నోటీసులు ఇచ్చారు. కార్యాలయాలకు వెళ్లి మరీ కొందరికి నోటీసులు అందజేశారు. వీటిపై ఉపాధ్యాయులు, ఉద్యోగులు, ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లాలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వి.శ్రీలక్ష్మి, జిల్లా కార్యదర్శి జిఎస్.ప్రకాష్, రాష్ట్ర కౌన్సిలర్ మారిశెట్టి వెంకట అప్పారావు, ఎపిటిఎఫ్ నాయకులు ఎం.త్రినాథస్వామి తదితరులకు పోలీసులు నోటీసులు ఇచ్చారు. ప్రభుత్వ, పోలీసుల తీరును వి.శ్రీలక్ష్మి తీవ్రంగా ఖండించారు. నోటీసులు, నిర్బంధంతో ఉద్యమాలను ఆపలేరని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి జగన్ గతంలో ఇచ్చిన హామీ మేరకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాల్సిందేనని డిమాండ్ చేశారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు తమ మ్యానిఫెస్టోలో సిపిఎస్ రద్దు అంశాన్ని చేర్చాలని కోరారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పోలీసులు పలువురు యుటిఎఫ్ నాయకులకు నోటీసులు ఇచ్చారు. పోలీసుల చర్యను సంఘం గౌరవాధ్యక్షుడు ఎం.మార్కండేయులు ఖండించారు. తూర్పుగోదావరి జిల్లా తాళ్లపూడి తహశీల్దార్ కార్యాలయంలో గణాంకాధికారిగా పనిచేస్తున్న ఒపిఎస్ సాధన సమితి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు జోడాల వెంకటేశ్వరరావుకు పోలీసులు ఆయన కార్యాలయానికి వెళ్లి మరీ నోటీసులు ఇచ్చారు.



అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఉపాధ్యాయునికి నోటీసు అందజేస్తున్న పోలీసు

లింగ వేతన వ్యత్యాసం తగ్గింది

- ఉపాధిహామీ పథకం ప్రభావం
- అంతర్జాతీయ కార్మిక సంస్థ వెల్లడి

న్యూఢిల్లీ : కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ ప్రభుత్వ హయాంలో వామపక్షాల ఒత్తిడితో తీసుకొచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎ) పట్ల మోడీ సర్కారు నిర్లక్ష్యం వహిస్తున్నది. బడ్జెట్‌లో కోతలు, అమలులో ఆంక్షల పేరుతో పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నాలకు పూనుకుంటున్నది. ప్రతి బడ్జెట్‌లోనూ, అనేక సందర్భాల్లోనూ ఈ విషయం స్పష్టమవు తున్నది. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌ఓ) మాత్రం ఈ పథకం తీరును అభినందించింది. ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లో లింగ వేతన వ్యత్యాసం తగ్గటానికి దారి తీసిందని పేర్కొన్నది. కనీస వేతన నియంత్రణలకు అనుగుణంగా పెరిగిందని వివరించింది. ఈ విషయాన్ని తన తాజా వర్కింగ్ పేపర్‌లో పేర్కొన్నది.

ఐఎల్‌ఓ వర్కింగ్ పేపర్ ప్రకారం.. ఈ పథకం కారణంగా అధికారిక వేతన కార్మికులు, సాధారణ కార్మికుల మధ్య గ్రామీణ వేతనాల్లో వ్యత్యాసం తగ్గింది. ఈ సానుకూల ధోరణుల్లో ఉపాధిహామీ ముఖ్యమైన పాత్రను పోషించింది. క్షేత్రస్థాయిలో పథకం అమలు ఆధారంగా దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఫలితాలు మారుతాయి. ఇటీవలి సంవత్సరాల్లో గ్రామీణ భారత వేతనాల కొనుగోలు శక్తి ప్రతికూల పోకడలను సూచిస్తున్నది. "భారతీయ లేబర్ బ్యూరో ప్రచురించిన గ్రామీణ నెలవారీ వేతన సూచికతో పాటు ద్రవ్యోల్బణం సమాచారాం ద్వారా.. ఆర్థిక మంత్రిత్వ శాఖ ఇటీవలి సంవత్సరాలలో గ్రామీణ భారతీయుల



వేతనాల కొనుగోలు శక్తిలో ప్రతికూల ధోరణులను గమనించింది. ఈ విధంగా, 2022 ఏప్రిల్-నవంబర్ మధ్య పెరిగిన ద్రవ్యోల్బణం కారణంగా గ్రామీణ వేతనాల్లో (అంటే, గ్రామీణ వేతనాలు ద్రవ్యోల్బణం కోసం సర్దుబాటు చేయబడ్డాయి) ప్రతికూల వృద్ధిని తన ఆర్థిక సర్వే 2022-23లో మంత్రిత్వ శాఖ హైలెట్ చేసింది" అని ఐఎల్‌ఓ పేర్కొన్నది. ఐఎల్‌ఓ వర్కింగ్ పేపర్ 58 దేశాల నుంచి వచ్చిన గణాంక ఆధారాలను పరిశీలించింది. దీని ప్రకారం.. పట్టణ ప్రాంతాల్లో ఉన్నవారి కంటే గ్రామీణ ప్రాంత ప్రజలే ఉపాధిలో ఎక్కువగా ఉన్నారు. ఇందులో తీవ్ర శ్రమ, రక్షణ లేకపోవటం, తక్కువ చెల్లింపులు వంటివి ఉంటాయి. "గంటల ఆధారంగా చూస్తే పట్టణాలతో పోల్చి చూస్తే గ్రామీణ ప్రాంత ప్రజలు సగటున 24 శాతం తక్కువ చెల్లింపులు కలిగి ఉంటున్నారు. విద్య, ఉద్యోగ అనుభవం, వృత్తి పరమైన విభాగం వంటి అంశాల్లో పట్టణ - గ్రామీణ వ్యత్యాసాల ద్వారా ఈ అంతరంలో సగం మాత్రమే వివరించబడుతుంది. కనీస వేతనాలు, సమానావకాశాలను ప్రమోట్ చేసే సంస్థాగత, నియంత్రణ ఫ్రేమ్‌వర్క్‌లు గ్రామీణ - పట్టణ విభజనలో లేబర్ మార్కెట్ సంబంధిత అసమానతలను తగ్గించటానికి సహాయం చేయగలుగుతుంది" అని ఐఎల్‌ఓ వివరించింది.

15 శాతమే వైసిపి హామీలు అమలు

- టిడిపి నేత కూన రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

627 హామీలిచ్చి అధికారంలోకి వచ్చాక కేవలం 15 శాతం మాత్రమే జగన్ అమలు చేసి ప్రజల్ని వంచించారనిటిడిపి సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజలకు న్యాయం చేయడానికి చంద్రబాబు కొత్త పథకాలు ప్రకటించారని తెలిపారు. పెరిగిన ధరలు, వివిధ ఛార్జీలు, పన్నుల పెంపుతో ప్రజల్ని దారుణంగా జగన్ దోచేశారని పేర్కొన్నారు.

వలంటీర్లను వైసిపి భావి నాయకులన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై, ఐదేళ్లుగా వారి సేవలు పొందిన వైసిపిపై ఎన్నికల కమిషన్ కఠిన చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు బొండా ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఐదేళ్లుగా ప్రజా సేవకులని చెప్పిన వలంటీర్లు ఎన్నికలకు రెండు నెలల ముందు వైసిపి నాయకులు ఎలా అయ్యారో చెప్పాలని ప్రశ్నించారు.

అధికార దుర్వినియోగం, దొంగ ఓట్లతో కొండెపి నియోజకవర్గంలో మంత్రి ఆదిమూలపు సురేష్ గెలిచేందుకు ప్రయత్నిస్తున్నారని టిడిపి ఎమ్మెల్యే డోలా బాల వీరాంజనేయస్వామి విమర్శించారు. మంత్రి పదవిని ఉపయోగించి ఇష్టానుసారం పక్క జిల్లాల నుంచి అధికారులను కొండెపిలో నియమించారని తెలిపారు. బదిలీలపై కలెక్టరును ప్రశ్నిస్తే సమాధానం లేదన్నారు.

జర్నలిస్టుకు భద్రత కరువు

- గతేడాది 99 మంది మృత్యువాత
- 77 మంది గాజాపై ఇజ్రాయెల్ నరమేధంలోనే...
- గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్ వార్షిక నివేదిక

న్యూఢిల్లీ : ప్రపంచలో ఎక్కడ ఏ సంఘటన జరిగినా కచ్చితమైన, వాస్తవ సమాచారాన్ని అందించే కలం యోధులకు రక్షణ కరువైంది. అలాంటి జర్నలిస్టుల ప్రాణాలు గాలిలో దీపంలా మారుతున్నాయి. జర్నలిస్టుల మరణాలే ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యం. గతేడాది 99 మంది జర్నలిస్టులు చనిపోయారు. వీరిలో 77 మంది గాజాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని రిపోర్ట్ చేస్తున్న సమయంలోనే ప్రాణాలు కోల్పోయారు. గ్లోబల్ మీడియా వాచ్‌డాగ్ 'కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ (సిపిజె) ఈ సమాచారాన్ని తన వార్షిక నివేదికలో వెల్లడించింది. ఈ సమాచారం ప్రకారం.. దశాబ్ద కాలంలో 2023 అనేది జర్నలిస్టులకు ఘోరమైన సంవత్సరం. ఈ ఏడాదిలో 99 మంది జర్నలిస్టులు చనిపోయారు. ఇందులో 77 మంది గాజాపై ఇజ్రాయెల్ నరమేధాన్ని రిపోర్టింగ్ చేస్తున్న సమయంలోనే ప్రాణాలు కోల్పోవటం గమనార్హం. ఇజ్రాయెల్ - గాజా యుద్ధం మొదటి మూడు నెలల్లోనే అనేక మంది జర్నలిస్టులు చనిపోయారు. ఇది ఒక దేశంలో ఒక ఏడాదిలో నమోదయ్యే సంఖ్య కంటే అధికం కావటం గమనార్హం. ఈ 77 మందిలో 72 మంది వారు పాలస్తీనాకు చెందిన వారు కాగా, ముగ్గురు లెబనాన్‌కు చెందినవారు, ఇద్దరు మాత్రమే ఇజ్రాయెల్ దేశానికి చెందినవారు. గురువారం నాటికి ఇజ్రాయెల్-గాజా యుద్ధంలో మరణించిన జర్నలిస్టుల సంఖ్య 88కు పెరిగిందని సిపిజె ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ మరణాలపై దర్యాప్తు పూర్తయిన తర్వాత మాత్రమే డేటా బేస్‌లోకి వాటిని చేర్చుతామని సంస్థ స్పష్టం చేసింది. ఇజ్రాయెల్ దళాలు జర్నలిస్టులపై చేస్తున్న దాడులను న్యూయార్క్ కేంద్రంగా పని చేసే ఈ సంస్థ ఇప్పటికే ఖండించింది. ఇజ్రాయెల్ సైన్యం డజన్ల కొద్ది జర్నలిస్టులను ఉద్దేశపూర్వకంగానే చంపిందా అన్న అంశంపై సంస్థ దర్యాప్తును జరుపుతున్నట్టు సమాచారం. ఒకవేళ అదే నిజమైతే అది 'యుద్ధ నేరం'గా పరిగణించబడుతుంది.

కవిత పిటిషన్‌పై విచారణ 28కి వాయిదా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ కేసులో దర్యాప్తు సంస్థలు తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలంటూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ఈ నెల 28కి వాయిదా వేసింది. ఈ కేసుకు సంబంధించి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) తనపై ఎలాంటి బలవంతపు (అరెస్ట్ లాంటివి) చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ గతేడాది మార్చిలో కవిత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. గతంలో ఈ పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం... కేంద్ర మాజీ మంత్రి చిదంబరం సతీమణి నళిని చిదంబరం, పశ్చిమ బెంగాల్ సిఎం మమతా బెనర్జీ మేనల్లుడు అభిషేక్ బెనర్జీ పిటిషన్లతో ట్యాగ్ చేసిన విషయం తెలిసిందే. మరోసారి ఈ పిటిషన్లు శుక్రవారం జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌తో కూడిన ద్విసభ ధర్మాసనం ముందు విచారణకు వచ్చాయి. తదుపరి విచారణ ఫిబ్రవరి 28న చేపడతామని స్పష్టం చేసింది.

పాకిస్తాన్ ప్రధాని అభ్యర్థిపై

వీడని సందిగ్ధత !

ఇస్లామాబాద్ : పాకిస్తాన్‌లో ఎన్నికల ఫలితాలు వెలువడి వారం రోజులు గడుస్తున్నప్పటికీ.. ఇంకా ప్రధాని అభ్యర్థిపై సందిగ్ధత కొనసాగుతూనే వుంది. షెహబాజ్ షరీఫ్‌ను ప్రధాని కుర్చీపై కూర్చోబెట్టేందుకు నవాజ్ షరీఫ్ పార్టీ పాకిస్తాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పిఎంఎల్-ఎన్) సన్నాహాలు చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే తమ ప్రధాని అభ్యర్థిగా ఉమర్ ఆయూబ్‌ఖాన్‌ను నామినేట్ చేస్తున్నట్లు ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఇన్సాఫ్ (పిటిఐ) ప్రకటించింది. ఇమ్రాన్ ఖాన్ సహ పలువురు నేతలను జైలు నుండి బయటకు తీసుకు రావడమే తమ మొదటి ప్రాధాన్యత అని స్పష్టం చేసింది.

పిటిఐ ప్రధాన కార్యదర్శిగా ఉన్న ఉమర్ అయూబ్ ఖాన్ మాజీ సైనిక నియంత ఆయూబ్‌ఖాన్ మనవడు. ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని హరిపూర్ నుండి పిఎంఎల్-ఎన్ అభ్యర్థిగా 2013 ఎన్నికలలో పోటీ చేసి ఓటమిపాలయ్యారు. అనంత రం 2018 సాధారణ ఎన్నికలకు ముందు పిటిఐలో చేరారు. ఇమ్రాన్ ఖాన్ పార్టీకి ఎన్నికల గుర్తు ప్రకటించక పోవడంతో పార్టీ నేతలు స్వతంత్ర్య అభ్యర్థులుగా బరిలోకి దిగారు. సుమారు 101 స్థానాలను పిటిఐ గెలుచుకుంది. నవాజ్ షరీఫ్ పార్టీ 75 సీట్లు గెలుచుకుని రెండో స్థానంలో నిలవగా, పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ (పిపిపి) 54 సీట్లతో మూడోస్థానంలో ఉంది. ఈ నేపథ్యంలో పిఎంఎల్-ఎన్, పిపిపిలు సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నహాలు చేస్తున్నాయి. ఇరు పార్టీల సంప్రదింపులు సమన్వయ కమిటీ (సిసిసిఎస్) చర్చలు జరుపుతోంది.

ఇజ్రాయిల్ కట్టుబడి వుండేలా ఆంక్షలు విధించాలి

- అంతర్జాతీయ సమాజానికి పాలస్తీనా విజ్ఞప్తి

గాజా : ఇజ్రాయిల్ కట్టుబడి వుండేలా, తప్పనిసరిగా అమలు చేసేలా కఠినమైన ఆంక్షలు విధిస్తే తప్ప గాజాలో ఈ మారణ హోమం ఆగదని పాలస్తీనా అథారిటీ (పిఎ) పేర్కొంది. అమాయకులైన పౌరుల ప్రాణాలు కాపాడాలని పిలుపులు ఇస్తే జరిగిదేమీ వుండదని, దాంతోపాటు కఠినమైన అంతర్జాతీయ ఆంక్షలు విధించాలని, కఠిన చర్యలు తీసుకోవాలని కోరింది. బతకడానికి అవసరమైనవేవీ ఇవ్వకుండా 20లక్షల మందికి పైగా పాలస్తీనియన్లను ఇజ్రాయిల్ బందీలుగా అదుపులోకి తీసుకుందని విమర్శించింది. కాల్పుల విరమణ పాటించాలని, పౌరుల ఊచకోత ఆపాలని అంతర్జాతీయంగా ఎన్ని విజ్ఞప్తులు, హెచ్చరికలు వచ్చినా వాటిని ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు బేఖాతరు చేస్తున్నారని పేర్కొంది. తమ ప్రజలను బందీలుగా చేసి, వారిని ఆకలితో మాడ్చి చంపుతూ, వారి మాతృభూమి నుండే వారినే వెళ్ళగొట్టేలా చేస్తున్నారని పిఎ విమర్శించింది. ఇజ్రాయిల్ దురాక్రమణ చర్యలను ఆపేసేలా ఒత్తిడి తీసుకురాగలిగే, వాటికి కట్టుబడి వుండేలా ఐక్యరాజ్య సమితి తీర్మానాలను అంతర్జాతీయ సమాజం ఆమోదించాలని కోరింది.



చిన్నాభిన్నమైన అంతర్జాతీయ వ్యవస్థే ఇందుకు కారణం : యుఎన్ చీఫ్

గాజాలో సాగుతున్న నరమేధం చిన్నాభిన్నమైన ప్రపంచ వ్యవస్థను నొక్కి చెబుతోందని ఐక్యరాజ్య సమితి చీఫ్ ఆంటానియో గుటెరస్ వ్యాఖ్యానించారు. గాజాలో పరిస్థితులు అత్యంత దయనీయంగా వున్నాయని, అక్కడ సాగుతున్న విధ్వంస కాండ, మరణాలు ప్రపంచాన్ని నివ్వెరపరుస్తున్నాయని, ఈ యుద్ధం సరిహద్దులు దాటి కూడా విస్తరిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇంత జరుగుతున్నా ప్రపంచ దేశాలు మూకుమ్మడిగా స్పందించలేకపోవడానికి అంతర్జాతీయ సంబంధాల్లో నెలకొన్న ప్రతిష్టంభనే కారణమన్నారు. మ్యునిక్ భద్రతా సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ పై వ్యాఖ్యలు చేశారు.

నాసర్ ఆస్పత్రిపై దాడిలో ఆరుగురు రోగులు మృతి

ఖాన్ యూనిస్‌లోని నాసర్ ఆస్పత్రిపై ఇజ్రాయిల్ బలగాలు విచక్షణారహితంగా జరుపుతున్న దాడుల్లో ఆరుగురు రోగులు ప్రాణాలు కోల్పోయారు. విద్యుత్‌ను, ఆక్సిజన్ సరఫరాలను నిలిపివేయడంతో చికిత్స పొందుతున్న ఆరుగురు రోగులు మరణించారని సంబంధిత వర్గాలు తెలిపాయి.

Chola Enter a better life

చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

కార్పొరేట్ ఆఫీస్: "చోల క్రెస్ట్", సి54& 55, సూపర్ బి-4, తిరు.వి.క. ఇండస్ట్రీయల్ ఎస్టేట్, గ్యూండీ, చెన్నై-600032, తమిళనాడు.

ఇ-వేలం అమ్మకపు ప్రకటన (ఇ-బిడ్డింగ్ ద్వారా మాత్రమే అమ్మకం)

ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)& 9(1)ల క్రింద జారీచేయబడిన హామీచూపిన స్థిరాస్తుల అమ్మకం ప్రకటన.

ఇందుమూలంగా ప్రత్యేకించి **కాలం (ఎ)**లో సూచించిన రుణగ్రహీత/సహ-రుణగ్రహీత/తాకట్టుదారులకు మరియు **సర్వజనులకు** ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టబడినవి, వాటిని **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధీకృత అధికారిచేత **కాలం (సి) లో వివరించిన స్థిరాస్తులను** సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టుపెట్టిన మరియు **కాలం (డి)**లో వివరించినట్లుగా, అదీకృత అధికారిచేత **నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనంచేసుకోబడినది.** వాటిని ఇ-వేలం ద్వారా **"ఏది ఎక్కడ ఉన్నది అది అక్కడ అలాగే ప్రాతిపదికన"** విక్రయించబడుతుంది.

ఇందుమూలంగా రుణగ్రహీత/ తాకట్టుదారులకు/చట్టబద్ద వారసులు, చట్టబద్ద ప్రతినిదులు **(ఏవైతే తెలిసిన& తెలియని)**, ఎగ్జిక్యూటర్స్, అడ్మినిస్ట్రేటర్స్, సక్సెసరర్ మరియు మరణించిన రుణగ్రహీత/తాకట్టుదారులుకు సంబందించిన అసైనెలుకు దిగువ సెక్యూరిటీ ఇంటెరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 9(1) క్రింద కాలం (ఎ)లో సూచించినట్లుగా నోటీసు ఇవ్వబడుచున్నది.

అమ్మకం యొక్క వివరణాత్మక నియమాలు& షరతుల కొరకు, సెక్యూర్డ్ క్రెడిటర్ **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క వెబ్‌సైట్ https://www.cholamandalam.com & www.auctionfocus.in ద్వారా అందులో ఇవ్వబడిన లింకును దయచేసి పరిశీలించండి.

చెల్లించు తేది మరియు/లేదా దానిపై వసూలు వరకు వెచ్చించిన వాటితో రుణ ఒప్పందం యొక్క నియమాలలో వర్తించబడు తదుపరి వడ్డీతోసహా.

ఆస్తిని పరిశించుటకు సంబంధించి ఏవేని సహాయసహకారాల కొరకు, లేదా బిడ్ పత్రాలు పొందుట కొరకు మరియు ఏవేని ఇతర సందేహాల కొరకు, దయచేసి **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్** యొక్క అధికారి **శ్రీ రాజోలు సాయి కిషోర్, మొబైల్ నం. 9603972369, ఇమెయిల్ ఐడి:ambalanaresh@chola.murugappa.com / శ్రీ మహ్మద్ అబ్దుల్ ఖావి మొబైల్ నం. 730599872 తో** పై స్థిరాస్తులు/సెక్యూర్డ్ అసెట్స్ **చోలమండలం ఇన్వెస్ట్‌మెంట్ & ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి**ని సంప్రదించవచ్చును.









దేశమంతా ఆగ్రహజ్వాలలు

కదంతొక్కిన కర్షకులు, కార్మికులు

మోడీ సర్కార్ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలపై ఆగ్రహ జ్వాలలు రగిలాయి. గ్రామీణ భారత్ బంద్, పారిశ్రామిక, సెక్టోరల్ సమ్మె దేశవ్యాప్తంగా విజయవంతమైంది. కర్షకులు, కార్మికులు భుజంభుజం కలిపి ఆందోళనల్లో పాల్గొన్నారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి అన్ని రాష్ట్రాల రాజధానులతోపాటు పట్టణ, గ్రామీణ ప్రాంతాల వరకూ నిరసనలు హోరెత్తాయి.





















నవ్యప్రెస్ రామకృష్ణారెడ్డి ఇకలేరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో


రామకృష్ణారెడ్డి(ఫైల్)

పిఒడబ్ల్యు జాతీయ కన్వీనర్ వి.సంధ్య జీవిత భాగస్వామి, కవి, నవ్య ప్రింటింగ్ ప్రెస్ యజమాని రామకృష్ణారెడ్డి(62) శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కొంత కాలంగా మల్టిపుల్ ఆర్గాన్ డిసార్డర్‌తో బాధపడుతున్న ఆయనకు శుక్రవారం ఉదయం తీవ్రమైన గుండెపోటు రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. వెంటనే సమీపంలోని అపోలో హాస్పటల్‌కు తీసుకెళ్లగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. ఆయన అంత్యక్రియలు చిట్యాల సమీపంలోని నేరడ గ్రామంలో ఉన్న వారి వ్యవసాయ క్షేత్రంలో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

ప్రముఖుల సంతాపం

హిమాయత్ నగర్‌లోని ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు తరలివచ్చి భౌతికకాయానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత వై.వెంకటేశ్వర్లు, ప్రెస్ అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.వీరయ్య, నాయకులు బొజ్జ బిక్షమయ్య, రాములు, బండారు రవికుమార్, సిపిఐ(ఎంఎల్) రాష్ట్ర నాయకులు ఎస్.వెంకటేశ్వరరావు, మహిళా నాయకులు రమా మేల్కోటే, కవులు, కళాకారులు, వివిధ ప్రజా సంఘాల నాయకులు, ప్రజాస్వామిక వాదులు ఉన్నారు.

తెలంగాణలో కులగణన

- శాసనసభలో తీర్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కులగణన, సామాజిక, ఆర్థిక ఇంటింటి సర్వే చేపట్టాలని ఆ రాష్ట్ర శాసనసభ ఏకగ్రీవంగా తీర్మానించింది. త్వరలోనే అఖిలపక్ష సమావేశం నిర్వహించి విధివిధానాలను ఖరారు చేస్తామని ప్రభుత్వం వెల్లడించింది. కుల గణనకు సంబంధించి మంత్రివర్గ సిఫార్సు మేరకు శుక్రవారం అసెంబ్లీలో బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీర్మానం ప్రవేశపెట్టారు. బిఆర్ఎస్ సభ్యులు గంగుల కమలాకర్, కెటి రామారావు, కడియం శ్రీహరి, బిజెపి సభ్యులు పాయల్ శంకర్, కాంగ్రెస్ సభ్యులు ఆది శ్రీనివాస్, మజ్లిస్ పక్ష నేత అక్బరుద్దీన్, సిపిఐ పక్ష నేత సాంబశివరావు, తదితరులు మాట్లాడుతూ.. తీర్మానానికి మద్దతు తెలిపారు. చట్టబద్ధత ఉంటేనే ఈ కార్యక్రమం ఫలవంతమవుతుందని కెటిఆర్ అన్నారు. బిల్లు కోసం అసెంబ్లీ సమావేశాలు పొడిగించాలని కోరారు. సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కుల గణన విషయంలో తమ ప్రభుత్వాన్ని శంకించాల్సిన అవసరంలేదని అన్నారు. రాష్ట్ర జనాభాలో అరశాతం ఉన్న వాళ్లకు ఈ తీర్మానంపై బాధ ఉండొచ్చని అన్నారు. సహేతుకమైన సూచనలు చేయాలని ప్రతిపక్షాన్ని కోరారు. గత ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే చేసినా వివరాలు బయటపెట్టలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ గుర్తుచేశారు. అందరి సూచనలు తీసుకుంటామని సభకు స్పష్టంచేశారు. తీర్మానంపై చర్చ అనంతరం సభ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్టు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు.

నో కామెంట్

- ఎన్నికల బాండ్ల తీర్పుపై ఇసి నుంచి స్పందన నిల్
- గతంలో ఈ పథకంపై అభ్యంతరాలు
- మోడీ సర్కారుకు పలు సూచనలు
- స్కీమ్‌ను వ్యతిరేకిస్తూ సిపిఐ(ఎం), కాంగ్రెస్, ఎడిఆర్‌ల పిటిషన్లు
- పథకాన్ని పట్టుబట్టి తీసుకొచ్చిన మోడీ ప్రభుత్వం

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు తీసుకొచ్చిన ఎన్నికల బాండ్ల స్కీమ్ రాజ్యాంగ విరుద్ధమని, సమాచార హక్కు, భారత రాజ్యాంగంలో భావప్రకటనా స్వేచ్ఛకు హామీనిచ్చే ఆర్టికల్ 19(1)(ఎ)ని ఉల్లంఘించిందని సుప్రీంకోర్టు గురువారం చారిత్రాత్మక తీర్పును వెలువర్చింది. కొనుగోలు చేసిన అన్ని ఎలక్టోరల్ బాండ్ల వివరాలను విడుదల చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ)ను కోర్టు ఆదేశించింది. వచ్చే నెల 13లోగా తన వెబ్‌సైట్‌లో సమాచారాన్ని ప్రచురించాలని భారత ఎన్నికల కమిషన్ (ఇసిఐ)ని ఆదేశించింది.

ఎలక్టోరల్ బాండ్లలో విరాళాల పారదర్శకత లేకపోవటానికి సంబంధించిన ఆందోళనలను ఇసిఐ గతంలో వ్యక్తం చేసింది. ఇది మరింత నష్టాన్ని కలిగించే లెక్కలు చూపని నగదు బదిలీల యుగానికి తిరిగి తీసుకెళుతుందని అప్పట్లో సూచించినప్పటికీ.. పథకంపై స్టే మాత్రం కోరకపోవటం గమనార్హం.

బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ-1 ప్రభుత్వం 2018లో ఈ పథకాన్ని తీసుకురావటానికి ముందు కేంద్రాన్ని ఇసిఐ హెచ్చరించింది. ఎన్నికల బాండ్లు రాజకీయ పార్టీలు విదేశీ మూలాల నుంచి అక్రమ విరాళాలను దాచటానికి సహాయపడతాయనీ, షెల్ కంపెనీల ద్వారా రాజకీయ నిధుల కోసం నల్లధనాన్ని ఉపయోగించడం పెరగటానికి దారితీయవచ్చని తెలిపింది. ఈ విషయంలో మే 26, 2017న ఇసిఐ న్యాయ మంత్రిత్వ శాఖకు లేఖ రాసినట్టు ఒక వార్త సంస్థ నివేదిక నొక్కి చెప్పింది.

రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా స్వీకరించబడిన విరాళాలకు సంబంధించి కమిషన్‌కు నివేదించాల్సిన అవసరం లేనందున ప్రజాప్రాతినిధ్య చట్టం 1951 (ఆర్‌పిఎ)లోని సెక్షన్ 29సిని సవరణను ఇసిఐ తన లేఖలో విరాళాల పారదర్శకతకు సంబంధించినంత వరకు తిరోగమన దశగా అభివర్ణించింది. విరాళాలు నివేదించబడకపోతే, రాజకీయ పార్టీలు ప్రభుత్వ కంపెనీలు, విదేశీ మూలాల నుంచి విరాళాలు తీసుకున్నాయో లేదో నిర్ధారించడం సాధ్యం కాదని కూడా సూచించింది.

కంపెనీల చట్టంలోని 182వ సెక్షన్‌కి సవరణ ద్వారా గత మూడు ఆర్థిక సంవత్సరాల నికర సగటు లాభంలో 7.5 శాతం వరకు మాత్రమే విరాళాలు చెల్లించవచ్చనే పరిమితిని తీసివేసిందనీ, కొత్తగా ఇన్ కార్పొరేటెడ్ కంపెనీలు కూడా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా విరాళాలు ఇవ్వడానికి వీలు కల్పిస్తున్నాయని ఇసిఐ నొక్కి చెప్పింది. .

న్యాయ మంత్రిత్వ శాఖ ఇసిఐ లేఖను ఆర్థిక మంత్రిత్వ శాఖకు పంపగా, కమిషన్ ఆందోళనలను విస్మరించారని ఒక వార్త సంస్థ నివేదిక నొక్కిచెప్పింది. అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ జులై 19, 2017న ఆర్‌బిఐ, ఇసిఐతో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అంతేకాకుండా, ప్రభుత్వ అధికారులుచ అప్పటి ప్రధాన ఎన్నికల కమిషనర్ (సిఇసి) అచల్ కుమార్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లు (ఇసిలు) ఓం ప్రకాష్ రావత్, సునీల్ అరోరా మధ్య ప్రత్యేక సమావేశం జరిగిందని కూడా నివేదిక నొక్కి చెప్పింది. జులై 28, 2017న సిఇసి, ఇసిలతో జరిగిన ఈ సమావేశంలో.. ఎలక్టోరల్ బాండ్‌లను కొనుగోలు చేసేటప్పుడు కంపెనీలు తమ పుస్తకాలలో అకౌంటింగ్ ఎంట్రీలను చేస్తాయంటూ ప్రభుత్వ అధికారులు తప్పుడు వాదన చేశారని వార్తా సంస్థ నివేదిక వెల్లడించింది.

సిపిఐ (ఎం), కాంగ్రెస్ నాయకురాలు జయఠాకూర్, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) 2017లో సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి, ఎన్నికల బాండ్లకు సంబంధించిన అనామకత్వం రాజకీయ నిధుల్లో పారదర్శకతను దెబ్బతీస్తుందనీ, ఓటర్ల సమాచార హక్కును ఉల్లంఘిస్తోందని పిటిషన్‌లో నొక్కి చెప్పాయి. అనామక ఎలక్టోరల్ బాండ్లకు మార్గం సుగమం చేసిన ఫైనాన్స్ యాక్ట్ 2017లోని నిబంధనలను పిటిషన్లు సవాలు చేశాయి. ప్రజల ప్రాతినిధ్య చట్టం, ఫైనాన్స్ యాక్ట్ 2017 ద్వారా ప్రవేశపెట్టబడిన కంపెనీల చట్టానికి సవరణలు చేయవచ్చనే ఆందోళనలను ఫ్లాగ్ చేస్తూ ఇసిఐ.. ఈ కేసులో కౌంటర్-అఫిడవిట్ దాఖలు చేసింది.

పశ్చిమ బెంగాల్, కేరళ, తమిళనాడు, అస్సాం, పుదుచ్చేరిలో ఆ సంవత్సరం షెడ్యూల్ చేయబడిన అసెంబ్లీ ఎన్నికల కోసం ఏప్రిల్ 1, 2021 నుంచి తాజా ఎలక్టోరల్ బాండ్ల విడుదలపై స్టే విధించేందుకు ఆ ఏడాది మార్చి 26న సుప్రీంకోర్టు నిరాకరించింది. బాండ్లపై స్టే విధించాలని కోరుతూ ఎన్‌జిఒ ఎడిఆర్ దాఖలు చేసిన దరఖాస్తును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇసిఐ ఎలక్టోరల్ బాండ్‌లకు వ్యతిరేకం కాదని, మరింత పారదర్శకతను కోరుకుంటున్నదనీ, మధ్యంతర స్టే ఉండకూడదని కమిషన్ తరపు న్యాయవాది రాకేష్ ద్వివేది కోర్టుకు తెలిపారు.

కాంగ్రెస్ అకౌంట్లు సీజ్

- అనుమతినిచ్చిన ఐటి అప్పిలియేట్ ట్రిబ్యునల్
- ప్రజాస్వామ్యంపై దాడి : మల్లికార్జున ఖర్గే
- కాంగ్రెస్‌కు ప్రజా బలం ఉంది : రాహుల్ గాంధీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ పార్టీ ముఖ్యమైన అనుబంధ సంఘాలకు చెందిన తొమ్మిది అకౌంట్లను ఆదాయ పన్నుశాఖ సీజ్ చేసింది. తమ శాఖ 2018-19లో పంపిన నోటీసులకు సదరు అనుబంధ సంఘాలు సరైన స్పందన ఇవ్వకపోగా.. జరిమానా కూడా చెల్లించలేదని, దీంతో అకౌంట్లు సీజ్ చేశామని పేర్కొంది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ, దాని అనుబంధ విభాగాలకు సమాచారం పంపింది. దీంతో కాంగ్రెస్ ఐటి అప్పిలియేట్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించింది. ఆదాయపు పన్ను సీజ్ చేసిన అకౌంట్లను ఉపయోగించుకునేందుకు ఐటి అప్పిలియేట్ ట్రిబ్యునల్ అనుమతినిచ్చింది.

ప్రజాస్వామ్యంపై దాడి

కాంగ్రెస్‌కు చెందిన బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేయడం రాజ్యాంగ విరుద్ధమని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఇది ప్రజాస్వామ్యంపై లోతైన దాడి అని అన్నారు. అధికార మత్తులో ఉన్న మోడీ సర్కారు లోక్‌సభ ఎన్నికల ముందు దేశంలోని అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఖాతాలను స్తంభింపజేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019లో పార్టీ ఎంపిలు, ఎమ్మెల్యేలు నగదు రూపంలో డిపాజిట్ చేసిన రూ.14.40 లక్షలకు, గతంలో ఐటిశాఖ ఏకంగా రూ.210 కోట్ల జరిమానా విధించిందని చెప్పారు. ఇప్పుడు ఈ చిన్నసాకుతో ఆదాయపు శాఖ కాంగ్రెస్ పార్టీ, యువజన కాంగ్రెస్ బ్యాంక్ అకౌంట్లను సీజ్ చేసిందని ఆరోపించారు. ఈ అంశంపై సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా ఖర్గే స్పందించారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎలక్టోరల్ బాండ్లను సుప్రీంకోర్టు కొట్టేసిన తరువాత బిజెపి ఖాతాలు సీజ్ చేయాలని అన్నారు. ఇప్పటికే ఇందులో 95 శాతానికి పైగా నిధుల్ని బిజెపి జేబులో వేసుకుందని ఆరోపించారు.

కాంగ్రెస్‌ది డబ్బు కాదు.. ప్రజా బలం : రాహుల్‌గాంధీ

కాంగ్రెస్ పార్టీకి డబ్బు బలం కాదని, ప్రజల బలం ఉందని అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. నియంతృత్వ బెదిరింపులకు కాంగ్రెస్ లొంగదని స్పష్టం చేశారు. దేశ ప్రజాస్వామ్యాన్ని అన్ని విధాలుగా పరిరక్షించేందుకు, ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త పోరాడుతారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలకు ఒక నెల ముందు, ప్రతిపక్ష పార్టీ ఎలాంటి ఆర్థిక లావాదేవీలు చేపట్టకుండా బిజెపి ఒక బలహీన చర్యలను ఎంచుకుందని పార్టీ జనరల్ సెక్రటరీ (సంస్థాగత) కెసి వేణుగోపాల్ విమర్శించారు. బిజెపి ఎలక్టోరల్ బాండ్ స్కాంతో రూ.6,500 కోట్లు చెక్కు చెదరకుండా ఆ పార్టీ అకౌంట్‌లో మిగిలిపోయాయన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌కు ముందు ఉద్దేశపూర్వకంగా అకౌంట్ల సీజ్ జరిగిందని పార్టీ కోశాధికారి అజయ్ మాకెన్ విమర్శించారు.

బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలి

- ద్రౌపది ముర్ముకు జాతీయ ఎస్‌సి కమిషన్ సిఫార్సు
- పిల్ పరిశీలనకు సుప్రీం అంగీకారం

న్యూఢిల్లీ : పశ్చిమ బెంగాల్‌లోని సందేశ్‌ఖలిలో మహిళలపై టిఎంసి గూండాలు వేధింపులకు పాల్పడుతున్న ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు జాతీయ ఎస్‌సి కమిషన్ (ఎన్‌సిఎస్‌సి) బృందం నివేదికను సమర్పించింది. రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని నివేదిక సిఫార్సు చేసినట్లు ఎన్‌సిఎస్‌సి అధ్యక్షులు అరుణ్ హల్దర్ శుక్రవారం మీడియాకు తెలిపారు. టిఎంసి నాయకుడు షాజహాన్ షేక్, అతని మద్దతుదారులు తమ భూములను బలవంతంగా స్వాధీనం చేసుకున్నారని, తమపై లైంగిక వేధింపులకు పాల్పడి, పరారీలో ఉన్న షేక్‌ను అరెస్టు చేయాలని మహిళలు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో సందేశ్‌ఖలిని గురువారం ఎన్‌సిఎస్‌సి బృందం సందర్శించింది. బెంగాల్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని సిఫార్సు చేశామని, పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని రాష్ట్రపతి హామీ ఇచ్చారని చెప్పారు. .

కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్, బిజెపి నాయకుల అడ్డగింత

సందేశ్‌ఖలిలో పర్యటించకుండా కాంగ్రెస్ నాయకుడు అధిర్ రంజన్ చౌదరిని రాంపూర్ గ్రామంలో శుక్రవారం పశ్చిమ బెంగాల్ పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, ఆయన అక్కడే రోడ్డుపై ఆందోళనకు దిగారు. బిజెపి నాయకులను కూడా అదే గ్రామంలో పోలీసులు అడ్డుకున్నారు. సందేశ్‌ఖలీ ఘటనపై కోర్టు పర్యవేక్షణలో గానీ, సిబిఐతో గానీ, సిట్‌తో గానీ విచారణ జరిపించాలని దాఖలైన పిల్‌ను పరిశీలించడానికి సుప్రీంకోర్టు శుక్రవారం అంగీకరించింది.

బర్డ్ ఫ్లూ కలకలం

(మొదటి పేజీ తరువాయి)

శానిటైజేషన్ చేయించారు

వలస పక్షులు వచ్చే జిల్లాలో....

నెల్లూరు జిల్లాలో బర్డ్ ఫ్లూ నిర్ధారణయైన నేపథ్యంలో రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లోనూ ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. చెరువులు, సరస్సులు ఎక్కువగా ఉండి వలస పక్షులు వచ్చే జిల్లాలపై దృష్టి సారించినట్లు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి కృష్ణ, ఉభయ గోదావరి,కడప, ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కోళ్లు అధికంగా ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి జిల్లాల్లో మరికొన్ని ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నెల్లూరు జిల్లాలో బర్డ్‌ఫ్లూ సోకి చనిపోయిన కోళ్లను శాస్త్రీయ పద్ధతిలో ఖననం చేసినట్లు తెలిపారు. ప్రకాశం జిల్లాలో అధికారులు మద్దిపాడు మండలం వెల్లంపల్లి గ్రామంలోని కోళ్ల ఫారాలను సందర్శించారు. ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్ల మరణాలు సంభవిస్తే స్థానిక పశువైద్యాధికారుల దృష్టికి తీసుకొని రావాలని సూచించారు.


దాడిలో దగ్ధమైన కలెక్టర్ కార్యాలయం, భద్రతాదళాల వాహనాలు

మణిపూర్‌లో ఆగని హింసాకాండ

- భద్రతా దళాల కాల్పుల్లో ఇద్దరి మృతి, 12 మందికి గాయాలు
- చుర్‌చాంద్‌పూర్ జిల్లా కలెక్టర్, ఇతర అధికారుల నివాసాలపై మూక దాడి

ఇంఫాల్ : మణిపూర్‌లో గత తొమ్మిది నెలలుగా కొనసాగుతున్న హింసాకాండ ఇంకా చల్లార లేదు. తాజాగా చుర్‌చాంద్‌పూర్ జిల్లా కేంద్రంలో ఆందోళనకారులపై భద్రతా దళాలు జరిపిన కాల్పుల్లో ఇద్దరు మరణించారు. మరో 12 మంది తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం చుర్‌చాంద్‌పూర్ పట్టణంలో జిల్లా కలెక్టర్, ఎస్‌పి, డిప్యూటీ కమిషనర్‌తోసహా ఇతర ఉన్నతాధికారుల కార్యాలయాలు, నివాసాలపై గురువారం రాత్రి దాదాపు 300 నుంచి 400 మంది ఉన్న గుంపు దాడి చేసింది. మినీ సెక్రటేరియట్‌గా పిలిచే ఆ ప్రాంతంలో ప్రవేశించకుండా అడ్డుకున్న భద్రతా సిబ్బందిపై రాళ్ల దాడికి పాల్పడింది. కలెక్టర్ నివాసాన్ని దగ్ధం చేసింది. అక్కడ నిలిపివుంచిన భద్రతా దళాల వాహనాలను తగలబెట్టింది. ఇతర ఉన్నతాధికారుల నివాసాలు, కార్యాలయాల్లోకి ప్రవేశించి అక్కడ ఉన్న సామాగ్రిని దగ్ధం చేసింది. ఆ గుంపును అక్కడ నుంచి చెదరగొట్టడానికి భద్రతా సిబ్బంది కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు మరణించారని, మరో 12 మంది గాయపడ్డారని స్థానికులు చెబుతున్నారు. మృతులు, గాయపడిన వారి సంఖ్యకు సంబంధించి అధికారులు స్పష్టత ఇవ్వడం లేదు. శుక్రవారం తెల్లవారుజాము వరకూ హింసాకాండ, కాల్పులు కొనసాగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ దాడి నేపథ్యంలో జిల్లాలో ఐదు రోజుల పాటు మొబైల్, ఇంటర్నెట్ డేటా సేవలను నిలిపివేస్తూ మణిపూర్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.


'ఆపరేషన్ లోటస్' ఎండగట్టేందుకే విశ్వాస తీర్మానం

ఢిల్లీ అసెంబ్లీలో సిఎం కేజ్రీవాల్ - నేడు చర్చ

న్యూఢిల్లీ, అహ్మదాబాద్ : ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా తప్పుడు కేసులు పెట్టి తమ పార్టీని విచ్ఛిన్నం చేసి, ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బిజెపి ప్రారంభించిన 'ఆపరేషన్ లోటస్'ను ఎండగట్టేందుకే విశ్వాస పరీక్షను ఎదుర్కొంటున్నామని ఢిల్లీ సిఎం కేజ్రీవాల్ తెలిపారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) ఆరోసారి సమన్లు జారీ చేయడం, ఢిల్లీ కోర్టుకు హాజరు కావాల్సి ఉండటంతో ఆయనను అరెస్టు చేయవచ్చని వార్తలు వస్తున్న నేపథ్యంలో కేజ్రీవాల్ శుక్రవారం అసెంబ్లీలో విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. స్పీకర్ రామ్‌నివాస్ గోయల్ ఈ తీర్మానాన్ని ఆమోదించారు. శనివారం ఉదయం 11 గంటలకు ఈ తీర్మానం అసెంబ్లీలో చర్చకు రానుంది. ఈ సందర్భంగా అసెంబ్లీలో కేజ్రీవాల్ మాట్లాడుతూ ఆప్ ఎమ్మెల్యేలను బిజెపి సభ్యులు సంప్రదించారని, త్వరలో ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తారని వారు చెప్పారని పేర్కొన్నారు. 21 ఆప్ ఎమ్మెల్యేలు పార్టీని వీడేందుకు అంగీకరించారని, మరికొందరిని సంప్రదిస్తామని బిజెపి నాయకులు వారికి చెప్పారని సిఎం తెలిపారు. బిజెపిలో చేరితే రూ.25 కోట్లు ఇస్తామని చెప్పారని అన్నారు. బిజెపి ప్రతిపాదనను తాము అంగీకరించలేదని ఇద్దరు ఆప్ ఎమ్మెల్యేలు తనకు చెప్పారని, ఇతర ఎమ్మెల్యేలతో మాట్లాడగా ఈ ప్రతిపాదన వచ్చిందని, అంగీకరించలేదని మొత్తం ఏడుగురు ఎమ్మెల్యేలు చెప్పారని అన్నారు. 'ఆపరేషన్ లోటస్'ను ఢిల్లీలో అమలు చేసేందుకు బిజెపి ప్రయత్నిస్తోందని విమర్శించారు.

ప్రధాని మోడీ విద్యార్హతలకు సంబంధించి గుజరాత్ యూనివర్సిటీ తమపై దాఖలు చేసిన పరువు నష్టం కేసులో సమన్లను రద్దు చేయాలని కోరుతూ కేజ్రీవాల్, సంజయ్ సింగ్ వేసిన పిటిషన్లను గుజరాత్ హైకోర్టు శుక్రవారం కొట్టివేసింది.

రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ మృతి



మాస్కో : జైల్లో వున్న రష్యా ప్రతిపక్ష నేత అలెక్సీ నావల్నీ మరణించినట్లు యమలో-నెనెట్స్ ప్రాంత ప్రిజన్ సర్వీస్ శుక్రవారం ప్రకటించింది. నడుస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారని ప్రిజన్ సర్వీస్ ఒక ప్రకటనలో తెలిపింది. స్పృహ కోల్పోయిన ఆయనను తెలివిలోకి తెప్పించడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామని, కానీ ఫలితం లేకపోయిందని అధికారులు తెలిపారు. రక్తం గడ్డ కట్టడం వల్లనే ఆయన మృతి చెందినట్లు రష్యా టుడే వర్గాలు తెలిపాయి. అవినీతి కేసులో నావల్నీ 2021లో జైలుపాలయ్యారు. నావల్నీ తరపు న్యాయవాది లియోనిద్ మాట్లాడుతూ, బుధవారం తాను ఆయనను కలిసి మాట్లాడానని, అప్పుడు ఆయన చాలా సాధారణంగా వున్నారని చెప్పారు. గురువారం వీడియో లింక్ ద్వారా కోర్టు విచారణలో కూడా ఆయన పాల్గొన్నారని తెలిపారు.



మీ కోసం

గులాబ్ జామున్‌లు గట్టిగా అయితే పంచదార పాకంతో సహా వాటిని ప్రెషర్ కుక్కర్‌లో పెట్టి సన్నటి మంట మీద ఐదు నిమిషాలు ఉడికిస్తే మృదువుగా మారతాయి.

జీవన సౌరభం

ప్రతిరోజూ నిన్నటి కన్నా ఎక్కువ విషయాలు నేర్చుకుంటూ ఉండాలి.



చెట్లను కాపాడుదాం



సీతాపురం అనే గ్రామంలో గీత, నాగరాజు అనే దంపతులు ఉన్నారు. వారికి మణిదీప్, మీనాక్షి ఇద్దరు పిల్లలు. గీత, నాగరాజు ఇద్దరూ వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. వాళ్ళ ఇంటి ముందు ఒక జామ చెట్టు ఉంది. ఒకసారి ఆ చెట్టు నుంచి ఎండిపోయిన జామాకులు కింద పడి చెత్త బాగా పేరుకుపోయింది. దీంతో నాగరాజు గొడ్డలితో జామ చెట్టును నరికి వేయడానికి వెళ్ళాడు. అది చూసిన మనిదీప్, మీనాక్షి వద్దని ఆపారు.

'చెట్లు నరకడం మూలంగా ప్రకృతి ఉండదని పాఠశాలలో మాస్టర్ చెప్పారు. చెట్లు ఉంటేనే మనకు ప్రాణవాయువు ఉంటుంది. మనకు రక్షణ చెట్లు' అని నాన్నకు అర్థమయ్యేలా చెప్పారు.


అయినా వారి మాటలు వినకుండా నాగరాజు చెట్టును కొట్టాడు. ఒక చిన్న కొమ్మ వచ్చి నాగరాజు కంట్లో గుచ్చుకుంది. వెంటనే నాగరాజును ఆసుపత్రికి తీసుకువెళ్లగా 'గాయం చిన్నదే గనుక కొద్ది రోజుల్లో మానుతుంద'ని డాక్టర్లు చెప్పారు. ఇంటి దగ్గరే ఉంటున్న నాగరాజు ప్రతిరోజూ ఆ జామ చెట్టు వంక చూసి బాధపడతాడు. 'తన కంటికి చిన్న గాయమైతేనే ఇలా విలవిలాడుతున్నాను. మరి జామ చెట్టు కూడా ప్రాణం ఉంటుంది కదా! పిల్లలు చెప్పింది నిజమే. నేను చాలా పెద్ద తప్పు చేశాను. ఇక నుంచి చెట్లను నరకను' అని మనసులో గట్టిగా అనుకున్నాడు. అనుకోవడమే కాదు, పిల్లలిద్దరితో పెరట్లో ఎన్నో మొక్కలు నాటించాడు.


నీతి : పచ్చని ప్రతి చెట్టును కాపాడాలి.



- సన,
8వ తరగతి, జెడ్‌పిహెచ్ హవేలీ ఘనపూర్, మెదక్ జిల్లా,
98495 05014.

గజిబిజి





పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న ఈ కూరగాయను ఆంగ్లంలో ఏమంటారో పక్కనే ఇచ్చాం. అయితే గజిబిజిగా ఉన్న ఆ అక్షరాలను సరైన క్రమంలో పెడితే ఆ పేరు వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ



కె.ధనుష్,
ఏడో తరగతి,
పెద్ద గొట్టిముక్కల,
మెదక్ జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

డార్క్ వాలంటైన్..



'శవ పేటికలపై పూలు ఎప్పటికీ అందంగా ఉండవు' అన్న నినాదం ధరించిన వేలాదిమంది మహిళలు అర్ధరాత్రి చిమ్మ చీకట్లో, కొవ్వొత్తుల కాంతులతో వీధుల్లో నిలబడి నిరసన తెలియజేశారు. మహిళలపై పెరుగుతున్న దాడులు, హత్యలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా వారంతా ఒక్కటయ్యారు. ఫిబ్రవరి 14న కెన్యాలో జరిగిన ఈ నిరసనల్లో వెయ్యి స్వచ్ఛంద సంస్థలు పాల్గొన్నాయి. 'డార్క్ వాలంటైన్' పేరుతో నిర్వహించిన ఈ కార్యక్రమం వెనుక ఎంతోమంది మహిళల వ్యథాభరిత జీవితాలున్నాయి.

ఎక్కడో ఒక చోట, ఏదో ఒక మూల కాదు, అత్యధిక శాతం మంది మహిళలు నిత్యం వేధింపులకు గురవుతున్నారు. జీవిత భాగస్వాములు, ప్రేమించిన వారు, పరిచయస్తుల చేతుల్లోనే వారి ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. ఈ దారుణాలు ఎంతకాలం? వీటికి అడ్డుకట్ట పడేదెప్పుడు? అన్న నినాదాలతో ప్రపంచవ్యాప్తంగా నిరసనలు జరుగుతూనే ఉంటాయి. కెన్యాలో కూడా అదే జరిగింది. ఏడాది ప్రారంభమైన ఈ స్వల్ప కాలంలో అక్కడ 30 మంది మహిళలు హత్యకు గురయ్యారు. హత్య చేసిన వారు ఆ మహిళలకు బాగా తెలిసినవారే. ఈ దారుణాలను ప్రశ్నిస్తూ కెన్యా వ్యాప్తంగా 'ఎండ్ ఫెమిసైడ్ కెన్యా మూమెంట్' పేరుతో ఓ ఉద్యమం చేస్తున్నారు. అందులో భాగంగానే ప్రేమికుల దినోత్సవం రోజున ఈ కార్యక్రమం నిర్వహించారు.

'మహిళలపై ఇంతటి దారుణాలు జరుగుతుంటే పాలకులు పట్టించుకోకుండా ఉంటే ఎలా? అందుకే దేశం దృష్టికి తీసుకెళ్లాలనే మేము ఈ నిరసన చేపట్టాం' అని చెబుతోంది 20 ఏళ్ల ఓ ఉద్యమకారిణి. పరిచయస్తుల చేతుల్లోనే మహిళలు దాడులకు గురవుతున్నారన్న వార్తలు ఆ దేశ ప్రధాన స్రవంతి మీడియాలో నిత్యం ఉంటున్నాయి. ఈ వార్తలపై కనీస స్పందన లేని పాలక యంత్రాంగం ఈ దాడులకు మహిళలే కారకులని తేల్చింది. అపరిచితులతో అతిగా మాట్లాడొద్దని హితవు పలికింది. ఈ వ్యాఖ్యలే మహిళా సంఘాలను ఉద్యమించేలా చేశాయి. జనవరి 20న కూడా 20 వేల మంది కెన్యా ప్రజలు వీధుల్లో నిరసన తెలియజేశారు. మహిళలపై జరుగుతున్న నేరాలపై తక్షణం చర్యలు తీసుకోవాలని నిందితులకు కఠిన శిక్షలు అమలు చేయాలని వారంతా వీధుల్లోకి వచ్చారు. తమపై జరుగుతున్న దాడులపై ఎంతోమంది మహిళలు తమ నిరసన గళాలు వినిపిస్తూనే ఉంటారు. అయితే ఇవి ఎక్కడో ఒక చోట కాదు, ప్రపంచం నలుమూలలా విస్తరించాల్సిన అవసరం ఉంది.

ఎండు చేపలతో మెండైన లాభాలు

ఎండు చేపలను ఇష్టంగా తినేవారు చాలామందే ఉంటారు. ఇవి రుచికే కాదు, అనేక రకాల ఆయుర్వేద గుణాలు కలిగి ఉంటాయని నిపుణులు అంటున్నారు.

క్యాల్షియం అధికం : ఎండు చేపల్లో క్యాల్షియం అధికంగా ఉంటుంది. కాబట్టి రక్తపోటుతో బాధ పడేవారు వీటిని క్రమం తప్పకుండా తీసుకుంటే, సులభంగా ఉపశమనం లభిస్తుంది. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడకుండా ఉంటారు.

ప్రోటీన్ లభ్యత : ఎండు చేపల్లో ప్రోటీన్ కూడా మెండుగా లభిస్తుంది. కాబట్టి వీటిని ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరంలో దెబ్బతిన్న కణాజాల నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తాయి. దీంతో పాటు శరీరంలోని హార్మోన్లు, ఎంజైమ్‌లు ఇతర రసాయనాల సమతుల్యం చేసేందుకు కూడా ఉపయోగపడతాయి.



కీళ్ల నొప్పులు : శరీరంలో యూరిక్ యాసిడ్ లెవల్స్‌ను తగ్గించే గుణం కూడా ఎండు చేపల్లో ఉంది. క్రమం తప్పకుండా తీసుకుంటే కీళ్ల నొప్పుల సమస్య తగ్గుతుంది.

గుండె ఆరోగ్యం : ఎండు చేపల్లో ఓమేగా 3 ఫ్యాటీ యాసిడ్స్ కూడా లభ్యమవుతాయి. వీటిని తీసుకుంటే రక్త నాళాలు శుభ్రం అవుతాయి. దీంతో గుండె ఆరోగ్యం కూడా మెరుగు పడుతుంది. వారానికి ఒకసారి అయినా ఎండు చేపల్ని తింటే.. రక్తం గడ్డ కట్టడం సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు.

ఆకాశవాణితో ఆత్మీయ బంధం

'ఆమె జీవితం మొదలైనప్పటి నుంచి నాకు తెలుసు. నా జీవిత భాగస్వామి కంటే ముందే తను పరిచయమైంది. ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఆమే నా లోకం. నేను నిద్ర లేచినప్పటి నుంచి రాత్రి పడుకునే వరకు నాతోనే ఉంటుంది. భోజనం చేసేటప్పుడు, పని చేసేటప్పుడు కూడా ఆమె నా పక్కన ఉండాల్సిందే' అని కేరళకు చెందిన 81 ఏళ్ల పెద్దాయన ఇంతలా ప్రేమిస్తున్న 'ఆమె' వ్యక్తి కాదు.. ఓ పనిముట్టు. ఆలిండియా రేడియో (ఎఐఆర్) బ్రాడ్‌కాస్టింగ్ మొదలైనప్పటి నుంచి రేడియోతో ఆయన ఆత్మీయ అనుబంధాన్ని పెనవేసుకున్నారు. 'రేడియో నా జీవితాన్ని మార్చేసింది' అంటున్న ఆ వ్యక్తి పేరు సి.కె.అలెగ్జాండర్. విశ్రాంత ఉపాధ్యాయుడు.

ఒక వ్యక్తిపై, వస్తువుపై ప్రేమానురాగాలు పెంచుకోవడం అందరూ చేసేదే. కానీ అలెగ్జాండర్ ప్రత్యేకం. రేడియో ప్రసారాలను అనుసరించడంతోనే ఆయన ఆగిపోలేదు. వాటిపై విశ్లేషణాత్మక చర్చలు జరుపుతూ ఎఐఆర్‌కి ఉత్తరాలు రాసేవారు. ఎంతలా అంటే ప్రతి కార్యక్రమంపై ఆయన స్పందించేవారు. అదే ఆయన్ను ప్రత్యేకంగా నిలబెట్టింది. ఉత్తమ రేడియో శ్రోతగా ఎంపికై 1980లో అప్పటి కేరళ కేంద్రమంత్రి పి.వసంత్ ద్వారా బహుమతి కూడా అందుకున్నారు.

'రేడియో పెన్ను' అని దానికి ముద్దు పేరు కూడా పెట్టుకున్నారు అలెగ్జాండర్. 'నా భార్య కంటే ముందే ఆమె (రేడియో) నా జీవితంలో భాగమైంది. పదేళ్ల క్రితం నా జీవిత భాగస్వామి నన్ను ఒంటరిని చేసి వెళ్లిపోయింది (చనిపోయింది). అప్పుడు, ఇప్పుడు కూడా నన్ను విడిచిపెట్టకుండా నాతోనే ఉండిపోయింది' అంటూ రేడియో గురించి చాలా గొప్పగా చెబుతారు అలెగ్జాండర్.

ఎఐఆర్ నుంచి అవార్డులు, ప్రశంసలు అందుకోవడం అలెగ్జాండర్‌కి కొత్త కాదు. ఇప్పటికి రెండు సార్లు ఎఐఆర్ నుంచి ఉచిత దేశ పర్యటన అవకాశాన్ని కూడా ఆయన అందుకున్నారు.



కార్యక్రమాలను వినడంతో సరిపెట్టక, తన విద్యార్థులకు వాటిని బోధించడం, ఆసక్తి గలవారికి అందులో శిక్షణ ఇచ్చి పలు కళా ప్రదర్శనల్లో వారిని విజేతలుగా నిలిపారు.

రేడియో గురించి ఒక్క మాటలో చెప్పమంటే.. 'తెల్లవారుజాము 4:30 గంటలకే సుప్రభాతంతో నన్ను మేల్కొల్పుతుంది. నా భోజనం, నిద్ర, పని చేస్తున్నప్పుడు నాతోనే ఉంటుంది. అందుకే ఆమె నా ప్రియమైన నేస్తం.' అంటారు అలెగ్జాండర్. 1995-96 సంవత్సరానికి గాను రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న అలెగ్జాండర్ 2019లో ఎఐఆర్ నుంచి 'శ్రవణశ్రీ' అవార్డు అందుకున్నారు. వస్తువులతో ఇంతలా బంధం పెనవేసుకునే అలెగ్జాండర్ లాంటి వ్యక్తులు చాలా అరుదుగా తారసపడుతుంటారు.

దసరాకి 'దేవర'



ఎన్టీఆర్, కొరటాల కాంబినేషన్‌లో వస్తున్న 'దేవర' సినిమా మరోసారి వాయిదా పడింది. గతంలోనే రెండు సార్లు వాయిదా పడుతూ వచ్చిన ఈ చిత్రం ఈసారి ఏకంగా దసరాకు షిఫ్ట్ అయింది. అక్టోబర్ 10న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ఓ ప్రకటన చేశారు. యువసుధా ఆర్ట్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. బాలీవుడ్ నటి జాన్వీకపూర్, మరాఠి నటి శ్రుతి మరాటే కథానాయికలుగా నటిస్తున్నారు.

'ఆ ఒక్కటి అడక్కు' అంటున్న నరేష్



అల్లరి నరేష్ హీరోగా 'ఆ ఒక్కటి అడక్కు' అనే సినిమా తెరకెక్కుతోంది. నరేష్ కెరియర్‌లో 61వ సినిమాగా తెరకెక్కుతోన్న ఈ చిత్రాన్ని అంకం మల్లి అనే కొత్త దర్శకుడు దర్శకత్వం వహిస్తున్నారు. చిలకా ప్రొడక్షన్స్ బ్యానర్లో తెరకెక్కుతున్న ఈ సినిమాకి భరత లక్ష్మీపతి సహ నిర్మాత. తాజాగా ఈ చిత్ర టైటిల్ అనౌన్స్ చేస్తూ ఫస్ట్ లుక్‌తో పాటు ఒక గ్లింప్స్ కూడా రిలీజ్ చేశారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో వెన్నెల కిషోర్, వైవా హర్ష, అరియనా గ్లోరీ తదితరులు ఇతర పాత్రలలో నటిస్తున్నారు. ఈ సినిమాతో జామీ లివర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. గోపి సుందర్ సంగీతం అందిస్తున్న ఈ సినిమాకి అబ్బూరి రవి కథ అందించారు. ఈ సినిమాని మార్చి 22వ తేదీన రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. గతంలో ఈ టైటిల్‌తోనే రాజేంద్రప్రసాద్ హీరోగా ఇవివి సత్యనారాయణ ఓ చిత్రం తెరకెక్కించారు.

'మహారాజా'గా మహేష్‌బాబు



మహేష్‌బాబు, రాజమౌళి కాంబినేషన్‌లో త్వరలో రాబోతున్న సినిమా 'మహారాజా' అని ప్రచారం జరుగుతోంది. అయితే ఇదింకా అధికారికంగా వెల్లడి కాలేదు. మహేష్‌బాబును రాజమౌళి కొత్త అవతారంలో చూడాలని భావిస్తున్నారట. దీనికోసం మహేష్‌బాబు ఇప్పటికే కసరత్తులు చేస్తున్నారు. ఆ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఇండోనేషియో నటి చెల్సియా ఎలిజబెత్ ఇస్లాన్, థోర్ సినిమాతో పాపులర్ అయిన క్రిస్ హెమ్స్‌వర్త్ ఈ సినిమాలో నటించనున్నారని సమాచారం.




'డర్టీ ఫెలో' పాట విడుదల

రాజ్ ఇండియా ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై శాంతిచంద్ర, దీపిక సింగ్, సిమ్రితి జంటగా నటించిన సినిమా 'డర్టీ ఫెలో'. ఆడారి మూర్తిసాయి దర్శకత్వం వహించారు. జిఎస్ బాబు నిర్మించారు. ఈ సినిమాలోని 'సందేవేళ' అంటూ సాగే పాటని 'బేబి' దర్శకుడు సాయి రాజేష్ రిలీజ్ చేశారు. 'సందెవేళ సాంగ్ చాలా బాగుంది. సినిమా రిలీజ్ అయ్యి మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని ఆయన పేర్కొన్నారు. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తామని శాంతిచంద్ర తెలిపారు.

కన్నడ నటి రుక్మిణికి అవకాశాలు

కన్నడ నటి రుక్మిణి వసంత్‌కు వరుస ఆఫర్లు వస్తున్నాయి. 'సప్త సాగరాలు దాటి ...' సినిమా ద్వారా ఆమె దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించారు. గతేడాది రెండు పార్టులుగా రిలీజైన ఈ సినిమాలో రుక్మిణి నటనకు మంచి మార్కులు పడ్డాయి. తెలుగులో పలు ఆఫర్లు వచ్చినప్పటికీ, కథలను బట్టి ముందుకెళ్తున్నట్లుగా సమాచారం. తాజాగా శివకార్తికేయన్ సినిమాలో హీరోయిన్‌గా అవకాశం పొందారు. తొలుత ఈ పాత్రకు పూజాహెగ్డే, మృణాల్ ఠాకూర్ పేర్లు వినిపించాయి. వారిని కాదని రుక్మిణిని చిత్ర బృందం ఎంపిక చేసింది. కాగా, ఇప్పటికే ఆమె తమిళంలో విజయ్ సేతుపతి నరసన ఓ సినిమా చేస్తున్నారు.



'డాన్' కొత్త హీరో



బాలీవుడ్‌లో 'డాన్' ఫ్రాంచైజీ మళ్లీ మొదలైంది. 1978లో అమితాబ్‌తో మొదలైన ఈ ఫ్రాంచైజీలో షారుక్ ఖాన్ మరో హీరోగా నటించారు. తాజాగా మూడవ తరం డాన్‌గా రణవీర్ సింగ్ సెలక్ట్ అయ్యారు. ఈ కొత్త ఫ్రాంచైజీకి కూడా తొలి రెండు భాగాలను తెరకెక్కించిన పర్హాన్ అక్తరే దర్శకత్వం చేయనున్నారు. సెప్టెంబర్ నుంచి ఈ చిత్రాన్ని మొదలుపెట్టనున్నారు. డాన్ పాత్ర కోసం రణవీర్ సింగ్‌ని ప్రత్యేక శిక్షణకు పంపతున్నారని సమాచారం.

అశ్విన్ @ 500వికెట్లు

- భారత్ 445ఆలౌట్
- డకెట్ సెంచరీ
- ఇంగ్లండ్ 207/2



రాజ్‌కోట్: భారత స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ మరో ఘనత సాధించాడు. టెస్టు క్రికెట్‌లో 500 వికెట్ల క్లబ్‌లో చేరాడు. రాజ్‌కోట్ వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడోటెస్ట్‌లో ఓపెనర్ జాక్ క్రాలేను ఔట్ చేసిన అశ్విన్.. 500వ వికెట్ ఖాతాలో వేసుకున్నాడు. దీంతో, ఈ ఫీట్ సాధించిన భారత 2వ, ఓవరాల్‌గా తొమ్మిదో బౌలర్‌గా రికార్డుపుటల్లోకెక్కాడు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ 89 పరుగుల వద్ద అశ్విన్ బౌలింగ్‌లో లెగ్ స్టంప్స్ వైపు పడిన బంతిని క్రాలే(15) స్వీప్ షాట్ ఆడాడు. ఫైన్ లెగ్‌లో ఉన్న రజత్ పాటిదార్ వెనక్కి పరుగెత్తి మరీ అద్భుత క్యాచ్ పట్టాడు. దాంతో, అశ్విన్ ఖాతాలో 500వ వికెట్ చేరింది. భారత దిగ్గజ స్పిన్నర్ అనిల్ కుంబ్లే(619 వికెట్లు) తర్వాత ఈ ఘనతను సాధించిన రెండో బౌలర్ అశ్విన్ మాత్రమే. ఓవరాల్‌గా శ్రీలంక లెజెండ్ ముత్తయ్య మురళీధరన్ 87 మ్యాచుల్లో ఐదొందల వికెట్లు తీయగా.. అశ్విన్ 98 టెస్టుల్లోనే ఈ మైలురాయికి చేరుకున్నాడు. అనిల్ కుంబ్లే 105 టెస్టుల్లో 500 వికెట్లతో మూడో స్థానంలో ఉన్నాడు.

ఓవర్‌నైట్ స్కోర్ 5వికెట్ల నష్టానికి 326పరుగులతో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్‌ను యువ వికెట్ కీపర్ జురెల్(46; 104బంతుల్లో 2ఫోర్లు, 3సిక్సర్లు), అశ్విన్(37; 89బంతుల్లో 6ఫోర్లు) ఆదుకున్నారు. ఆ తర్వాత వైస్ కెప్టెన్ బుమ్రా(26) కూడా పరుగులు రాబట్టడంతో భారత్ 445పరుగుల గౌరవప్రద స్కోర్‌కు చేరుకోగల్గింది. ఇంగ్లండ్ బౌలర్లు మార్క్ వుడ్‌కు నాలుగు, రెహాన్ అహ్మద్‌కు రెండు, ఆండర్సన్, హార్ట్‌లీ, రూట్‌కు ఒక్కో వికెట్ దక్కాయి.

అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ విధ్వంసకర సెంచరీతో ఇంగ్లండ్ పటిష్ట స్థితిలో నిలిచింది. మరో ఓపెనర్ జాక్ క్రాలీ 15 పరుగులకే అశ్విన్ బౌలింగ్‌లో వెనుదిరిగినా... బెన్ డకెట్ టీమిండియా బౌలింగ్‌ను సమర్థవంతం ఎదుర్కొన్నాడు. డకెట్ 118బంతుల్లోనే 133 పరుగులు చేశాడు. అతడి స్కోరులో 21ఫోర్లు, 2సిక్సులు ఉన్నాయి. రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 207 పరుగులు చేసింది. క్రీజ్‌లో బెన్ డకెట్, జో రూట్(9) ఉన్నారు. ఓలీ పోప్ 39పరుగులు చేసి సిరాజ్ బౌలింగ్‌లో అవుటయ్యాడు. టీమిండియా తొలి ఇన్నింగ్స్ స్కోరుకు ఇంగ్లండ్ ఇంకా 238 పరుగులు వెనుకబడి ఉంది.

భారత్‌కు ఐదుపరుగుల పెనాల్టీ

భారతజట్టు 5పరుగుల పెనాల్టీని సమర్పించుకొంది. నిబంధనలకు విరుద్ధంగా బ్యాటర్ పిచ్ మధ్యలోని 'రక్షిత ప్రాంతం'లో పరుగు తీస్తే.. ఇలా పెనాల్టీ పరుగులను సమర్పించుకోవాల్సి వస్తుంది. రవిచంద్రన్ అశ్విన్ ఇలా చేయడంతో అది గుర్తించిన ఆన్‌ఫీల్డ్ అంపైర్లు రోహిత్ సేనకు ఐదు పరుగుల పెనాల్టీ విధించారు. ఫలితంగా ఒక్క బంతిని కూడా ఎదుర్కోకుండానే ఇంగ్లండ్‌కు 5 పరుగులు వచ్చాయి. 102వ ఓవర్‌లో ఇంగ్లండ్ బౌలర్ రెహాన్ అహ్మద్ వేసిన బంతిని అశ్విన్ ఆఫ్-సైడ్‌లో ఆడి సింగిల్ కోసం పరిగెత్తాడు. ఆ సమయంలో పిచ్‌పైన ఉన్న 'ప్రొటెక్టెడ్ ఏరియా'లో రెండు మూడు అడుగులు వేసి.. వెంటనే దూరంగా వెళ్లాడు. అయితే, అంపైర్.. అశ్విన్ చర్యను గుర్తించి భారత జట్టుకు ఐదు పెనాల్టీ పరుగులు విధిస్తున్నట్లు సిగ్నల్ ఇచ్చాడు. దీని గురించి అశ్విని అంపైర్‌తో చర్చించినా ఫలితం లేకపోయింది.

టెస్టుల్లో అత్యధిక వికెట్లు తీసిన భారత బౌలర్లు

1.	అనిల్ కుంబ్లే	: 619(236ఇన్నింగ్స్)
2.	రవిచంద్రన్ అశ్విన్	: 500(184 „)
3.	కపిల్ దేవ్	: 434(227 „)
4.	హర్భజన్ సింగ్	: 417(190 „)
5.	ఇషాంత్ శర్మ	: 311(188 „)

చరిత్ర సృష్టించిన మహిళా షట్లర్లు

- హాంకాంగ్‌పై 3-0 గెలుపుతో పతకం ఖాయం
- ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఛాంపియన్ షిప్



కౌలాలంపూర్: ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ ఛాంపియన్‌షిప్‌లో భారత మహిళల జట్టు చరిత్ర సృష్టించింది. శుక్రవారం జరిగిన క్వార్టర్‌ఫైనల్లో భారత్ 3-0తో హాంకాంగ్ మహిళలను చిత్తుచేసి సెమీస్‌కు చేరి పతకం ఖాయం చేసుకుంది. దీంతో భారత మహిళలజట్టుకు కనీసం కాంస్య పతకం దక్కనుంది. ఈ టోర్నమెంట్ చరిత్రలో మహిళల బృందానికి పతకం దక్కడం ఇదే తొలిసారి. తొలి లీగ్‌లో పటిష్ట చైనాపై 3-2తో ఓడించడంతో భారత్‌కు ఊరటనిచ్చే అంశం. నేడు జరిగిన తొలి సింగిల్స్‌లో పివి సింధు 21-7, 16-21, 21-12తో సిన్-యన్-హాప్పీపై విజయం సాధించి భారత్‌ను 1-0 ఆధిక్యతలో నిలిపింది. మహిళల డబుల్స్‌లో తానీషా-అశ్విని జంట 18వ ర్యాంకర్ జంటపై 21-10, 21-14తో కేవలం 35నిమిషాల్లోనే మ్యాచ్‌ను ముగించి భారత్‌కు 2-0 ఆధిక్యతో నిలిపింది. ఇక మూడో సింగిల్స్ మ్యాచ్‌లో అస్మిత 21-12, 21-13తో యంగ్-సుమ్-యీపై విజయం సాధించడంతో మరో రెండు మ్యాచ్‌లు మిగిలిన ఉండగానే విజయం ఖాయమైంది. సెమీస్‌లో భారత మహిళల జట్టు జపాన్‌తో తలపడనుంది.

ఇక పురుషుల బృందం సెమీస్‌కు చేరడంలో విఫలమైంది. శుక్రవారం జరిగిన నాకౌట్ పోరులో భారత పురుషుల జట్టు 2-3తో జపాన్ చేతిలో ఓడింది. తొలి సింగిల్స్‌లో ప్రణయ్ 16-21, 24-26తో నిషిమోటో చేతిలో ఓటమిపాలవ్వడగా.. డబుల్స్‌లో సాత్విక్-చిరాగ్ 21-15, 21-17తో నెగ్గి స్కోర్‌ను 1-1తో సమం చేశారు. లక్ష్యసేన్ 21-19, 22-20తో నెగ్గినా.. మరో డబుల్స్‌లో అర్జున్-ధృవ్ కపిల 17-21, 15-21తో ఓడారు. నిర్ణయాత్మక చివరి సింగిల్స్‌లో కిదాంబి శ్రీకాంత్ పోరాడి ఓడాడు. కిదాంబి 21-17, 9-21, 20-22తో టాప్‌సీడ్ కెంటో మొమొటో చేతిలో పోరాడి ఓడాడు.

ఆంధ్ర 260/7

విశాఖపట్నం: రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బిలో కేరళతో శుక్రవారం నుంచి ప్రారంభమైన మ్యాచ్‌లో కెప్టెన్ రికీ బుయ్, మహేశ్ అర్ధసెంచరీలతో రాణించారు. తొలుత రేవంత్‌రెడ్డి(0), అశ్విన్ హెబ్బర్(28), మాజీ కెప్టెన్ హనుమ విహారి(24) నిరాశపరిచినా.. మహేశ్ కుమార్(81), కెప్టెన్ రికీ బుయ్(79) అర్ధసెంచరీలతో బ్యాటింగ్‌లో మెరిసారు. ఆ తర్వాత కరణ్ షిండే(43) రాణించినా.. చివర్లో రషీద్(0), షోయబ్(5) తక్కువ స్కోర్‌కే పెవీలియన్‌కు చేరారు. దీంతో తొలిరోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు 89ఓవర్లలో 7వికెట్లు నష్టపోయి 260పరుగులు చేసింది.

న్యూజిలాండ్ క్లీన్‌స్వీప్

హామిల్టన్: రెండోటెస్ట్‌లోనూ న్యూజిలాండ్ జట్టు దక్షిణాఫ్రికాను చిత్తుచేసి 2-0తో టెస్ట్ సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసింది. ఓవర్‌నైట్ స్కోర్ వికెట్ నష్టానికి 40పరుగులతో శుక్రవారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన న్యూజిలాండ్‌ను విలియమ్సన్(133నాటౌట్), యంగ్(60 నాటౌట్) రాణించారు. దీంతో దక్షిణాఫ్రికా నిర్దేశించిన 267 పరుగుల లక్ష్యాన్ని న్యూజిలాండ్ 94.2ఓవర్లలోనే ఛేదించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68